వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా
వేంరెడ్డి నరేందర్‌రెడ్డి,
అభిషేక్ మను సింఘ్వీ
03


సంపుటి 28, సంచిక: 251 | గురువారం | 05-03-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




ఇరాన్ సర్వాధినేతగా

## మోజ్తాబా ఖమేనీ?

**టెహ్రాన్:** అలీ ఖమేనీ కుమారుడు మోజ్తాబా ఖమేనీ (56) ఇరాన్‌కు కాబోయే సర్వాధినేతగా ఎన్నికైనట్లు వార్తలు వెలువడ్డాయి. అలీ ఖమేనీ సజీవంగా ఉన్నప్పుడే ఈ నిర్ణయం జరిగింది. గత ఏడాది జూన్‌లో ఇజ్రాయెల్– అమెరికా వరుసగా ఇరాన్‌పై దాడులు చేసినప్పుడే ఈ వార్త వచ్చింది. ఫిబ్రవరి 28వ తేదీన అలీ ఖమేనీ హత్యకు గురైన తర్వాత ముగ్గురు సభ్యులతో తాత్కాలిక పరిపాలన మండలి ఏర్పడింది. నిర్ణీత ప్రకారం మార్చి మూడో తేదీన ఈ పాలనా మండలి సమావేశమై ముజ్తాబా ఖమేనీని తదుపరి ఇరాన్ సర్వాధినేతగా ఎన్నుకోవాల్సి ఉండగా ఉద్ధృత దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడి సంబంధిత అసెంబ్లీ కౌన్సిల్ కార్యాలయాన్ని ధ్వంసం చేసింది. దీంతో ముజ్తాబా ఖమేనీ లాంఛనపూర్వక ఎన్నిక తరువాయి 2లో

# యుద్ధం ఎల్లలు దాటింది

పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లుతో అవిశ్రాంత దాడులు చేస్తుండగా, అమెరికా– ఇజ్రాయెల్ గతంకంటే భిన్నంగా రెట్టింపు భారీగా పేలుడు పదార్థాలు, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ వ్యాప్తంగా దాడులు చేయడంతో అన్ని ప్రాంతాలు పొగలు కక్కుతున్నాయి.

## అగ్నికీలల్లో పశ్చిమాసియా

- ఇరాన్‌పై దాడుల్లో మొత్తం 1,097 మంది మృతి
- పశ్చిమాసియాలో ఆర్థికవ్యవస్థలను,సైన్యాలను తుడిచిపెడతాం : ఐఆర్‌జిసి తీవ్ర హెచ్చరిక
- పేలుళ్ళతో హోరెత్తిన ఇరాన్,ఇజ్రాయెల్,గల్ఫ్‌దేశాలు
- అమెరికా దౌత్య కార్యాలయాలు దహనం
- 50 ఇరాన్ నగరాలపై దాడులు
- అత్యంత ఆధునిక ఆయుధాలు దాచి ఉంచాం : ఇరాన్
- హోర్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకున్న ఐఆర్‌జిసి
- ఖతార్‌లో కీలక అమెరికా రాడార్ వ్యవస్థపై దాడి
- స్టాక్‌మార్కెట్లు పతనం, పెరుగుతున్న చమురు ధర



**దుబాయ్:** యుద్ధం ఐదోరోజు పరాకాష్ఠకు చేరడంతో వైరిపక్షాల పరస్పర దాడులతో పశ్చిమాసియా అగ్నికీలల్లో దగ్ధమవుతోంది. ఇరాన్ నాయకత్వం, భద్రతా దళాలు,క్షిపణి తయారీ కేంద్రాలే లక్ష్యంగా అమెరికా–ఇజ్రాయెల్ భీకర దాడులు చేశాయి. ఇరాన్ కూడా దీటుగా వందల క్షిపణులతో అమెరికా–జియోనిస్టు శత్రువులపై దాడి చేసింది. ఖతార్‌లో కీలక యుఎస్ రాడార్ వ్యవస్థపై దాడి చేసింది. దీంతో అమెరికాకు పెద్ద ఎదు రు దెబ్బ తగిలింది. పశ్చిమ ఆసియాలో సైన్యాన్ని, ఆర్థిక వ్యవస్థలను సం పూర్ణంగా తుడిచిపెడతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అతి తీవ్రమైన హెచ్చరిక చేసింది. అందుకు తగ్గట్టుగానే ప్రాంతీయ దేశాల ఆర్థిక మౌలిక వ్యవస్థలపై దాడులు చేసింది. ఇరాన్‌పై యుద్ధం ఎల్లలు దాటి హిందూమహాసముద్రం దాకా విస్తరించింది. శ్రీలంక సమీపంలో ఇరాన్ యుద్ధ నౌక ''ఐఆర్ఐఎస్ దేనా''ను అమెరికా దళాలు జలాంతర్గామితో దాడిచేసి నీట ముంచేశాయి. భారీ ఆయుధాలు,క్షిపణులతో వెళుతున్న జలాంతర్గామి టార్పెడోలతో తామే ఈ దాడి చేసినట్లు అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ ప్రకటించడంతో యుద్ధం ఎల్లలుదాటి పరాకాష్ఠకు చేరింది. పశ్చిమాసియాలో అన్ని ఆర్థిక కేంద్రాలపై దాడులు చేస్తామని, మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలను ఇప్పటివరకూ యుద్ధంలో ఉపయోగించలేదని, దాచిపెట్టి తరువాయి 2లో

## ఇరాన్ యుద్ధనౌకపై యుఎస్

# జలాంతర్గామి దాడి

- 140 మంది సైనికులు,సిబ్బంది మృతి
- 32 మందిని కాపాడిన శ్రీలంక సైన్యం
- 80 మృతదేహాలు స్వాధీనం : కొనసాగుతున్న గాలింపు
- విశాఖపట్నం తీరంలో జరిగిన విన్యాసంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా అమెరికా జలాంతర్గామి టార్పెడో దాడి
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత శత్రు నౌకను నీట ముంచడం ఇదే మొదటి సారి



**కొలంబో:** పశ్చిమాసియాలో శత్రు దేశాలమధ్య పరస్పర భీకర దాడులు జరుగుతున్న సమయంలో, హిందూమహాసముద్రంలో వెళుతున్న ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామి టార్పెడోతో దాడిచేసింది. ఈ దాడిలో ఇరాన్ 'ఐరిస్' యుద్ధనౌక నీట మునిగిపోయింది. శ్రీలంక దక్షిణతీరంలో గాలె తీరానికి 40 నాటికల్ మైళ్ళ దూరంలో బుధవారం జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. తీరంలో ఏదో నౌక మునిగిపోతున్నట్లు సమాచారం అందుకున్న శ్రీలంక రక్షణ దళాలు తక్షణం విమానాలు నౌకలతో ఆ ప్రాంతానికి చేరుకుని మునిగిపోతున్న నౌకలోంచి 32 మందిని తరువాయి 2లో

## కేంద్ర హోం మంత్రితో సిఎం భేటీ

### మావోయిస్టుల లొంగుబాటు, ఐపిఎస్‌ల కేటాయింపుపై చర్చ



ప్రజాపక్షం/హైదరాబాద్ / న్యూఢిల్లీ

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపిఎస్ అధికారుల సంఖ్యను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని,2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందన్నారు. ఆ సమయంలోనూ కేవలం 7 గురు ఐపిఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని సీఎం వివరించారు. దేశంతో పాటు తరువాయి 2లో

## యుద్ధంలో ట్రంప్‌కు సహకరించని నాటో దేశాలు

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ట్రంప్–నెతన్యాహూ ఏకపక్ష యుద్ధంపై అమెరికా–యూరప్ నాటో మిత్రదేశాల మధ్య విభేదాలు మొదలయ్యాయి! సైప్రస్‌లో ఇరాన్ క్షిపణుల దాడులతో అక్కడి స్థావరాన్ని ఖాళీ చేయడమే కాకుండా తన స్థావరాలు ఉపయోగించుకోవచ్చునని ముందు చెప్పిన తర్వాత మాట మార్చిన బ్రిటన్ ప్రధాన మంత్రి స్టార్‌మర్‌తో ఈ విభేదాలు మొదలయ్యాయి. ఈ యుద్ధానికి చాలా యూరప్ దేశాలు దూరంగా ఉన్నాయి.

## మమ్మల్ని ఏం చేయలేరు

స్పెయిన్ ప్రధాని



**మాడ్రిడ్:** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్నిస్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులు చాలా నిర్లక్ష్యపూరితం, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని విమర్శించారు. లక్షలాదిమంది ప్రజల భవిష్యత్తు, వారి విధి రాతతో ''రష్యన్ రౌలెట్'' ఆటలాడుతున్నారని అన్నారు. అమెరికాకు తరువాయి 2లో

## స్పెయిన్‌తో వాణిజ్యం కటీఫ్

ట్రంప్ బెదిరింపు



**వాషింగ్టన్:** ఇరాన్‌పై యుద్ధానికి వీలుగా యూరప్ దేశాలు తనకు సహకరించడంలేదని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెయిన్ దేశంతో వాణిజ్యాన్ని ఆపేస్తామని ట్రంప్ హెచ్చరిక చేశారు. అదేవిధంగా బ్రిటన్ ప్రధాన మంత్రి కీవ్ స్టార్‌మర్‌పై కూడా మండిపడ్డారు. తానేమీ విన్‌స్టన్ చర్చిల్ లాంటి గొప్ప ప్రధానమంత్రితో డీల్ చేయడంలేదని ఎద్దేవా చేశారు. బ్రిటన్ స్థావరాలు యుద్ధంలో వాడుకోవడానికి ఇవ్వలేదని విమర్శించారు. యూరప్ దేశాలు రక్షణకోసం ఎక్కువశాతం ధనాన్ని కేటాయించేందుకు, తరువాయి 2లో

## వేతనాలపై ఉపాధ్యాయులు ఆందోళన చెందొద్దు

- తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన నివేదిక సిఫార్సు మాత్రమే
- కమిటీలు సమర్పించిన నివేదికలపై చర్చించి ఏప్రిల్ చివరి నాటికి నూతన విద్యా పాలసీనీ ప్రభుత్వానికి సమర్పిస్తాం
- తెలంగాణ విద్యా పాలసీ చైర్మన్ కేశవరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన నివేదిక కేవలం సిఫార్సు మాత్రమేనని, వేతనాల అంశంలో ఉపాధ్యాయులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ విద్యా పాలసీ చైర్మన్ కె.కేశవరావు సూచించారు. ఉపాధ్యాయుల వేతనాన్ని వెలకట్టలేమని, వారికి ఎంత ఇచ్చినా తక్కువేనన్నారు. విద్యా కమిషన్‌తో పాటుమరో 11 విద్యా కమిటీలు సమర్పించిన 14 నివేదికలపై చర్చించి, అందరి అభిప్రాయాల మేరకు ఏప్రిల్ చివరి నాటికి నూతన విద్యా పాలసీని ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు.హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కె.కేశవరావు మాట్లాడుతూ వారం రోజుల్లో ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించి, మాట్లాడుతామన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ సమర్పించిన నివేదిక కేవలం సిఫార్సులు మాత్రమేనని, సిఫార్సులు చేసిన వారు తమ అధ్యయనాలు, అభిప్రాయాలను వ్యక్తం చేస్తారని, అంత మాత్రాన వాటన్నింటినీ యథాతథంగా తెలంగాణ విద్యా పాలసీలో పొందుపర్చబోమని వివరించారు. మొత్తం 14సిఫార్సులను పరిశీలించి, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులతో చర్చించిన తర్వాతనే హైపవర్ కమిటీ నూతన విద్యా పాలసీని రూపొందించి, ఆ పాలసీని పబ్లిక్ డొమెన్‌లో అందుబాటులో పెడతామని, దీనిపైన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాతనే ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆయన వెల్లడించారు. ఈ పాలసీలోని అంశాల అమలు, వాటి సాధ్యాసాధ్యాలపైన మంత్రివర్గంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉంటాయని కేశవరావు స్పష్టం చేశారు. ఇది వరకే తమకు పలు ఉపాధ్యాయ సంఘాలు కూడా సిఫార్సులతో కూడిన నివేదికను సమర్పించాయని, వీటన్నింటిపైన చర్చ ఉంటుందన్నారు. ఉపాధ్యాయు ల విద్యా భోదనల వల్లనే సమాజంలో ఎంతో మంది మేధావులను, అన్ని తరువాయి 12లో

## గిఫ్ట్ డీడ్ రద్దుపై కలెక్టర్ రెండో అప్పీల్ విచారణ చెల్లదు

స్పష్టం చేసిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం కింద గిఫ్ట్ డీడ్ రద్దు వ్యవహారంలో కలెక్టర్ ఆదేశాలపై కమిషనర్ వద్ద రెండో అప్పీల్ విచారణకు చట్టంలో అవకాశం లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. కమిషనర్ ఆదేశాల తర్వాత కలెక్టర్ రెండోసారి అప్పీల్ పిటిషన్‌ను విచారణ చేసి ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుపట్టింది. చట్టం నిర్దేశించిన పరిధిని మించి కమిషనర్ జోక్యం చేసుకున్నారని ఆక్షేపించింది. కమిషనర్ ఆదేశాల ఆధారంగా కలెక్టర్ జారీ చేసిన గిఫ్ట్ డీడ్ రద్దు ఉత్తర్వులను రద్దు చేసింది. కలెక్టర్ రెండో అప్పీల్‌ను సమర్థిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కూడా కొట్టేసింది. సీనియర్ సిటిజన్స్ చట్టంలో రెండోసారి అప్పీల్ పిటిషన్‌ను కలెక్టర్ విచారణ చేయడాన్ని మాత్రమే రద్దు చేస్తున్నామని, గిఫ్ట్ డీడ్‌లోని అంశాల జోలికి వెళ్లడం లేదని, గిఫ్ట్‌డీడ్‌లోని ఆస్తుల వ్యవహారంపై సివిల్ కోర్టులో తేల్చుకోవాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ ఇటీవల వెలువరించిన తీర్పులో స్పష్టం చేసింది. మెద్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలం కోతపేటలోని 247 చదరపు గజాల నివాస స్థలాన్ని, ఇంటిని సి.రాములు తన తరువాయి 12లో





## సింగూర్ పునరుద్ధరణలో ఎలాంటి రాజీ ఉండదు

- హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగా నిలిచిన సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం
- స్వయంగా ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తా
- డ్యామ్ భద్రతకు సంబంధించి జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల హెచ్చరికలు వచ్చాయ్
- డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగా నిలిచిన సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క) ,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదల శాఖా ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంట నగరాలరే తాగునీటిని, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. డ్యామ్ భద్రతకు తరువాయి 12లో

## నేడు నేపాల్‌లో ఎన్నికలు

యువతరం ఆశలు, ఆర్థిక సవాళ్ళమధ్య కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సిద్ధమైన ఓటర్లు



**కాఠ్మండు:** నేపాల్ లోని 77 జిల్లాలో మార్చి ఐదో తేదీ గురువారం జరిగే పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఆ దేశ హోంమంత్రిత్వశాఖ బుధవారం తెలియజేసింది. యువతరం ఆశలు, ఆర్థిక సవాళ్ళమధ్య కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. ఓటింగ్‌లో పాల్గొనేందుకు దేశంలోనే నగర ప్రాంతాలలో ఉన్న ఓటర్లు తమ తమ స్వస్థలాలకు భారీ సంఖ్యలో తరలి వెళుతూ ఉండటంతో అంతర్గత రవాణా వ్యవస్థ, రోడ్లు రద్దీతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. నేపాల్‌లో అత్యధిక జనాభాగల కాఠ్మండు లోయ నుండి 8,00,000 మంది ప్రజలు తమ తమ స్వస్థలాలకు వెళుతున్నారని అధికారులు ప్రకటించారు. నేపాల్‌లో ఉన్న మూడుకోట్ల మంది జనాభాలో పదోవంతు ప్రజలు ఉపాధి, విద్యావసరాల నిమిత్తం కాఠ్మండు లోయలోనే నివసిస్తున్నారు. నేపాల్‌లో ఉన్న 80 శాతం భూభాగంలో ఎక్కువ శాతం పర్వత ప్రాంతమే. అవినీతి ఆరోపణలతో 2025 సెప్టెంబరులో జనరేషన్ జెడ్ ఉద్యమం కెరటంలా ఎగసిపడి ప్రభుత్వ పతనానికి కారణమైంది.ఈ హింసాత్మక ఉద్యమంలో అనేకమంది మరణించారు. దేశ ఎన్నికల్లో పోటీచేస్తున్న 3,400 మంది అభ్యర్థులలో 1000 మంది అభ్యర్థులు 40 ఏళ్ళ లోపు వయసుగలవారే తరువాయి 12లో

## ఇళ్ల స్థలాలు దొరికేనా..?



▫ పెరిగిన పట్టణీకరణతో ఇబ్బందులు ▫ ముంచుకొస్తున్న నివాస స్థలాల ముప్పు ▫ దృష్టి సారించని పాలకులు

ప్రజాపక్షం/ ఖమ్మం

పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా నివాస స్థలాల సమస్య ముంచుకొస్తున్నది. రెండు దశాబ్దాల కాలంలో శరవేగంగా జరిగిన పట్టణీకరణ ఈ పరిస్థితికి కారణమైంది. వ్యవసాయ రంగ సంక్షోభం కారణంగా గతంలో ఎన్నడూలేనివిధం గా పల్లెల నుంచి పట్టణాలకు వలస ప్రారంభమైంది. ముఖ్యంగా 21వ శతాబ్దంలో పల్లెలు ఖాళీ అయి పట్టణాలు కిక్కిరిసిపోయేందుకు పాలకుల వైఖరి, ప్రకృతి వైపరీత్యాలు, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు కా రణమయ్యాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాలకు పట్టణాల్లో జీవించడం స్టేటస్ సింబల్‌గా మారింది. గ్రా మాలను వదిలి పట్టణ బాట పట్టగా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, పెరిగిన యాంత్రీకరణ, గిట్టుబాటు కాని సాగు, వరుసగా వచ్చిన ప్రకృతి వైపరీత్యాలు గ్రామీణ పేదలను పొట్టచేత పట్టుకుని పట్టణానికి వచ్చేలా చేశాయి. అదే సమయంలో బతుకు దెరువుకు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా అవకాశాలు ఉండడంతో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు పట్టణాలకు చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత జనాభా కంటే పట్టణ, నగరాల జనాభా ఎక్కువగా పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 15 లక్షల తరువాయి 2లో

### డ్రగ్స్ ముఠాల నిర్మూలనకు...

# ఈక్వెడార్‌లో సైనిక చర్య

**వాషింగ్టన్ :** దక్షిణ అమెరికా ఈక్వెడాన్‌లో మాదక ద్రవ్యాల ఉగ్రవాద ముఠాలపై దాడులు ప్రారంభమయ్యాయి. అమెరికా–ఈక్వెడార్ సైన్యాలు ఉమ్మడిగా ఈ దాడులు ప్రారంభించాయని యుఎస్ మిలిటరీ సదరన్ కమాండ్ ప్రకటించింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడంకోసమే ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఎక్స్ వేదికగా సదరన్ కమాండ్ తెలియజేసింది. మాదక ద్రవ్యాల ముఠాలపై చేస్తున్న యుద్ధంలో ప్రాంతీయ మిత్రదేశం అమెరికా కూడా పాల్గొనడాన్ని ఒక కొత్త దశగా ఈక్వెడార్ అధ్యక్షుడు డేనియల్ నోబోవా ప్రకటించిన మరునాడే ఈ కసైనిక ఆపరేషన్ ప్రారంభమైంది. దేశంలో విదేశీ సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకోవడానికి ముఖ్యంగా తూర్పు పసిఫిక్ ప్రాంతాలలో తన ఉనికిని విస్తరించుకోవాలని దృఢ సంకల్పంతో ఉన్న అమెరికాను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈక్వెడార్ ప్రజలు ఓటింగ్ ద్వారా ఇచ్చిన పెద్ద తీర్పు ట్రంప్‌కు చెంపపెట్టుగా మారింది. ఈ పరిణామం తర్వాత డ్రగ్ ముఠాల నిర్మూలన పేరుతో ట్రంప్ ఇప్పుడు మళ్ళీ ఈక్వెడార్‌లో కాలుపెట్టారు. వ్యవస్థీకృత నేరాలను నిర్మూలించాలని చెబుతున్న ట్రంప్‌కు ఈక్వెడార్ అధ్యక్షుడు నోబోవా పెద్ద మిత్రుడుగా అవతరించారు.



ప్రపంచంలో 70 శాతం కొకైన్ రవాణా ఇప్పుడు ఈక్వెడార్‌లోని ఓడ రేవుల ద్వారా రవాణా జరుగుతోందని, ఈక్వెడార్ ఇప్పుడు ఈ అక్రమలావాదేవీలకు, కార్యకలాపాలకు ఒక కేంద్రంగా మారిందని, దీనిని నిర్మూలిస్తామని ప్రకటించారు. మాదక ద్రవ్యాల ముఠాలకు ఈక్వెడార్ భూభాగాలు చాలా లాభదాయకమైన ప్రాంతంగా మారిందని ఆయన అన్నారు. ప్రపంచంలోనే ఎక్కడాలేనివిధంగా కొలంబియా, పెరూ దేశాలలో కొకైన్ ను డ్రగ్ ముఠాలు భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ రెండు దేశాలకు పొరుగున దేశమే ఈక్వెడార్. మాదక ద్రవ్యాలు అమెరికాలోకి అక్రమంగా రవాణా చేస్తున్నారంటూ ట్రంప్ కొలంబియా, పెరూ సహా వెనిజులా, మెక్సికో దేశాలపై కూడా ట్రంప్ ఇంతకు ముందు తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాలోకి వలసలు వచ్చేవారంతా నేరస్థులేననీ, వారంతా దేశంలో హింస సృష్టిస్తున్నారని, మాదక ద్రవ్యాలకు దేశాన్ని నిలయంగా మార్చారని ఏడాదిన్నరకాలంగా ట్రంప్ విమర్శిస్తూ అధికారంలోకి వచ్చాక ఆ పేరుతో అమానవీయ చర్యలకు తెరతీశారు.

# పశ్చిమాసియా యుద్ధరంగంలోకి ఫ్రాన్స్

### విమానవాహక అణుయుద్ధనౌక, రాఫెల్ జెట్స్ తరలింపు
### ఇరాన్‌పై దాడికి వ్యతిరేకం.. కానీ ఇది మిత్రధర్మం : మేక్రాన్



**పారిస్ :** పశ్చిమ ఆసియాలో నాటో మిత్రదేశాల ఆస్తులను సంరక్షించేందుకు రక్షణగా అణుశక్తితో నడిచే విమాన వాహక యుద్ధనౌకను బాల్టిక్ సముద్రం నుండి మధ్యధరా సముద్ర జలాలకు తరలించాలని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ రక్షణ దళాలకు ఆదేశించారు. ఫ్రాన్స్ తన అణ్వాయుధ సామాగ్రిని పెంచుతోందని, నాటో మిత్రదేశాలకు మద్దతుగా ఆస్తుల సంరక్షణకోసం, మిత్రదేశాల అణ్వాయుధ యుద్ధ విమానాలను మోహరించడానికి తాత్కాలికంగా సహాయం చేస్తుందని మేక్రాన్ చెప్పారు. ఫ్రిగేట్స్, దాని వైమానిక విభాగం ఛార్లెస్ డీ గల్లెకు రక్షణగా వెంట ఉంటాయన్నారు. గత కొద్ది గంటలలోనే పశ్చిమ ఆసియాలో రాఫెల్ ఫైటర్ జెట్‌లను, వైమానిక రక్షణ వ్యవస్థలను, వైమానిక రాడార్ వ్యవస్థలను మోహరించామని ఫ్రాన్స్ టీవీకి ముందుగా రికార్డు చేసిన వీడియో ద్వారా తెలియజేశారు. సైప్రస్ నుండి బ్రిటన్ వైదొలగిన తర్వాత ఆ దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని, సైప్రసళ్ యూరోపియన్ యూనియన్‌లో సభ్యదేశంగా ఉండటమే కాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యంపై సంతకం చేసిందని, అందువల్ల ఆ దేశాన్ని కాపాడాలని మేక్రాన్ వివరణ ఇచ్చారు. అదేవిధంగా ఖతార్, కువైత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో కూడా ఫ్రాన్స్‌కు బలమైన బంధం ముడిపడి ఉందని, జోర్డాన్, ఇరాక్‌లతో కూడా బలమైన నిబద్ధతతో ఉన్నామని, అన్నారు. ఇప్పుడు యుద్ధం లెబనాన్‌కు వ్యాపించిందని గుర్తుచేశారు. ఇరాన్ మద్దతు గల హెజ్బొల్లా సంస్థ ఇజ్రాయెల్‌పై దాడి చేయడం ద్వారా లెబనాన్ ప్రజలను ప్రమాదంలో పడేసిందని ఆయన అన్నారు. ఐతే ఇజ్రాయెల్ కూడా లెబనాన్‌లోకి సైన్యాన్ని తరలించడం తీవ్ర ప్రమాదకర తప్పిదమని అన్నారు. లెబనీస్ భూభాగాన్ని, దాని సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడాల్సి ఉందని తాను ఇజ్రాయెల్‌ను కోరుతున్నానన్నారు. నియమబద్ధమైన అంతర్జాతీయ క్రమానికి, అంతర్జాతీయ సూత్రాలకు ఫ్రాన్స్ తన సంప్రదాయబద్ధమైన మద్దతును కొనసాగిస్తుందన్నారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు అంతర్జాతీయ చట్టాలకు అతీతంగా జరిగినందువల్ల తాము వాటిని సమ్మతించడంలేదన్నారు. వీలైనంత త్వరగా యుద్ధం ముగియాలని కోరుకుంటున్నామన్నారు. దౌత్యచర్చల పునరుద్ధరణ ద్వారానే ఈ ప్రాంతంలో శాంతి సాధ్యమని అన్నారు. ఇరాన్ ప్రజలు తమ సొంత భవిష్యత్తును తామే స్వయంగా ఎంచుకోవాలన్నారు. తమ సొంత ప్రజలను ఉరితీసిన నాయకుడికోసం ప్రజలు ఏనాడూ దుఃఖించరని ఖమేనీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సంఘర్షణకు ఇరాన్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. లెబనాన్‌లో హెజ్బొల్లా, ఇరాక్‌లో షియా ఉగ్రవాదులు, యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులు,గాజాలో హమాస్ ఉగ్రవాదులకు ఆయుధాలు,ఆర్థిక సహాయం అందిస్తూ వాటిని పెంచిపోషించిందని, ఇజ్రాయెల్ దేశ నాశనమే లక్ష్యంగా ఇరాన్ పనిచేసిందని వీటన్నింటికీ ఇరాన్ పాలకులు బాధ్యత వహించాలన్నారు. అవసరమైన మేరకు తాము ప్రయత్నం చేస్తామన్నారు. గతవారం ఇరాన్‌పై జరిపిన దాడుల్లో అమెరికా–ఇజ్రాయెల్‌తో కలిసి తాము పాల్గొనలేదని ఫ్రాన్స్,బ్రిటన్, జర్మనీ ఈపాటికే చెప్పాయి. ఇరాన్ ప్రయోగించే డ్రోన్ల నుండి రక్షణాత్మక చర్యలకు మాత్రం సంసిద్ధత వ్యక్తం చేశాయి.

## సుప్రీంనేతగా ఎవర్ని ఎన్నుకున్నా చంపేస్తాం : ఐ.డి.ఎఫ్

**జెరూసలెం :** ఇరాన్ సర్వాధినేతగా ఎవరిని ఎన్నుకున్నాగానీ వారిని హతమారుస్తామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐ.డి.ఎఫ్) శపథం చేసింది. ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ బుధవారం ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ అధిపతిగా ఎవరు నియమితులైనా, ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనే ఆలోచనలతో ఆ దేశానికి నాయకత్వం వహించేవారిని అంతం చేస్తామన్నారు.. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ మత విప్లవం వచ్చిన తర్వాత 47 సంవత్సరాల చరిత్రలో ఇద్దరే ఇద్దరు సర్వాధినేతలుగా ఎన్నికై ఇరాన్‌నుపాలించారు.
రహొల్లా ఖమేనీ పది సంవత్సరాలు పరిపాలించగా, అలీ ఖమేనీ 37 సంవత్సరాలు పరిపాలించారు. ఇప్పుడు ఆయన వారసుడు మోజ్తాబా ఖమేనీ పరిపాలనకు సిద్ధంగా ఉన్నారు. ''ఇరాన్‌లో ఉగ్రవాద ప్రభుత్వం ఎవరిని సర్వాధినేతగా కూర్చోబెట్టినా బ్రతకనివ్వం. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనే ప్రణాళికతో వారు పరిపాలన చేస్తారు, ఈ ఉగ్రవాద ప్రణాళిక, ఆలోచనలన్నీ ఇజ్రాయెల్‌కు, అమెరికాకు స్వేచ్ఛా ప్రపంచ మనుగడకు బెదిరింపే, ఈ పాలన ఇజ్రాయెల్ ప్రజలను అణచివేస్తుంది'' అని ఎక్స్ వేదికగా ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు.
''సుప్రీం నేత పేరు ఎవరనేది ముఖ్యం కాదు, వాళ్ళు ఎక్కడ రహస్యంగా తలదాచుకునారనేదీ ముఖ్యం కాదుఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనే ఉగ్రవాద పరిపాలనా ఆలోచనే వారికి ఉండటం ముఖ్యాంశం, ప్రధానమంత్రి నెతన్యాహూ, నేనూ కలిసి ఐ.డి.ఎఫ్‌కు ఆదేశాలు ఇచ్చాం, ఆపరేషన్ లయన్ రోర్ పేరుతో గూఢచారి కార్యకలాపాలు కూడా ఒక అంతర్భాగాంశంగా అన్ని రూపాలలో లక్ష్యాలు నెరవేర్చడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించాం'' అని పేర్కొన్నారు.

## కేంద్ర హోం మంత్రితో సిఎం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రం సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని సిఎం తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని కేంద్ర మంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశా రు. ప్రస్తుతం 83 ఐపిఎస్ అధికారులు రాష్ట్రంలో ఉన్నారని... ఆ సంఖ్యను 103కు పెంచి కేటాయించాలని సిఎం కోరినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపింది.

**మావోయిస్టుల లొంగుబాటుపై చర్చ**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చర్చించారు. ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

ఇటీవల కాలం లో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం అందజేస్తున్న పరిహారం, పునరావాసం విషయాలను కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు.

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజిపి బి. సుమతి పాల్గొన్నా రు.

## లెబనాన్‌లో 60హెజ్బొల్లా స్థావరాలపై దాడులు

### అనేకమంది మృతి: 58 వేలమంది నిరాశ్రయం
### బఫర్‌జోన్‌గా లెబనాన్: ఇజ్రాయెల్ ప్రకటన

**జెరూసలెం:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేస్తు న్న యుద్ధం బుధవారం మూడోరోజు తీవ్రస్థాయిలో విస్తరించింది.బీరూట్‌లో హెజ్బొల్లా కేంద్రంగా చేసుకున్న పెద్ద హోటల్‌ను గగనతల దాడుల్లో ధ్వంసం చేసింది. హెజ్బొల్లాకు చెందిన 60 స్థావరాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేకమంది మరణించారు. సిడాన్, టైర్ ప్రాంతాల్లో దాడులు, పేలుళ్ళలో లెబనాన్ హోరెత్తిపోతోంది. హైఫా నావికాదళ స్థావరంపై ఐడిఎఫ్ దాడులు చేసింది. సిడాన్‌లో ఇస్లామిక్ గ్రూప్ కేంద్ర కార్యాలయంపై ఐడిఎఫ్ దాడులు చేసింది. బాల్‌బాక్‌లో ఒక భవంతిపై క్షిపణి దాడి చేయడంతో ఆ ఇంట్లో ఉన్న ఏడుగురు మరణించారు. ఇజ్రాయెల్ సైనికులు భౌతికంగా లెబనాన్‌లోని అనేక లోపలిక ప్రాంతాలకు చొచ్చుకుపోయారు. లెబనాన్‌ను తమ దేశానికి ఒక బఫర్ జోన్‌గా చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. హెజ్బొల్లా ఉగ్రవాదస్థావరాలే లక్ష్యంగా బాంబుల మోతతో లెబనాన్ దద్దరిల్లింది. హెజ్బొల్లాను నిరాయుధులను చేసే వరకూ యుద్ధం కొనసాగుతుందని, హెజ్బొల్లా కీలక లక్ష్యాలపైదాడులు కొనసాగిస్తున్నామని ఇజ్రాయెల్ ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా దక్షిణ లెబనాన్‌లోని మరో 16 పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలను ఖాళీచేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయెల్ సైనికులు స్థానిక ప్రజలకు ఆదేశించారు. దీంతో లెబనాన్‌లో మొత్తం 58,000 మంది ప్రజలు ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. 30,000 మంది ప్రజలు శివార్లలో శిబిరాలలో తల దాచుకున్నట్లు ఐక్యరాజ్యసమితి సిబ్బంది తెలియజేశారు.

## ఏం చేయలేరు

(మొదటి పేజీ తరువాయి)

సహకారం అందించేందుకు ఆయన తిరస్కరించారు. దీంతో ట్రంప్ స్పెయిన్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని నిలిపివేస్తానని హెచ్చరించారు. దీంతో పెడ్రో శాంఛెజ్ బాహాటంగా ట్రంప్‌ను సవాలు చేశారు. యూరోపియన్ యూనియన్‌లో స్పెయిన్ దేశం ఒక భాగంగా ఉందని, అందువల్ల యూరప్ వాణిజ్యానికి సంబంధించిన చట్టాలు, నిబంధనలన్నీ తమ దేశానికీ కూడా వర్తిస్తాయని, ఈ విషయంలో అమెరికా తమను ఏమీ చేయలేదని సవాలు చేశారు. జర్మన్ ఛానల్సర్ ఫ్రెడరిక్ మెర్జ్, ట్రంప్ మధ్య వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో స్పెయిన్‌తో సంబంధాలు తెంచుకుంటామన్న ట్రంప్ మాటలకు ఛాన్సలర్ సమర్థించినట్టుగా కనిపించింది. దీంతో స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యువల్ ఆల్బారెస్ కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్పెయిన్ తన జిడిపిలో 3.5 శాతం రక్షణకు కేటాయించేలా ఒప్పించడం అవసరమని ఫ్రెడరిక్ మెర్జ్ వ్యాఖ్యానించారు. దీనిపై అల్బారెస్ మాట్లాడుతూ, ఇంతకుముందు పనిచేసిన ఏంజెలా మెర్కెల్,ఓలాఫ్ స్కోల్జ్ లాంటి ఛాన్సలర్లు ఇలాంటి వ్యాఎప్పుడూ చేసి ఉండరని, తాను అలా అనుకోవడం లేదన్నారు.

## మోజ్తాబా ఖమేనీ!

(మొదటి పేజీ తరువాయి)

తాత్కాలికంగా వాయిదా పడినట్లు ఇరాన్ ప్రభుత్వం తొలుత ప్రకటించినప్పటికీ నిర్ణీత ప్రకారం ఆ ఎన్నిక ప్రక్రియ పూర్తయిందని భావిస్తున్నారు. 88 మంది సభులతో కూడిన అత్యున్నత నిపుణుల మండలి ఇరాన్ సర్వాధినేతను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ వార్త పూర్తిగా వెలువడలేదు. ఇరాన్ సర్వాధినేతగా ఎవరు ఎన్నికైనాగానీ ఆ నాయకుడే యావత్ సైన్యానికీ నాయకుడు, ఇరాన్ శుద్ధిచేస్తున్న యురేనియం అణు కార్యక్రమాన్ని ముందుకు నడిపించే కీలక బాధ్యత కూడా ఆయనకే చెందుతుంది.
ఐతే తండ్రి మరణించిన తర్వాత గడచిన ఐదు రోజులుగా ముజ్తాబా ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. ఆయన పూర్తిపేరు మోజ్తాబా హొస్సేనీ ఖమేనీ. అలీ ఖమేనీ రెండో కుమారుడు. 1969 సెప్టెంబరులో ఇరాన్‌లోని రెండవ అతిపెద్ద నగరం మష్హాద్‌లో జహ్రా హద్దాద్ అదెల్,ఖమేనీలకు జన్మించారు. ఆనాటి పర్షియన్ చివరి రాజు రెజా మహ్మద్ రహస్య పోలీసులు తండ్రి ఖమేనీపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ తర్వాత చాలా కాలానికి గానీ అలీ ఖమేనీ కోలుకకోలేదు. ఆ సమయంలో తండ్రి సెలవులకు ఊరు వెళ్ళాడని పిల్లలకు తల్లి చెప్పిందని జీవిత చరిత్రలో రాశారు. షా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఖమేనీ అనేక పదవులు నిర్వహించారు. 1989లో సర్వాధినేతగా మారారు. తండ్రి స్ఫూర్తితో మోజ్తాబా ఎదిగాడు. అనేకమంది ప్రముఖులతో ఆయన సంభాషణలు చేశాడు. ఫిబ్రవరి 28 దాడుల్లో ఆయన తల్లి తీవ్రంగా గాయపడి రెండు రోజులక్రితం చికిత్స పొందుతూ మరణించారు. హైస్కూలు చదువు పూర్తయిన తర్వాత మోజ్తాబా ఖమేనీ ఇస్లామిక్ సైద్ధాంతిక విద్యను పూర్తిచేశారు. క్వామ్‌లో చదువులు పూర్తి చేసి ఇస్లాం మతాధిపతిగా మారారు. తండ్రే గురువుగా మత విద్య అభ్యసించారు. ఆయనను తండ్రి ఎప్పుడూ ఇప్పటివరకూ ప్రభుత్వ పదవులలో నియమించలేదు. ఇరాన్ వెలుపల లండన్, దుబాయ్‌లలో కూడా ఆయన ఆస్తులు కూడబెట్టినట్లు బ్లూంబెర్గ్ పత్రిక తెలియజేసింది.

**అలీ ఖమేనీ ఖనన ప్రక్రియ చివరి క్షణంలో వాయిదా**

అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ మూడు రోజులపాటు కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. గురువారం తెల్లవారకముందే అర్థరాత్రి నుండి ఈ ప్రక్రియ మొదలవుతుందని ఇరాన్ ఇస్లామిక్ ప్రచార మండలి అధిపతి హొజ్జతోలెస్లామీ మహమూది చెప్పారు. కానీ యుద్ధ దాడుల తీవ్రత పెరిగిపోవటంతో ఈ ప్రక్రియను చివరి క్షణంలో వాయిదా వేశారు. అలీ ఖమేనీ జన్మస్థలం మషాద్‌లో ఆయనను ఖనం చేస్తారని భావిస్తున్నారు. ఆయన తండ్రిని ఖననం చేసిన ఇమామ్ రెజా మందిరంలోనే ఈ ఖననం చేస్తారు. దేశ ప్రజలు ఆయనకు అంతిమ నివాళులు అర్పించడానికి వీలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బుధవారం రాత్రి పది గంటలకు టెహ్రాన్‌లోని ఇమామ్ ఖమేనీ ప్రార్థనా మందిరంలో జరగాల్సి ఉండగా దీనిని వాయిదా వేశారు.

## జలాంతర్గామి దాడి

(మొదటి పేజీ తరువాయి)

రక్షించింది. వీరిలో ఏడుగురిని ఆసుపత్రిలో చేర్చి చికిత్సలు అందిస్తోంది. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు శ్రీలంక ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. కాగా గాలింపు చర్యల్లో ఇప్పటివరకూ 80కి పైగా మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని గాలింపు కొనసాగుతోందని ప్రభుత్వం ప్రకటించింది. తొలుత ఈ నౌక విషయంలో అయోమయం, సందేహం నెలకుంది. ఎందుకు నౌక నీటి మునిగిందో ఎవరికీ అర్థం కాలేదు. ఆ తర్వాత అమెరికా ప్రకటన తర్వాత ఒక స్పష్టత వచ్చింది. మొదట శ్రీలంక నావికాదళ అధికార ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ నౌకను ఎవరైనా ముంచేశారా? అనే ప్రశ్నకు లేదంటూ నిర్ద్వంద్వంగా సమాధానం చెప్పారు. ఈ కారణాలు తర్వాత తెలిసే అవకాశం ఉందన్నారు. కాగా ఈ యుద్ధ నౌకను అమెరికా జలాంతర్గామి టార్పెడో దాడిచేసి ముంచేసినట్లు అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్, అమెరికా త్రివిధ బలగాల ప్రధాన అధిపతుల ఛైర్మన్ డాన్ కైన్ వర్జీనియాలోని పెంటగాన్‌లో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు మీడియా సమావేశంలో చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత శత్రు నౌకను నీట ముంచడం ఇదే మొదటి సారి అని ఆయన అన్నారు. నౌకలో 180 మందికి పైగా ఉన్నారని, వీరిలో 32 మందిని శ్రీలంక విపత్తు నియంత్రణ విభాగం కాపాడిందని వారు చెప్పారు. ఇరానియన్ ఇస్లామిక్ పాలకులు నిప్పు కణికల్లో అల్లాడుతున్నారని చెప్పా రు. ఫిబ్రవరి 18వ తేదీన ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం తీరంలో 71 విదేశీ–స్వదేశీ నౌకల విన్యాసాలు ప్రెసిడెన్సియల్ రివ్యూ జరిగింది. ఈ విన్యాసాలో భారత్‌కు చెందిన 45 నౌకలు, స్నేహపూర్వక దేశాలకు చెందిన 19 నౌకలు పాల్గొన్నాయి. ఇందులో భాగంగా ఇరాన్ కొత్తగా తన నౌకాదళంలో చేరుకున్న ఐరిస్ దేనా నౌక కూడా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా జలాంతర్గామి టార్పెడో దాడి చేసింది.

**వాణిజ్య నౌకలకు అమెరికా ఆర్మీ రక్షణ:ట్రంప్**

హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటి వెళ్ళేందుకు వీలుగా అన్ని వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం రక్షణగా ఉంటుందని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నౌకలు దాడులకు గురైతే బీమా, ఆర్థిక పరిహారం కూడా అందించేవిధంగా సంబంధిత అమెరికా ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు తెలియజేస్తామన్నారు. నౌకలను సురక్షితంగా జలసంధిని దాటించి గమ్యస్థానాలకు పంపేవిధం గా అమెరికా సైన్యం రక్షణ బాధ్యతలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. వీలైనంత త్వరగా దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్‌దేశమే తమను ఈ యుద్ధంలోకి లాగిందనడాన్ని ట్రంప్ ఖండించారు. ఇరాన్‌దేశమే మొట్టమొదట ఇజ్రాయెల్‌పై దాడి చేస్తోందని నెతన్యాహూ భావించారని, అందుకే దాడి జరిగిందన్నారు. అమెరికాలో అంతర్గతంగా ప్రతిపక్షాలు, ప్రజలు ఈ దాడికి కాంగ్రెస్ అనుమతి లేదని వ్యతరేకిస్తున్నందువల్ల, ఎదుటిపక్షం వారికి, వ్యతిరేకులకు ఇలాంటి విషయం నిజమే అనిపిస్తుందని చెబుతూ అమెరికాను ఇజ్రాయెల్ యుద్ధంలోకి లాగిందనడాన్ని ఖండించారు.

ఇరుపక్షాలవైపు ఉన్న నాయకులు, మీడియా యూదు రాజ్యంవైపు వేళ్ళు చూపిస్తున్నందువల్లనే ఈ విధమైన వార్తలు వస్తున్నాయన్నారు. ఇరాన్ ఒక ఉగ్రవాద ఇస్లామిస్టు దేశమని, ఇది పశ్చిమాసియాకు, యావత్ ప్రపంచానికి ప్రమాదమని అన్నారు. ఇంక ఇరాన్ తన గగనతలాన్ని ఎంతోకాలం కాపాడుకోలేదని ట్రంప్ అన్నారు.

గల్ఫ్ దేశాల్లో అమెరికా తన దౌత్యకార్యాలయాలను ఖాళీ చేసి వెళ్ళిపోవడంలేదని, ఇది తాత్కాలికమేనని, యుద్ధాన్ని త్వరగా ముగిస్తామని అన్నారు. చర్చలకు వస్తామని ఇరాన్ చాలా ఆలస్యంగా తమను అడిగిందన్నారు. ఐతే అంతకు ముందు ట్రంప్ ఆదివారం మాట్లాడుతూ, ఇరాన్ చర్చలు కావాలని అడిగిందని, అందుకు తాను అంగీకరించానని చెప్పారు. ఆయన చేసిన ఈ రెండు ప్రకటనలకు పొంతన కుదరడంలేదు. పశ్చిమాసియాను వదిలి వెళ్ళానుకునే దాదాపు 9000 మంది అమెరికన్లకోసం ప్రత్యేక ఛార్టర్ విమానాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## వాణిజ్యం కటీఫ్

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చు చేసేందుకు ఇ ష్టపడటంలేదని విమర్శించారు. తాము ఆత్మరక్షణ చర్యలకే ప్రాధాన్యత ఇస్తామని యు ద్ధంలో చేరబోమని స్టార్మర్ చెప్పడం ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది. ఐతే ఉక్రేన్‌లో రష్యా యుద్ధం తర్వాత యూరప్ దేశాలలో ఆర్థిక సమస్యలు మొదలయ్యాయనీ, గ్యాస్ ధరలు కంటికి కనిపించకుండా గణనీయంగా పెరిగాయని, ఇప్పుడు మళ్ళీ ఈ యుద్ధాన్ని తలకెత్తుకుంటే తమ వినియోగదారులకు, ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి సమస్యలు వస్తాయో అని యూరప్ దేశాల నాయకులు ఊగిసలాటలో ఆందోళనతో ఉన్నారని మరోవైపు వార్తలు వెలువడ్డాయి.

## దొరికేనా..?

(మొదటి పేజీ తరువాయి)

జనాభా ఉంటే ఇందులో మూడవ వంతు ఐదు లక్షలకు పైబడిన జనాభా ఒక ఖమ్మం నగరంలోనే జీవిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బతుకుదెరువు కోసం వచ్చిన దిగువ, మధ్యతరగతి, పేద ప్రజలకు అద్దెలు చెల్లించి జీవించే పరిస్థితి లేదు. కిక్కిరిసిన జనాభా కారణంగా నివాస స్థలాల సమస్య రోజు రోజుకు తీవ్రమవుతుంది. గతంలో ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని పాలకులే చేపట్టి పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసేవారు. చాలా కాలంగా జాగా లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం అనేది పూర్తిగా నిలిచిపోయింది.

**పెరిగిన రియల్ ఎస్టేట్ :** పట్టణాలు, నగరాల చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తృతమైంది. నగరాలు, పట్టణాల్లో సామాన్యులు వంద గజాల జాగ కొనడం అంత తేలికైంది కాదు. లక్షలు వెచ్చిస్తే తప్ప జాగ దొరికే పరిస్థితి లేదు. దీనితో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జరుగుతుంది. పేదలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం కొన్నేళ్ల పాటు వేచి ఉండి ఆ తర్వాత వాటిని కూల్చివేయడం ఈ మధ్య పాలకులకు అలవాటుగా మారింది. నగరాల చుట్టు ఉన్న ప్రభుత్వ భూములను వివిధ సంస్థలకు ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు కేటాయిస్తుండడంతో భవిష్యత్తులో పేదలకు సెంట్ జాగా పంపిణీ చేసే అవకాశం లేకుండాపోయింది. ఇప్పుడు పట్టణాల్లో నివసిస్తున్న పేదలకు ఇండ్ల స్థలాల సమస్య తీవ్రతరం కావడంతో నాలాలపై లేదా ఇతర ప్రభుత్వ భూములను ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రక్రియ. దీనికి సంబంధించి భూ ఆక్రమణల పేరుతో బుల్‌డోజర్ల సంస్కృతి తీసుకురావడం పేదలపై భూ ఆక్రమణ కేసులు నమోదు చేయడం చేస్తున్నారు. ఇదే సమయంలో కొందరు దళారులు నివాస స్థలాలను క్రమబద్దీకరిస్తామని చెబుతూ పేదలను అందిన కాడికి పిండుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**నివాస స్థలాల పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ :**

ప్రభుత్వాలు నివాస స్థలాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఇందిరమ్మ ఇండ్లు ప్రస్తుతానికి సొంత జాగా ఉన్న వారికి మాత్రమే కేటాయిస్తున్నారు. ఇలా కాకుండా పేదల నివాస స్థలాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ పేదలకు నివాస స్థలాలను కేటాయించి అక్కడే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాల్సి ఉంది. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ఇండ్ల స్థలాల సమస్య భవిష్యత్తులో ప్రధాన సమస్యగా మారడంతో పాటు ఆక్రమణలకు, ఆందోళనలకు దారి తీసే అవకాశం ఉంది. దీనిపై ఆలోచన చేయకపోతే పాలకులు ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు.

## ఎల్లలు దాటింది

(మొదటి పేజీ తరువాయి)

ఉంచామని, సమయం చూసి ప్రయోగిస్తామని ఇరానియన్ సైనిక జనరల్ హెచ్చరిక చేశారు. అమెరికా–ఇజ్రాయెల్ కోసం మరిన్ని నరకద్వారాలు తెరచుకున్నాయని, సిద్ధంగా ఉండాలని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ అధిపతి హెచ్చరించారు.17వ విడతగా బుధవారం ఇజ్రాయెల్‌పై 40 క్షిపణులు ప్రయోగించి అపారనష్టం కలిగించినట్లు ఇరాన్ ప్రకటించింది. సౌదీ అరేబియాలో, దుబాయ్‌లో అమెరికా దౌత్యకార్యాలయాలపై క్షిపణి దాడులు చేయడంతో ఆ భవంతులు మంటల్లో దగ్ధమయ్యాయి. ఖతార్‌లో అల్–ఉైడ్ స్థావరాన్ని బాలిస్టిక్ క్షిపణులు ధ్వంసం చేశాయి. బహ్రైన్‌పై కూడా దాడులు జరిగాయి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆ దేశంలో సైరన్లు మోతమోగాయి. మరోవైపు ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుబంధ ఉగ్రవాద గ్రూపులు కూడా దాడులు చేశాయి.

పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో అవిశ్రాంత దాడులు చేస్తుండగా, అమెరికా–ఇజ్రాయెల్ గతంకంటే భిన్నంగా రెట్టింపు భారీగా పేలుడు పదార్థాలు, బాలిస్టిక్ క్షిపణులు,డ్రోన్లతో ఇరాన్ వ్యాప్తంగా దాడులు చేయడంతో అన్ని ప్రాంతాలు పొగలు కక్కుతున్నాయి. ఇరాన్ వ్యాప్తంగా క్షిపణి తయారీ కేంద్రాలతోపాటు నాయకులపై బాలిస్టిక్ క్షిపణి దాడులు చేస్తున్నట్లు ఐ.డి.ఎఫ్ ప్రకటించింది. మెహ్రాబాద్ ఎర్‌పోర్ట్‌పై దాడులు జరిగాయి. ఇరాన్ రాజదాని టెహ్రాన్, ఇతర ప్రాంతాలు లక్ష్యంగా అమెరికా–ఇజ్రాయెల్ తీవ్ర దాడులు కొనసాగించాయి. ఎర్‌పోర్టులో క్షిపణి దాడులతో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు ధ్వంసమయ్యాయి. గల్ఫ్ దేశాల్లో అమెరికా దౌత్యకార్యాలయాలు మంటల్లో దగ్ధమవుతున్నాయి. సెంట్రల్ ఇజ్రాయెల్ ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులు,డ్రోన్లతో బహుముఖ దాడులు చేసింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జిసి) అమెరికా స్థావరాలే ప్రధాన లక్ష్యాలుగా యుద్ధ దాడులు పెంచింది. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తమ స్వాధీనం చేసుకున్నామని, ఇరాక్,కువైత్‌లలోఉన్న అమెరికా వైమానిక స్థావరాలపై దాడులు చేశామని ఐఆర్‌జిసి ప్రకటించింది. దుబాయ్‌లో అమెరికా కాన్సులేట్ భవనంపై దాడులు జరిగాయి. ఇరాక్ నగరం బాగ్దాద్‌పై ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని కూల్చివేసినట్లు ఇరాక్ ప్రకటించింది.

అమెరికా–ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని 50 నగరాలపై దాడులు చేశాయి. ఇరాన్ వ్యాప్తంగా ఆగకుండా భారీ పేలుళ్ళు సంభవిస్తుండగా, మరోవైపు ఇజ్రాయెల్‌లో క్షిపణులు సమీపిస్తుంటే సైరన్ల మోత మోగుతోంది. ఇజ్రాయెల్‌లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

సిరియా, ఇరాక్ దేశాల గగనతలాలను దాటి టర్కీ దేశంలోకి దూసుకువెళుతున్న ఇరాన్ క్షిపణిని మధ్యధరా సముద్ర జల్లాలో ఉన్న నాటో క్షిపణి వ్యవస్థలు కూల్చివేశాయి. దీంతో ఇరాన్‌పై టర్కీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విచక్షణారహితంగా దాడులు చేస్తూ ఇరాన్ తప్పుడు యుద్ధ వ్యూహం అనుసరిస్తోందని టర్కీ విదేశాంగమంత్రి హకన్ ఫిదాన్ విమర్శించారు.

ఇరాన్‌పై 2000 లక్ష్యాలపై దాడులు చేశామని, ప్రతి ప్రదేశం తమ దాడుల దృష్టిని దాటిపోలేదని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌పై 500 బాలిస్టిక్ క్షిపణులు,2000 డ్రోన్లు ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్‌లో నౌకాదళ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ప్రకటించారు. 2003లో ఇరాక్‌పై దాడి చేసినప్పటికంటే అనేకరెట్లు దాడుల తీవ్రత పెంచినట్లు తెలిపింది.అదేవిధంగా ఇరాన్ కూడా ఒక ప్రకటన చేస్తూ పశ్చిమాసియా అంతటా 1700 స్థావరాలు,లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఒక్క ఖతార్‌పైనే 100 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్లు తెలిపింది. ఇరాన్‌లో ఇప్పటివరకూ 1,097 మంది మరణించినట్లు మానవహక్కుల సంఘం ప్రకటించింది. కాగా ఇరాన్ న్యాయ వ్యవస్థ అధిపతి, దేశ పాలనామండలి త్రిసభ్య కమిటీ సభ్యుడు ఘోలం హొస్సేన్ మొహ్‌సెని ఎజి ఒక ప్రకటన చేస్తూ దేశంలో అంతర్గతంగా అమెరికాకు, ఇజ్రాయెల్‌కు ఎవ్వరు మద్దతు ప్రకటించినా తీవ్ర శిక్షలకు గురవుతారని హెచ్చరించారు.

ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్ల పతనం కొనసాగుతుండగా, చమురు ధరలు, అమూల్యమైన ఖనిజాలు, మూలకాల ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. భారత్ రూపాయి విలువ అత్యంత కనిష్ఠస్థాయికి రికార్డు స్థాయిలో పతనమైంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక బ్యారెల్‌కు 84 డాలర్లకు చేరుకుంది. యుద్ధం మొదలైన తర్వాత అనూహ్యంగా 15 శాతం మేరకు ఈ ధర పెరిగింది. అంతర్జాతీయ చట్టాల వైఫల్యం కారణంగానే పశ్చిమాసియాలో యుద్ధం ప్రమాదకరస్థాయిలో విస్తరిస్తోందని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ఈ పూర్వరంగంలో యూరోపియన్ యూనియన్–గల్ఫ్ దేశాలమధ్య గురువారం ఉమ్మడి సమావేశం జరగనున్నది. ఒకవైపు దాడులు కొనసాగిస్తూనే తక్షణ యుద్ధ నివారణ చర్యలు తీసుకోవాలని భద్రతా మండలికి ఇరాన్ విజ్ఞప్తి చేసింది.

మరోవైపు ఒమన్ ప్రభుత్వం కూడా ఇరాన్‌పై యుద్ధం విరమించాలని అమెరికా–ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరుగుతున్న టోర్నమెంటు సమీపంలో క్షిపణి దాడులు జరగడంతో టోర్నమెంట్ నిలిపివేశారు. అనేకమంది ఆటగాళ్ళు, ప్రయాణికులు యుఎఇ విమానాశ్రయంలో స్తంభించిపోయారు. గల్ఫ్ ఇంటర్నేషనల్ ఫోరం ఇరాన్ దాడులను ఖండించింది.

# జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పరిశ్రమలు

### 55వ జాతీయ భద్రతా దినోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రతను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలని, భద్రత ఉన్నప్పుడే ఉత్పాదకత మెరుగవుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పరిశ్రమలు ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం తెలంగాణ ప్రభుత్వం, ఫ్యాక్టరీస్ డైరెక్టరేట్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 55వ జాతీయ భద్రతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వివేక్ మాట్లాడుతూ గతంలో కొంతమంది మేనేజ్‌మెంట్లు భద్రతా చర్యల వల్ల ఖర్చులు పెరుగుతాయని భావించేవారని, కానీ ప్రస్తుతం ఆ దృక్పథంలో మార్పు వచ్చి భద్రతపై దృష్టి పెడుతున్నారని తెలిపారు. ప్రతి పరిశ్రమ యాజమాన్యం భద్రతపై తప్పనిసరిగా పెట్టుబడి పెట్టాలని, బోర్డు సభ్యులు భద్రతా అంశాలను సమీక్షించాలని సూచించారు. కార్మికులకు నిరంతరం అవగాహన కల్పించాలని, కార్మికులు సంతోషంగా, సురక్షితంగా ఉంటేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. పరిశ్రమల్లో సాంకేతిక మార్పులు వేగంగా జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా భద్రతా ప్రమాణాలు బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని, ఆ లక్ష్యంలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పరిశ్రమలు జీరో యాక్సిడెంట్ ఫ్యాక్టరీలుగా మారాలని, ఉత్తమ భద్రతా పద్ధతులను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఓ ఫ్యాక్టరీ ఘటనను ప్రస్తావిస్తూ, చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకున్నా పెద్ద ప్రమాదం నివారించవచ్చని చెప్పారు. రూ.20లక్షలు ఖర్చు చేసి ఉంటే ఆ ప్రమాదం జరిగేది కాదు, కానీ ప్రమాదం అనంతరం అదే మేనేజ్‌మెంట్ రూ. కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ప్రతి కంపెనీకి భద్రతా ప్రణాళిక ఉన్నప్పటికీ, కార్మికులు కూడా భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల్లో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలని శాఖాధికారులకు మంత్రి ఆదేశించారు. అనంతరం నిర్వాహకులు పరిశ్రమల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

### వరి ఆధారిత సాగు ప్రత్యామ్నాయంగా పంటల మార్పిడిపై

# రైతులకు ఇక్రిశాట్ సైంటిస్టులు అవగాహన కల్పించాలి

### తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోందడరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంటల మార్పిడిలో భాగంగా తెలంగాణలో వరి ఆధారిత సాగు విధానానికి ప్రత్యామ్నాయంగా శనగ, మిల్లెట్లు, వేరుశెనగ వంటి పంటల మార్పిడిని ప్రోత్సహించాలనే అంశాలను రైతులకు పూర్తి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోందడరెడ్డి ఇక్రిశాట్ శాస్త్ర వేత్తలను కోరారు. పటాన్ చెరువులోని ఇక్రిశాట్‌ను ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డితో కలిసి రైతు కమిషన్ చైర్మన్, సభ్యుల బృందం బుధవారం సందర్శించింది. క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా ఇక్రిశాట్‌లో సాగుచేస్తున్న ఆరుతడి పంటలను ఈ బృందం పరిశీలించింది. తక్కువ నీటితో, తక్కువ కాలంలో సాగుచేస్తున్న జొన్న, పల్లి, శనగ, కంది, ఇతర తృణధాన్య పంటల వివరానలను రైతు కమిషన్ బృందం అక్కడి శాస్తవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రకం పచ్చి మేత పంటను కూడా సాగుచేస్తున్న విషయన్ని కమిషన్ పరిశీలించింది. అనంతరం ఇక్రిశాట్ మీటింగ్ హాల్‌లో అక్కడి అధికారులు, శాస్త్రవేత్తలతో కమిషన్ బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. త్వరలో కమిషన్ జిల్లాల పర్యటన నేపథ్యంలో ఇక్రిశాట్‌ను సందర్శించామని ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పంటల మార్పిడి, ఆరుతడి పంటలు, నీటి సంరక్షణ, సుస్థిర వ్యవసాయం, రైతుల ఆదాయం పెంపు వంటి అంశాలపై చర్చించినట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా చీడ, పీడ బెడద లేకుండా సాగు చేసే విధానంపై అక్కడి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. అదేవిధంగా తెలంగాణలో రైతుల ఆలోచనలు, ప్రధానంగా సాగుచేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న పంటలపై సుదీర్ఘంగా చర్చించినట్లు చైర్మన్ కోదంరెడ్డి వివరించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దూరదృష్టితో తెలంగాణ ప్రాంతంలో ఇక్రిశాట్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గుర్తుచేశారు. ఈ పర్యటనలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితోపాటు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కెవిఎన్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్, కమిషన్ అధికారులు పాల్గొన్నారు.క్షేత్రస్థాయిలో డా. హరి కిషన్ సుదిని, డా. మురళి కృష్ణ గుమ్మా, డా. కుమార చార్యులు ఆధ్వర్యంలో శనగ, వేరుశెనగ, మిల్లెట్లు పంటలు పరిశీలించారు. రైతు కమిషన్‌తో జరిగిన సమావేశంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్షుపాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.స్టాన్‌ఫోర్డ్ బ్లేడ, డా.సూర్యమణి త్రిపాఠి, డా.కుల్దీప్ సింగ్, డా.హరికిషన్ సుదిని, డా.మురళి కృష్ణ గుమ్మా, డా.కుమార చార్యులు, డా.ఎఫ్రెమ్ హబ్యారిమనా, డా.ఎస్.కే. గుప్తా,డా. రాకేష్ శ్రీవాస్తవ,డా. ప్రకాశ్ గంగషెట్టి,డా. నేదుమరన్ ఎస్ డా.దమారిస్ ఓడేని పాల్గొన్నారు.

### కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా

# వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ

### నేడు నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాల అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. ఢిల్లీలో బుధవారం కాంగ్రెస్ అధిష్టానంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం రాష్ట్ర కోటాలో సిఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేయగా, ఎఐసిసి కోటాలో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి మరోసారి అవకాశం కల్పించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ మంగళవారం వెల్లడించినట్లుగానే ఇద్దరు అభ్యర్థులను బుధవారం కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేయనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నేతలు పాల్గొననున్నారు. కాగా కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ బుధవారం మధ్యాహ్నమే హైదరాబాద్‌కు చేరుకోవడం గమనార్హం.

### సురక్షితమైన వాతావరణంతో

# ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ

### జాతీయ భద్రతా వారోత్సవాల్లో టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సురక్షితమైన పని వాతావరణం వల్ల ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ లభించడమే కాకుండా, సంస్థ యొక్క ఖ్యాతి కూడా పెరుగుతుందని టిజిఎస్‌ఆర్‌టిసి విసి, ఎండి వై.నాగిరెడ్డి అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, వర్క్‌షాపులతో పాటు ఉత్పత్తి యూనిట్లలో భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అన్ని యూనిట్లలో 'భద్రతా దినోత్సవాన్ని' నిర్వహించి, సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బస్‌భవన్‌లో వై.నాగిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్లో పనిచేసే ప్రతి ఉద్యోగి, సూపర్వైజర్ల భద్రతను, సంబంధిత అధికారులు తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. ఆర్‌టిసి 'కార్మికులు, ఉద్యోగుల భద్రతే మా ప్రధాన ధ్యేయమని బస్ డిపోలు, వర్క్‌షాప్‌లలో భారీ యంత్రాలు, వెల్డింగ్ పరికరాలు, ఇంధన నిర్వహణ వంటి క్లిష్టమైన పనులు చేసేటప్పుడు కార్మికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి' అని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటామని, ఈ ఏడాది వారం రోజుల పాటు అట్టడుగు స్థాయి వరకు అవగాహన కల్పించేలా భద్రతా వారోత్సవాలు నిర్వహించేలా అన్ని గ్యారేజీలు, జోనల్ వర్క్‌షాప్‌లతో పాటు బాడీ బిల్డింగ్ యూనిట్లకు (బిబియు) ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. 'సురక్షితమైన పని పద్ధతుల ద్వారా సంస్థ ఆస్తులను కాపాడుతూ, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం. యాంత్రిక గాయాలు, విద్యుత్ షాక్‌లు, అగ్ని ప్రమాదాలను అరికట్టడం. నిరంతర అభ్యాసంతో పాటు అవగాహన ద్వారా పని ప్రదేశాల్లో బలమైన భద్రతా వాతావరణాన్ని నిర్మించడం. వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు, రసాయన పొగలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం' అని నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. వెంకన్న, ఇడి (ఇ అండ్ ఎవమ్)తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని భద్రతా ప్రతిజ్ఞ చేశారు.

### అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్

## తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా రాంధన్ నాయక్ నియామకం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలోనే అతి పెద్ద మానవ హక్కుల సంస్థ అయిన (అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఐహెచ్‌ఆర్‌సి) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నెనవత్ రాంధన్ నాయక్‌ని నియమించింది. ఈ నియామక ఉత్తర్వులు డెన్మార్క్‌లోని అంతర్జాతీయ పరిపాలనా కేంద్రం నుండి మార్చి 1న అధికారికంగా జారీ చేయబడ్డాయి. నెనవత్ రాంధన్ నాయక్ తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా, కంది మండలం, మామిడిపల్లి గ్రామానికి చెందినవారు. గ్రామీణ స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మంచి గుర్తింపు పొందారు. తన ప్రయాణంలో తోడ్పడిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా నెనవత్ రాంధన్ నాయక్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజ సేవకు, ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు న్యాయం చేకూర్చేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే మహిళలు, బాలలు, ఆదివాసీలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని, ప్రభుత్వ విభాగాలు, ప్రజల మధ్య సమన్వయం కల్పిస్తూ పారదర్శకమైన విధానంలో సేవలు అందిస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణ మరింత బలోపేతం కావడానికి తన వంతు పాత్ర పోషిస్తానని ఆయన స్పష్టం చేశారు.

### రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా

# చూడాలని ఆశించడం మా హక్కు

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీగా అది మా హక్కు. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటి మీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్న రాహుల్ గాంధీని విమర్శించడం, ఆకాశం మీద ఉమ్మిస్తే మీ ముఖం మీదే పడుతుంది, ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదని, ప్రజలే న్యాయ నిర్ణేతలు అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావనీ, అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసుననీ, గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని తెలిపారు. దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తూ, దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది అని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని, ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారని దుయ్యబట్టారు. పేదలను ఆదుకునే ప్రయత్నం చేయకుండా ధరలు విపరీతంగా పెంచుతున్నారని విరుచుకుపడ్డారు. విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీలను, అణగారిన వర్గాలను బూచిగా చూపి, మీరు అధికారాన్ని చెలాయిస్తున్నారన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఇడి, సిబిఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలుస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న రాజకీయం బిజెపిది అని, రెండుసార్లు ఎంపిగా గెలిచి, కేంద్ర మంత్రి అయి తెలంగాణకు ప్రత్యేక నిధులు తీసుకురాని దద్దమ్మ బండి సంజయ్ అని, ఆయన వ్యవహారశైలి ఇకనైనా మార్చుకోవాలని మంత్రి పొన్నం ఘాటుగా స్పందించారు.

### విద్యార్థులు హాల్‌టికెట్లను వాట్సాప్ నంబర్ ద్వారా యాక్సెస్ పొందొచ్చు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదవ తరగతి పరీక్ష హాల్ టికెట్లను www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇప్పటికే హాల్ టిక్కెట్లను సంబంధిత పాఠశాలలకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించారు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు పి.వి.శ్రీహరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను వాట్సాప్ నంబర్ 8096958096 ద్వారా కూడా యాక్సెస్ పొందవచ్చని వివరించారు. పరీక్షల సంచాలకుల కార్యాలయంలో (ఫోన్ నంబర్: 040 23230942) ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈనెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వరకు పరీక్షలు జరగనున్నాయి.

# రాహుల్ ప్రధాని కావాలా? వద్దా? అనేది ప్రజల నిర్ణయమే

### మోదీ మెరిట్‌తో ప్రధానమంత్రి కాలేదు

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నరేంద్ర మోదీ మెరిట్‌తో ప్రధానమంత్రి కాలేదని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలా వద్దా అనేది దేశ ప్రజలు నిర్ణయిస్తారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 2009లో నాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ రాహుల్ గాంధీని ప్రధానమంత్రి పదవి తీసుకోమని కోరగా, తనకు అనుభవం లేదని, మంత్రి పదవి వద్దని సున్నితంగా తిరస్కరించారన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. 2001లో మోదీ ఎంఎల్‌ఏ కాకముందే గుజరాత్ సిఎం అయ్యారని, ప్యారాచ్యూట్‌లో వచ్చి మోదీ సిఎం అయ్యారని, సిఎం అయినప్పుడు గుజరాత్ ప్రజలకు మోదీ ఎవరో తెలియదన్నారు. రాహుల్ గాంధీ ఐదుసార్లు ఎంపిగా గెలిచారని, 2004లో రాహుల్ గాంధీ ఎంపి అయినప్పుడు బండి సంజయ్ కార్పోరేటర్ అయ్యారో లేదో తెలియదన్నారు. ఇద్దరు బిల్లా రంగాలు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు దేశాన్ని భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో బిజెపికి 36 శాతం ఓట్లు వచ్చాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దేశంలో సంస్కరణలు తెచ్చింది, దేశానికి దశ, దిశ రాజ్యాంగం ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ అని, దేశానికి బిజెపి చేసింది ఏమీ లేదన్నారు. తెలంగాణను పదేళ్లు దోచుకుంటే కిషన్ రెడ్డి ఏమి చేశారని, రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఈడి, సిబిఐ,ఐటి ఎందుకు విచారించలేదని ఆయన ప్రశ్నించారు.

### ఐఎఎస్,ఐపిఎస్‌లను తరచూ మార్చడంతో

# పరిపాలనపై తీవ్ర ప్రభావం : హరీశ్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐఎఎస్, ఐపిఎస్‌లను పూట,పూటకూ మార్చడంతో పాలనలో ఫలితాలు రావని, ఇప్పటి వరకు ఐదుసార్లు భారీగా మార్పులు, చేర్పులు జరిగాయని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. విభాగాధిపతులు సగటున ఎనిమిది నెలలు కూడా పనిచేయడం లేదని, తద్వారా పరిపాలనపైన తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జర్నలిస్టులతో హరీశ్ రావు బుధవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రెండేళ్ల కాలంలో విద్యుత్ శాఖలో ఐదుగురు అధికారులు మారడంతో ఆ ప్రభావం విద్యుత్ శాఖపైన పడిందని, ఈ బదిలీలతో విద్యుత్ శాఖ అతలాకుతలమై, అవినీతిమయమైందని ఆరోపించారు. సింగరేణితో పాటు జిహెచ్‌ఎంసి, సమాచార, పౌర సంబంధాల శాఖ, విద్యాశాఖలో నలుగురు చొప్పున బదిలీలు చేశారన్నారు. అధికారుల బదిలీలు ఒక జోక్‌గా మారిందన్నారు. 140 మంది ఐఎఎస్‌లను బదిలీ చేయగా, 20మంది కలెక్టర్లను మార్చారని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నలుగురు మారారని, ఢిల్లీతో సమన్వయంగా వ్యవహరించాల్సిన కీలక శాఖలకు చెందిన అధికారులను తరచూ మార్చడంతో రాష్ట్రానికి నష్టం వాటిల్లుతోందని వివరించారు. ఊ అంటే పోస్టింగ్, ఆ అంటే పోస్టింగ్ చేస్తున్నారని, సిఎం, మంత్రులకు నచ్చకపోతే అధికారులకు బదిలీ చేయడం, పదవీ విరమణ చేసిన అధికారులకు సర్వీస్‌ను పొడిగించడం సాధారణంగామారిందని హరీశ్ రావు అన్నారు. యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణ టెండర్లలో ఐదు శాతం ఎక్కువకు ఇస్తున్నారని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే బయట పెడుతామని వెల్లడించారు. ఇంజినీరింగ్ శాఖలో రిటైర్డ్ అధికారులు కీలక పదవుల్లో ఉండటంతో అవినీతి ఎక్కువగా జరుగుతోందని, అధికార్లను తరచూ బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి అవార్డులు కూడా రావడంలేదని, గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని వివరించారు. తమ సలహాలను కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరిస్తే మంచిదని, లేదంటే వారి ఖర్మ అని అన్నారు. వరంగల్ ఎంజిఎంలో ఎలుకలు, జడ్చర్ల ఆస్పత్రిలో కుక్కలు ఇలాంటి పరిస్థితి వైద్య ఆరోగ్య శాఖలో నెలకొందన్నారు. అసెంబ్లీలో హౌజ్ కమిటీలను ఏర్పాటు చేయలేదన్నారు. ఒఆర్‌ఆర్‌కు కిలోమీటర్ దూరంలో ఎలాంటి కంపెనీ, మైనింగ్ పెట్టవద్దని ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, మంత్రి పొంగులేటి సంస్థ రాఘవ కన్‌స్ట్రక్షన్ ఎలాంటి అనుమతులు లేకుండానే రాజేంద్రనగర్‌లో మైనింగ్ దందా నడుపుతున్నదని, ఈ విషయంలో బిఆర్‌ఎస్ నిజనిర్ధారణ బృందం గురువారం ఆ ప్రాంతానికి వెళ్తుందన్నారు.

తాను మంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టులకు హెల్త్ కార్డుల జిఒ జారీ చేశామని, జర్నలిస్టులకు కేటాయించిన రూ.16 కోట్ల బడ్జెట్‌కు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. ఎడ్యుకేషన్ పాలసీని వెబ్‌సైట్ నుంచి ఎందుకు తీసివేశారని ప్రశ్నించారు.

# స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు నిర్వహించనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాలు, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్యక్రామన్ని ఈనెల 8వ తేదీన 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా ప్రారంభించాలని, తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ తెలిపారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టియానా జడ్ చొంగ్తు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సిఇఒ ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డిఎంఇ నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, డైరక్టర్ ఆఫ్ హెల్త్ రవిందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకూ 99 రోజుల పాటు చేపట్టనున్న కార్య క్రమాలపైన ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ్మ దిశానిర్దేశం చేశారు. మొత్తం నాలుగు దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని, తొలి దశలో ఈనెల 6వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్క దిద్దడంతో పాటు క్షేత్రస్థాయిలో రక్త హీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మొత్తం స్క్రీనింగ్ ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తిచేయాలని, జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు.

**జూన్ 12 వరకు నాలుగు దశలలో ...**

ప్రజాపాలన రెండవ దశను ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో బిపి, షుగర్, క్యాన్సర్ వంటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులను ఏర్పాటు చేస్తారు. ఏప్రిల్ 16వ తేదీ నుంచి మే 15వరకు నిర్వహించే మూడవ దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టిబి ముక్త భారత్ లక్ష్యంగా టిబి కేసులను గుర్తించడంతో పాటు ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో పెట్టనున్నారు.

**నాల్గవ దశలో పట్టణ ప్రాంతాల్లో...**

మే 16వ తేదీ నుంచి జూన్ 12 వరకు నిర్వహించే నాల్గవ దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. జిహెచ్‌ఎంసి, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పిహెచ్‌సిలను పాలిక్లినిక్‌లను అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించనున్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్ : సిఎంసి
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No. 53/EE/CIR-49/SLPZ/CMC/1-2/2025-26, తేదీ: 02.03.2026
పని రకం: ఇతర పనులు, అంచనా విలువ: రూ.24.55 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 05.03.2026న మ.3.00గం.ల నుండి 12.03.2026న మ.3.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఇఇ, సిఐఆర్-49, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9000115410.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, సిఎంసి.
DIPR R.O. No. : 16331-PP/CL/ADVT/1/2025-26, Date: 04-03-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: సుల్తానాబాద్**
ఇ - ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
1) E1/STLB/13/2025-26, తేది: 0403.2026, 2) పనుల సంఖ్య: 03 పనులు, అంచనా విలువ: రూ.48.15 లక్షలు, 3) బిడ్ డాక్యుమెంట్ : 05.03.2026న ఉ.11:00గం.ల నుండి అందుబాటులో ఉండును, 4) బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది: 07.03.2026న సా.4.00గం.ల వరకు, 5) సాంకేతిక బిడ్ ప్రారంభ తేదీ & సమయం: 09.03.2026న ఉ.11.00గం.లకు, 6) ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ & సమయం: 10.03.2026న ఉ.11.00గం.లకు, 7) సంప్రదించవలసిన అధికారి పేరు & చిరునామా: టి.రమేష్, కమిషనర్, సుల్తానాబాద్ మున్సిపాలిటీ, పెద్దపల్లి జిల్లా. వివరాలకు సంప్రదించండి: టి.రమేష్, కమిషనర్, సెల్ నెం. 6309532229 మరియు పి.రాజ్‌కుమార్, ఎంఎఇ, సెల్ నెం. 6305511253.
సం/- కమిషనర్, సుల్తానాబాద్ మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 16313-PP/CL/ADVT/1/2025-26, Date: 04-03-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, బడంగ్‌పేట్ సర్కిల్-16. E-mail: eec16.badangpet@gmail.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
"Tender notice No.Engg/02/2025-26/21 Date : 04-03-2026. Publishing (09 Works)" కొంత్‌మణి కుంట సమీపంలోని జంక్షన్ ఛాంబర్ నిర్మాణం, బాలాపూర్ పెద్ద చెరువు ఓపెన్ నాలా వద్ద RCC స్లాబ్, స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పక్కన MLR కాలనీ వద్ద Two Vent RCC బాక్స్ కల్వర్టు, పెద్ద చెరువు పక్కన ట్రంక్‌లైన్ ఛాంబర్ నిర్మాణం మరియు రిపేర్, లెనిన్ నగర్‌లోని కట్టమైసమ్మ టెంపుల్ ఎదురుగా మరియు మొబైల్ టవర్ ఎదురుగా ఛాంబర్ల నిర్మాణం మరియు ప్రీకాస్ట్ స్లాబ్, మిథిలానగర్ సమీపంలోని అమ్మవారి టెంపుల్ వద్ద ఛాంబర్ యొక్క నిర్మాణం మరియు ట్రక్‌లేన్ రిపేర్, GHMC సర్కిల్-16, బడంగ్‌పేట్‌లోని వార్డు నెంబర్ 57, 58, 60, 62 వద్ద 600mm డయా, 300mm డయా కలిగిన NP-3 RCC పైప్ లైన్ వేయడం, ఇ-ప్రొక్యూర్‌మెంట్ కోసం రూ.102.40 లక్షలకు. https://tender.telangana,gov.in/login.htmlలో లాగిన్ అవ్వడం ద్వారా వివరాలను చూడగలరు. ఈవెంట్‌ల వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

| ఈవెంట్స్ | 09 పనులు మాత్రమే |
| --- | --- |
| ప్రారంభ తేదీ | 06-03-2026 @ 11.00 AM |
| డౌన్‌లోడ్ ముగింపు తేదీ | 13-03-2026 @ 11.00 AM |
| బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం | 13-03-2026 @ 11.00 AM |
| ప్రైస్ బిడ్ ఓపెనింగ్ | 13-03-2026 @ 11.30 AM |

సంబంధిత అధికారి అడ్రెస్: శ్రీ. D.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, బడంగ్‌పేట్ సర్కిల్-16, 500058. eec16.badangpet@gmail.com
మరిన్ని వివరాల కోసం e-procurement@https: //tender telangana.gov.in/login.htmlలో చూడగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, బడంగ్‌పేట్ సర్కిల్-16, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 16366-PP/CL/ADVT/1/2025-26, Date: 04-03-2026

# బాచుపల్లిలో భారీ అగ్నిప్రమాదం



## అక్రమ షెడ్లలోని ఫర్నీచర్ దుకాణాలు దగ్ధం
### లబోదిబోమంటున్న బాధితులు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** అక్రమ షెడ్లలోని ఫర్నీచర్ దుకాణాల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి రోడ్డు, ప్రగతినగర్ కమాన్, కేజీఆర్ కన్వెన్షన్‌కి ఆనుకుని రోడ్డు పొడువుగా సుమారు 30 ఫర్నీచర్ దుకాణాలను అక్రమ షెడ్లలో ఏర్పాటు చేశారు. గండి మైసమ్మ నుండి మియాపూర్ వెళ్లే రహదారిలో అక్రమ షెడ్లను వేసుకుని ఏకంగా ఫర్నీచర్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఓ బిఆర్ఎస్ నేత ఈ స్థలం తమదే అంటూ షెడ్ల నుండి భారీ ఎత్తున అద్దెలను వసూలు చేస్తుండడం గమనార్హం. కొంతకాలంగా ఆంధ్ర ప్రదేశ్‌కి చెందిన కొంతమంది ఫర్నీచర్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఫర్నీచర్ దుకాణాంలో మంగళవారం రాత్రి అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. ఫర్నీచర్ షాపుల్లోని సామాగ్రి పూర్తిగా దగ్ధమై ఉవ్వెత్తున మంటలు వ్యాపించాయి. ఈ అగ్నిప్రమాదంలో సుమారు ఇరవైకి పైగా దుకాణాలు దగ్ధమైనట్లు తెలుస్తోంది. కోట్లలో ఆస్థి నష్టం జరిగి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న బాచుపల్లి పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికులు, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కొందరు యువకులు సైతం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదం ఏ విధంగా జరిగిందనేది ఇంకా తెలియరాలేదు. అగ్ని ప్రమాదంతో భారీ ఎత్తున ఆస్థి నష్టం జరగడంతో పాటు బాధితులు రోడ్డున పడ్డారు.

**ప్రమాద ఘటనలను పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యేలు...**

బాచుపల్లి, ప్రగతినగర్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనను మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానందలతో పాటు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, మాజీ కార్పొరేటర్‌లు పరిశీలించి బాధితులతో మాట్లాడి అగ్ని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్, వివేక్‌లు మాట్లాడుతూ ప్రమాద ఘటన పై తగిన చర్యలు తీసుకుని, బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు. తమ వంతు సహకారం బాధితులకు అందిస్తామని పేర్కొన్నారు.

**అక్రమ షెడ్లలో సేఫ్టీ లేకపోవడమే అగ్నిప్రమాదానికి కారణాలు...**

బాచుపల్లి, ప్రగతినగర్ కమాన్ ప్రక్కన రహదారి పొడవున అక్రమంగా షెడ్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలను నిర్వహించడం పరిపాటిగా మారింది. ఎలాంటి అనుమతులు కాని, సేఫ్టీ ప్రమాణాలు తీసుకోకపోవడంతోనే భారీ అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోతున్నారు. అక్రమంగా వెలుస్తున్న అక్రమ షెడ్ల పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగితేనే తప్ప అధికారుల్లో చలనం రాదా అని పలువురు నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ షెడ్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఓబిసి లిస్ట్‌లో మిగతా 40 బిసి కులాలను చేర్చాలి

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో 130 కులాలను వెనుకబడిన తరగతుల కులాలుగా గుర్తించడం జరిగిందని, కానీ కేంద్ర ప్రభుత్వం ఓబిసి లిస్ట్‌లో కేవలం 90 కులాలను మాత్రమే చేర్చి, 40 కులాలను చేర్చడం జరగలేదని, తద్వారా తెలంగాణలో బిసిల సంఖ్య తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ 40 కులాలను ఓబిసి లిస్ట్‌లో చేర్చిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో జనగణనను ప్రారంభించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు గృహాల నమోదు, ఆ తర్వాత జనగణన ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు జరగనుందని వివరించారు. ఓబిసి లిస్ట్‌లో లేని 40 కులాలను కూడా చేర్చాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం, బిసి కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, కానీ ఇప్పటివరకు కేంద్రం దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ జనగణనలో కేంద్ర ప్రభుత్వ ఓబిసి లిస్టులో ఉన్న తెలంగాణలోని 90 కులాల ప్రజలను మాత్రమే ఓబిసిలుగా గణనలోకి తీసుకోవడం జరుగుతోందని, తద్వారా తెలంగాణలో ఉన్న బిసి కులాల సంఖ్యను తక్కువగా చూపెట్టే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 బిసి కులాలను కేంద్ర ఓబిసి లిస్ట్‌లో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగిందని నిరంజన్ పేర్కొన్నారు.

# ‘తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సులు నివేదిక’ను ప్రజలలో చర్చకు పెట్టండి

### తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సిఫారుసల నివేదికను రాష్ట్ర ప్రజలల్లో చర్చకు పెట్టి, తుది రూపం ఇవ్వాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ రిపోర్టును కనీసం మూడు నెలల పాటు రాష్ట్ర ప్రజల ముందు చర్చకు పెట్టి, తుది రూపం ఇవ్వాలని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ కె.చక్రధరరావు, ప్రొఫెసర్ జి.హరగోపాల్,ప్రొఫెసర్ కె. లక్ష్మి నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం 1986ను రూపొందించే సమయంలో ‘విద్యారంగంలో సవాళ్లు’ అనే ముసాయిదాపైన ప్రజల నుండి ప్రత్యేకంగా విద్యావేత్తలు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి సలహాలు, సూచనలు తీసుకున్నారని వారు గుర్తు చేశారు. దీనిపైన రెండు సంవత్సరాల పాటు చర్చ కొనసాగిందన్నారు. ‘తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక’పైన రాష్ట్ర ప్రజలల్లో ప్రత్యేకంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులలో చర్చకు పెట్టి, వారి సూచనల, సలహాలు, విమర్శల వెలుగులో తుదిరూపం ఇవ్వాలని సూచించారు.

# జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) 10 మందికి పైగా వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు , పూర్వ విద్యార్థి నాయకులు, పౌర హక్కుల సమర్థకులు, కవులు, రచయితలు, పదవీ విరమణ పొందిన పాఠశాల ఉపాధ్యాయులు, సిపిఐ, కాంగ్రెస్ అనుబంధంగా ఉన్న స్థానిక నాయకులకు సామూహికంగా నోటీసులు జారీ చేయడాన్ని ‘రాజ్య అణచివేత వ్యతిరేక ప్రచారోద్యమం’ ఖండించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎఫ్ఐఆర్ నంబర్ ఆర్‌సి 04/2025లో జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ కేసులో ఉపా కింద అరెస్టు చేసిన ఇన్నయ్య రెడ్డిని, మిగతా వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి బూటకపు ఎనౌకౌంటర్ హత్యగా వస్తున్న ఆరోపణలపైన స్వతంత్ర న్యాయ విచారణ చేపట్టాలన్నారు. పౌర సమాజ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్న ‘ఉపా’ చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది.

# స్నేహం రమ్మంది.. కాల్వ కబళించింది!

### హోలీ సంబరాలు...
### రెండు కుటుంబాల్లో మిగిల్చిన విషాదం...



**ప్రజాపక్షం/హాలియా:** స్నేహాలు ఎంత మధురమో... ప్రమాదాలు అంతకంటే భయంకరం... తెలిసి తెలియని వయసు స్నేహం పిలుస్తుంది... ఆ పిలుపులో ఉండే మాధుర్యాన్ని కాదనలేని ఆ బంధం ఎంత దూరమైనా... ఎంత ప్రమాదమైన... ఎంతవరకైనా వెళ్లాలనుకుంటుంది. ఇది స్నేహానికి ఉన్న గొప్పతనం... కానీ ఆ మధురమైన స్నేహం వెనుక తెలియకుండా జరిగే ప్రమాదాలు అంతకంటే ఎక్కువ భయంకరంగా ఉంటాయన్నది స్నేహమెరుగదు. అలాంటి సంఘటన ఒకటి హోలీ రోజైన మంగళవారం హాలియా ఎడమ కాలువ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుని రెండు కుటుంబాలలో తీరని విషాదాన్ని నింపింది. సంఘటనకు సంబంధించిన వివరాలలోకి వెళితే కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన ప్రకారం హాలియాకు చెందిన ముగ్గురు స్నేహితులు ఆలేటి కార్తీక్, బబ్లు చారి, నాని లు ఇద్దరు బైక్ సర్వీసింగ్ సెంటర్లో, నాని బైక్ మెకానిక్‌గా పక్కపక్క షాపుల్లో పనిచేస్తున్నారు. మంగళవారం హోలీ కావడంతో షాపులు బంద్ చేసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఎవరిళ్లకు వారు వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో నాని తన స్నేహితుడైన బబ్లు చారికి ఫోన్ చేసి బయటికి వెళ్దాం రమ్మంటూ పిలిచాడు. దీంతో బబ్లు చారి కూడా తన స్నేహితుడైన కార్తీక్‌ను కూడా వెంట తీసుకెళ్తామని చెప్పాడు. బబ్లు చారి, నాని కలిసి కార్తీక్ ఇంటికి వెళ్ళగా కార్తీక్ పడుకొని ఉన్నాడు. అయితే స్నేహితులు రావడంతో పడుకున్న కార్తీక్ లేచి వారితోపాటు వెళ్లాడు. ముగ్గురు కలిసి హాలియా బిర్యానీ సెంటర్ వద్ద ఒక బిర్యాని తీసుకొని ఎడమ కాలువ బ్రిడ్జి పైకి వెళ్లారు. అక్కడ ముగ్గురు బిర్యానీ తిని చేతులు కడుక్కుందామని బ్రిడ్జి పక్క ఉన్న మెట్ల వద్దకు వచ్చి చేతులు కడుక్కునేందుకు మొదట వచ్చిన కార్తీక్ కాలుజారి ఎడమకాలువలో పడ్డాడు. కార్తీక్ వెనకాలే వచ్చిన బబ్లు చారి తన స్నేహితుడు కాలువలో జారిపడటాన్ని గమనించి అతను కార్తీక్‌ని కాపాడబోయి తను కూడా కాలువలో పడిపోయాడు. ఇద్దరు కాలువలో పడటానికి చూసిన మరో స్నేహితుడు నాని వెంటనే కేకలు వేయటం ప్రారంభించాడు. ఆ సమయంలో అతనికి ఎవరి సాయం దొరక్క ఒక అర కిలోమీటర్ పరిగెత్తుకుంటూ తన స్నేహితుల్ని కాపాడాలని రోదనలు చేశాడు. కానీ అప్పటికే ఎడమ కాలువలో నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో తన కళ్ళముందే స్నేహితులు కాలువలో కొట్టుకుపోయారు. ఇంకేమి చేయాలి అర్థం కాని నాని ఊర్లోకి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అప్పటికే కాలువలో గల్లంతైన ఇద్దరి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు కాలువలో తీవ్రంగా గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. బుధవారం కూడా ఆ ఇద్దరి కోసం ఇటు పోలీసులు, అటు కుటుంబ సభ్యులు, గజ ఈతగాళ్లు గాలిస్తున్న రాత్రి 7 గంటల వరకు వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇరు కుటుంబాలు తీరని విషాదం అలుముకుంది.

# అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా గత సర్పంచ్‌లకు బిల్లుల చెల్లింపు

### మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలను చెల్లించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత సర్పంచ్‌ల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసిన నేపథ్యంలో2023–24 సంవత్సరానికి విడుదలైన ‘టైడ్ కాంపోనెంట్’ నిధులతో చేపట్టిన తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉన్న మేరకు మాత్రమే గత సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించవచ్చని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. 2023–24 టైడ్ కాంపోనెంట్ కింద విడుదలైన నిధులపై గత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను రికార్డులు సరిచూసి చెల్లించాలని ఆదేశించారు. గత సర్పంచ్‌లు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాలతో తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీలకు టైడ్ కాంపోనెంట్ కింద రూ.245.00 కోట్లు విడుదల చేశారని, అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి బేసిక్ అన్టైడ్, టైడ్ గ్రాంట్స్ కింద రూ.640.07 కోట్లు విడుదల చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ వివరించింది. గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలను చెల్లించాలని సూచించింది.

# రెవెన్యూకు ప్రధానం.. ‘ఎక్సైజ్ శాఖ’

### అబ్కారీ శాఖ పనితీరును పరిశీలించిన ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రధానమైన శాఖ అని, ప్రభుత్వానికి ఈ శాఖ ద్వారా రావాల్సిన ఆదాయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడటం ముఖ్య కర్తవ్యమని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇటీవల గ్రూప్ వన్ పరీక్ష ద్వారా డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికైన 45 మందికి వివిధ ప్రభుత్వ శాఖలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం కొరకు బుధవారం అబ్కారీ శాఖ పనితీరును పరిశీలించారు. అడిషనల్ కమీషనర్ ఎస్.వై.ఖురేషీ స్వాగతం పలుకగా, డిప్యూటి కమిషనర్ శీలం శ్రీనివాస్ ఎక్సైజ్ చట్టాలు, శాఖ పని తీరులతో పాటు ఇతర అంశాలపై ప్రొబెషనరీ డిప్యూటి కలెక్టర్లకు వివరించడంతో పాటు వారు వ్యక్తం చేసిన ప్రశ్నలకు, సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968, సెక్షన్ 17 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో మద్యం పాలసీ రూపొందించుకునే వీలు కల్పిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2620 మద్యం షాపులు ఉన్నాయని, వీటి ఎంపికకు రెండు సంవత్సరాలకు ఒక సారి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా జరుగుతుందని, ఇదే తీరులో బార్ల ఎంపిక కూడ ఉంటుందని వివరించారు. ప్రభుత్వ నియమిత కమిటీ నిర్ణయించిన ధరకు తయారీదారులైన డిస్టిలరి, బ్రూవరీలు మద్యాన్ని హోల్ సేల్ సంస్థ అయిన తెలంగాణ బివియరేజెస్ కార్పొరేషన్ కు సరఫరా చేస్తారని తెలిపారు. ఈ మద్యాన్ని టిజిబిసిఎల్ డిపోల ద్వారా ఏ4 మద్యం షాపులు, బార్లకు పంపిణీ చేయగా, అక్కడి నుండి కొనుగోలుదారులకు అమ్మకాలు జరుగుతాయని వివరించారు. ఈ సెషన్ ముగిసిన అనంతరం అందరిని యునైటెడ్ స్పిరిట్ లిమిటెడ్, మద్యం తయారీ పరిశ్రమ (డిస్టిలరీ)లో తయారీ ప్రక్రియ పరిశీలనకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అదేశాల మేరకు తీసుకువెళ్లగా, అడిషనల్ కమిషనర్ సురేష్ రాథోడ్ మద్యం తయారీ విధానంపై దగ్గరుండి అవగాహన కల్పించారు.

### ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక విజయవంతానికి
# అధికారులంతా సమన్వయంతో పని చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 6 నుంచి జూన్ 12 తేదీ వరకు 5 దశల్లో నిర్వహించనున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో బుధవారం సిఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సి.ఎస్. సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి టి.కె.శ్రీదేవి, ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ఈనె 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 5దశల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజాపాలన, పగతి ప్రణాళిక కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా కేంద్రంలో జిల్లా ఇంఛార్జీ మంత్రిలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమావేశానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు.

ఈనెల 12వ తేదీన ఆయా జిల్లాల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు , సర్పంచులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఇందుకు సంబంధించి పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నాయని సిఎస్ వెల్లడించారు. గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 99 రోజుల పాటు నిర్వహించనున్న ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక సంబంధించి ఎప్పటికప్పుడు తగిన మార్గ దర్శకాలను జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



# ఎంఎన్‌జె డైరెక్టర్ నియామకాన్ని నిరసిస్తూ ఎంఎన్‌జె ఆస్పత్రిలో వైద్యుల నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిమ్స్‌కు చెందిన జూనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ సదాశివుడును ఎంఎన్‌జె ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ డైరెక్టర్‌గా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఎంఎన్‌జె వైద్యులు హైదరాబాద్‌లోని ఎంఎన్‌జె ఆస్పత్రి వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వవైద్యుల సంఘం (టిజిజిడిఎ )అధ్యక్షులు డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లల్లూప్రసాద్, నాయకులు డాక్టర్ దీన్‌దయాల్,డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ సిద్దిపేట రామేశ్, ఉస్మానియా యూనిట్ 2 అధ్యక్షుడు డాక్టర్ వినోద్, ఎంఎన్‌జె సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రామేశ్, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులను పట్టించుకోకుండా,నిమ్స్ నుంచి ఒక జూనియర్ ఫ్యాకల్టీని డైరెక్టర్‌గా నియమించడం సరికాదన్నారు. ఇటువంటి నిర్ణయాలు సమస్యలను పరిష్కరించడం కంటే మరిన్ని సమస్యలను పెంచుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా టిజిజిడిఎ కేంద్ర బృందం డాక్టర్ సదాశివుడిని కలిసి తమ అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని కోరింది.

# మంత్రి అడ్లూరిని కలిసిన టిజిఎస్‌డబ్ల్యుర్ఇఐఎస్ కార్యదర్శి విజయేంద్ర బోయి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటిటీ (టిజిఎస్‌డబ్ల్యుర్ఇఐఎస్) కార్యదర్శిగా, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్‌సిడిడి) కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయేంద్ర బోయి బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాఖ పరిధిలో అమలవుతున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. గురుకుల విద్యాసంస్థల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాల మెరుగుదల, పరిపాలన బలోపేతంపై మంత్రి సూచనలు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని విజయేంద్ర బోయి తెలిపారు.

### ఎస్‌సి గురుకులాల ఖ్యాతిని
# మరింతగా పెంపొందించాలి

### టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి విజయేందిర బోయి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యా ప్రతిభతో పాటు విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, క్రమశిక్షణ, సంస్థ ప్రతిష్టను అత్యున్నత ప్రాధాన్యంగా పరిగణించాలని టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్‌సి గురుకులాల ఖ్యాతిని మరింతగా పెంపొందించేందుకు అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బాలుడిని యువరాజుగా, ప్రతి బాలికను యువరాణిగా గౌరవంతో చూడాలని, పిల్లలపై ఏ రూపంలోనైనా దుర్వినియోగం అస్సలు సహించబడదని స్పష్టం చేశారు. అదనపు కార్యదర్శి గీత, సంయుక్త కార్యదర్శి (అకాడెమిక్స్) సాక్రు నాయక్, సంయుక్త కార్యదర్శి (హయ్యర్ ఎడ్యుకేషన్) శర్మలతో కలిసి బుధవారం విజయేందిర బోయి హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లోని ప్రధాన కార్యాలయం నుండి జిల్లా కోఆర్డినేటింగ్ అధికారులు (డిసిఓలు), జోనల్ అధికారులు (జెడ్ఓలు), మల్టీ జోనల్ అధికారులు (ఎంజడ్ఓలు)తో జూమ్ ద్వారా సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యా ప్రగతి, విద్యార్థుల సంక్షేమం, సంస్థల నిర్వహణ, పరిపాలనా ప్రమాణాలపై సమీక్ష నిర్వహించి పలు ముఖ్య సూచనలు జారీ చేశారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని, విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో శ్రద్ధగా మార్గదర్శకత్వం అందించాలన్నారు.

విద్యార్థులు ఎటువంటి సంకోచం లేకుండా ఫోన్ మిత్ర సదుపాయాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలని, కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులతో స్వేచ్ఛగా మాట్లాడుకునేలా ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఆందోళన లేదా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి తక్షణ సహాయం అందించాలన్నారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత ఆరోగ్య కార్డు ప్రవేశపెట్టడంతో పాటు వేసవి ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని మార్చి నెలలో సమగ్ర ఆరోగ్య పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్‌లో అత్యున్నత వృత్తిపరమైన ప్రమాణాలను కొనసాగించేందుకు నిరంతరం కృషి చేయాలని విజయేందిర బోయి పిలుపునిచ్చారు.

### ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 12-17 వరకు
# భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్

### క్రికెట్ పోస్టర్‌ను విడుదల చేసిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల దేశ స్వాతంత్ర్యలో కీలక భూమిక పోషించారని, అటువంటి మహనీయుడిని 95వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని తెలంగణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారటీ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మార్చ్ 1217 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను బుధవారం శివసేనా రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ 6 రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ ను రాష్ట్ర పరిధిలోని యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నర్సింహా,ఏమినెంట్ క్రీడాకారులు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంబించనున్నారని తెలిపారు .అదే విధంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వారు వెల్లడించారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న యువత ఈ క్రింది నంబర్లను కో ఆర్డినేటర్ శ్రీకాంత్ 7386690103, ఆర్గనైజర్స్ బాలకృష్ణ 8885173361, మహమూద్ 8121347855లను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యనిర్వహాక అధ్యక్షులుషేక్ మహమూద్,కార్యవర్గ సభ్యులు కళ్యాణ్,జోసెఫ్ భాను, అనీల్ కుమార్ పాల్గొన్నారు.



# హోలీ వేడుకల్లో రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని 24వ నంబర్ అక్బర్ రోడ్డులో ఉన్న ఎఐసిసి కార్యాలయంలో హోలీ వేడుకలు ఘనగా నిర్వహించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పార్టీ కార్యకర్తలతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఆయన మద్దతుదారులు, నాయకులు రాహుల్‌కు రంగులు అద్దారు. రాహుల్‌గాంధీ అందరికీ ప్రేమతో నిండిన, ద్వేషాన్ని తొలగించే హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, జర్నలిస్టులు చుట్టుముట్టగా, అందరిపై రాహుల్ రంగులు పూశారు, ప్రతిగా వారు 'గులాల్' అద్దారు. ఎక్స్‌లో వేడుకల చిత్రాలను షేర్ చేస్తూ, గాంధీ హిందీలో చేశారు. 'రంగులు, ప్రేమల పండుగ, హోలీ సందర్భంగా మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. హోలీ రంగులు మీజీవితాలను కొత్త ఆశలు, కొత్త ఉత్సాహం, లెక్కలేనన్ని ఆనందాలతో నింపాలని ఆకాంక్షించారు. ముందుగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హోలీ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'హోలీ అనేది మన రంగుల, బహుళ సాంస్కృతిక సమాజ ఆత్మను వ్యక్తపరిచే పండుగ. ఇది శతాబ్దాలుగా మన నాగరికతకు ముఖ్య లక్షణంగా ఉన్న వైవిధ్యంలో ఐక్యత, పరస్పర సామరస్యం, సోదరభావ సంప్రదాయాన్ని జరుపుకుంటుంది' అని ఖర్గే 'ఎక్స్'లో హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'దూరాలను వారధి చేసే ఈ ఆనందకరమైన సందర్భంగా, మీ అందరికీ హోలీ శుభాకాంక్షలు. మీ జీవితం ఎల్లప్పుడూ ఆనందపు రంగులతో నిండి ఉండాలని కోరుకుంటున్నాను'అని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా హోలీ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఆనందం, ఉత్సాహం, ఆనందం, మాధుర్యం, సోదరభావం కూడిన విభిన్న రంగులతో నిండిన ఐక్యతకు నిదర్శనమైన గొప్ప పండుగ అయిన హోలీకి హృదయపూర్వక శుభాకాంక్ష లు' అని ఆమె ఎక్స్‌లో హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'హోలీ మీ కుటుంబం, స్నేహితులు, ప్రతి ఒక్కరినీ ప్రేమగా ఆలింగనం చేసుకునే గొప్ప పండుగ. అందరినీ ఆలింగనం చేసుకోండి, అందరితో ఆనందాన్ని పంచుకోండి. దేశ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు!'అని ఆమె అన్నారు.

## మయన్మార్ శాంతి ప్రక్రియకు
# భారత్ మద్దతు

### కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్



**న్యూఢిల్లీ :** అందరికీ శాశ్వత శాంతి, అభివృద్ధిని అందించే మయన్మార్ నేతృత్వంలోని, మయన్మార్ స్వీయ శాంతి ప్రక్రియకు భారతదేశం మద్దతు ఇస్తుందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ వెల్లడించారు. భారతదేశ మూడు కీలక ప్రాధాన్యతలైన 'నైబర్‌హుడ్ ఫస్ట్', 'యాక్ట్ ఈస్ట్', 'మహాసాగర్ ' కలయికలో మన దేశ సంబంధాలు మయన్మార్‌తో ముడిపడి ఉన్నాయన్నారు. మయన్మార్ భారతదేశానికి వ్యూహాత్మక పొరుగుదేశాలలో ఒకటిగా ఉందన్నారు. ఇది ఉగ్రవాద ప్రభావిత ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్ తదితర రాష్ట్రాలతో 1,640 కి.మీ సుదీర్ఘ పొడవైన సరిహద్దును కలిగి ఉందన్నారు. 2021 ఫిబ్రవరి 1 సైనిక తిరుగుబాటు ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న అనంతరం దేశంలో విస్తృత హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. మయన్మార్‌లో ఇటీవల జరిగిన జనరల్ ఎన్నికలలో సైనిక మద్దతు ఉన్న పార్టీ విజయం సాధించిందన్నారు. భారతదేశ సహాయంతో యాంగాన్ నడిబొడ్డున నిర్మించబడిన సర్వోబేక్మన్ సాహిత్య కేంద్ర భవన ప్రారంభోత్సవంలో బుధవారం మంత్రి జై.శంకర్ వర్చువల్‌గా మాట్లాడారు. '140 కోట్ల మందితో అత్యధిక జనాభా కలిగి ఉన్న దేశ ప్రజలు, శాంతి, సామరస్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పరిఢవిల్లుతున్నదని వివరించారు. భారతదేశం తన అనుభవ సమాఖ్యవాదం, రాజ్యాంగ భద్రతను మయన్మార్‌మార్‌లోని భాగస్వాములతో తరచుగా తన అనుభవాలను భారతదేశం క్రమం తప్పకుండా పంచుకుంటోందని చెప్పారు. మయన్మార్ నేతృత్వం వహించిన మయన్మార్ స్వీయ సమ్మిళిత శాంతి ప్రక్రియను తాము సమర్థిస్తామని మంత్రి చెప్పారు. సర్వోబేక్మన్ సెంటర్ మయన్మార్‌లోని శాస్త్రీయ, జానపద సాహిత్యాల అనువాదం, ప్రాచీన రచనలు, సృజనాత్మక రచన, మేధోపర మార్పిడి పరిరక్షణ, అధ్యయనానికి సహాయపడుతుందన్నారు. మయన్మార్ మన దేశంతో మూడు కీలక విదేశీ విధాన ప్రాధాన్యతల కలయికలో ఉందని, 'నైబర్‌హుడ్ యాక్ట్', 'యాక్ట్ ఈస్ట్' ఇండో పసిఫిక్ సహా మహాసాగర్ ప్రాధాన్యతలను కలిగి ఉందని వివరించారు. ఇరుదేశాల బహుముఖ చర్చల్లో రాజకీయ భద్రత, సాంస్కృతిక సహకారం కూడా ఉంటాయని మంత్రి తెలిపారు. అభివృద్ధి సహకారం విషయానికి వస్తే మయన్మార్‌తో భారతదేశ సంబంధం ప్రజల డిమాండ్ ఆధారితమైన భాగస్వామ్యగా ఉంటుందన్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజల జీవితాలను మెరుగుపర్చడం లక్ష్యంగా ఉంటుందని వివరించారు. భారతదేశం, మయన్మార్‌తో శతాబ్దాలుగా ఆధ్యాత్మికత, బంధుత్వం, భౌగోళికం సహా సాహిత్యం ద్వారా కూడా ఒక విడదీయరాన్ని అనుబంధం పెనవేసుకుందని మంత్రి జైశంకర్ చెప్పారు. బౌద్ధమతం, పాళీ భాష, సాహిత్యం వంటి ఆలోచన, గ్రంథాలు, ఉమ్మడి మేధోపరమైన వారసత్వాన్ని దక్షిణాసియా వెంట తీసుకెళ్లాయని మంత్రి తెలియజేశారు.



# సీట్ల పంపకాలపై డిఎంకెతో ఎంఎన్ఎం చర్చలు

**చెన్నై :** నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ నేతృత్వంలోని ఎంఎన్ఎం బుధవారం రానున్న అసెంబ్లీ ఎన్నికలకు డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చించింది. మాజీ ఐపిఎస్ అధికారి ఎజి మౌర్యతో సహా సీనియర్ పార్టీ సహచరులతో కలిసి పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎంఎన్ఎం కూటమిని ఎలా బలోపేతం చేయగలదో కోశాధికారి టిఆర్ బాలు నేతృత్వంలోని డిఎంకె కమిటీకి తాను వివరాలను అందించానని చెప్పారు. బుధవారం డిఎంకె సీట్ల పంపకాల కమిటీ, మక్కల్ నీది మయ్యమ్ ఏర్పాటు చేసిన ప్యానెల్ మధ్య చర్చలు జరిగాయని, ఎంఎన్ఎం ఈ కూటమిని ఎలా బలోపేతం చేయగలదో చర్చ జరిగిందని, దానిపై తాము కొంత డేటాను అందించామని అరుణాచలం డిఎంకె ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో విలేకరులతో అన్నారు. వివరాలను ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌కు అందజేస్తామని డిఎంకె నాయకులు మాకు తెలియజేశారని ఆయన అన్నారు. 'మా నాయకుడు (కమల్ హాసన్) మార్గదర్శకత్వం ప్రకారం, మేము మా డేటాను వారికి (డిఎంకె) సమర్పించాము. తదుపరి కార్యాచరణ గురించి రాన్ను రోజుల్లో మేము తెలుసుకోగలుగుతాము' అని ఆయన అన్నారు. ఎంఎన్ఎం ఎన్ని సీట్లలో పోటీ చేయాలనే ఆలోచనలో ఉందని అడిగినప్పుడు, అరుణాచలం మాట్లాడుతూ 'ప్రస్తుతానికి ప్రాథమిక స్థాయి చర్చలు జరిగాయి. ఆ వివరాలను (సీట్ల భాగస్వామ్యం) మేము బహిరంగంగా పంచుకోలేము' అని అన్నారు.

# రాజ్యసభకు నితీశ్!



**న్యూఢిల్లీ :** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురువారం పాట్నాలో రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిని నియమించే అవకాశం ఉందని వర్గాలు పేర్కొన్నాయి. జెడి(యు) అధ్యక్షుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో బిజెపిజాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేస్తారని వారు తెలిపారు. జెడి(యు) అధ్యక్షుడు నితీష్ కుమార్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ గురువారం రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేస్తారు. వారితో హోంమంత్రి అమిత్ షా కూడా ఉంటారు' అని ఎన్‌డిఎ వర్గాలు పిటిఐకి తెలిపాయి. బిహార్ ముఖ్యమంత్రి పదవికి కూడా కుమార్ రాజీనామా చేస్తారా అని అడిగినప్పుడు, అది సరైన సమయంలో జరుగుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

# నెతన్యాహు, ట్రంప్ పోస్టర్లకు మెహబూబా ముఫ్తీ నిప్పు



**శ్రీనగర్:** అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతం కావడంపై జమ్ముకశ్మీర్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం శ్రీనగర్‌లో జరిగిన నిరసనలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) అధినేత్రి మెహబూబా ముఫ్తీ పాల్గొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్టర్లకు నిప్పంటించి తగలబెట్టారు. 2019లో మరణించిన అమెరికన్ ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫొటో కూడా ఆ పోస్టర్‌లో ఉన్నది. కాగా, అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా, ఖమేనీకి మద్దతుగా మెహబూబా ముఫ్తీ నినాదాలు చేశారు. ఆ తర్వాత ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇరాన్‌కు అనుకూలంగా పోస్ట్ చేశారు. 'మీకు న్యాయం జరిగే వరకు శాంతియుతంగా నిలబడే వారితో శాంతియుతంగా, మిమ్మల్ని వ్యతిరేకించే వారి పట్ల వ్యతిరేకంగా నేను ఉంటా' అని అందులో పేర్కొన్నారు. మరోవైపు భారత్, జమ్ముకశ్మీర్ ప్రభుత్వాలు ఖమేనీ హత్యపై మౌనంగా ఉన్నాయని మెహబూబా ముఫ్తీ విమర్శించారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, దారుణాలపై మాట్లాడే వారిని నేరస్తులుగా పరిగణించి కేసులు నమోదు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

# ఉగ్రవాదుల చొరబాటు యత్నం భగ్నం

**రాజౌరి/జమ్ము :** జమ్ముకశ్మీర్ రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్ఓసి) వెంబడి ఉగ్రవాదుల బృందం చేసిన చొరబాటు ప్రయత్నాన్ని బుధవారం ఆర్మీ దళాలు భగ్నం చేశారు. తుర్కండి ముందు ప్రాంతం నుండి తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు ఈ వైపు చొరబడటానికి ప్రయత్నించడాన్ని గమనించి సైన్యం కాల్పులు జరిపిందని అధికారులు తెలిపారు. జమ్ములో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్ సరిహద్దు అవతల నుండి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేసినట్లు ధృవీకరించింది. విశ్వసనీయ నిఘా సమాచారం, నిరంతర నిఘా ఆధారంగా బుధవారం తెల్లవారుజామున ఎల్ఓసి వెంబడి భింబర్ గాలి సాధారణ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికను గుర్తించారు. 'నిర్ణయాత్మక శక్తితో స్పందించి, అత్యున్నత వ్యూహాత్మక అమలును ప్రదర్శిస్తూ, వైట్ నైట్ కార్ప్స్ అప్రమత్తమైన దళాలు వేగంగా నిమగ్నమై, చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేశాయి. ఎల్ఓసిని ఉల్లంఘించడాన్ని తిరస్కరించాయి. 'సమగ్ర భూ చర్య ద్వారా శత్రువుల కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టారు' అని అది ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొంది. కాల్పుల్లో ఎవరైనా ఉగ్రవాది హతమయ్యాడా లేదా అనేది వెంటనే స్పష్టంగా తెలియదని అధికారులు తెలిపారు. తీవ్రవాదుల ఉనికిని తొలగించడానికి భారీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. అదనపు బలగాలను ప్రవేశపెట్టారు. సమగ్ర భూ, వైమానిక నిఘా ద్వారా ఈ ప్రాంతంపై నిరంతర ఆధిపత్యాన్ని నిర్ధారించడానికి సొంత దళాలను తిరిగి మార్చారు.

# సిఎం పదవి కోసం విప్లవం చేయాల్సిన అవసరం లేదు


### డిప్యూటీ సిఎం డికె శివకుమార్



**బెంగళూరు :** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సిఎం డికె శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సిఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం లేదని, కాలమే నిర్ణయిస్తుందన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసని చెప్పారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సిఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తున్న వార్తల గురించి తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ చెప్పారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందని తెలిపారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని, కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని చెప్పారు. సిఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపారేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డికె శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలుతేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

# ఢిల్లీ టీమ్ (బిజెపి)తో సహా అన్ని జట్లను టివికె ఓడిస్తుంది

### టివికె పార్టీ విజయ్



**తంజావూర్ :** తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈసారి ప్రముఖ నటుడు విజయ్ పార్టీ టివికె (తమిళగ వెట్రి కళగం) బరిలో ఉండటమే అందుకు కారణం. బుధవారం తంజావూరు జిల్లాలో జరిగిన బహిరంగ ర్యాలీలో పార్టీ మ్యానిఫెస్టోను విజయ్ ఆవిష్కరించారు. ఈసారి జరిగే ఎన్నికలు ఇతరులకు సాధారణమేనని, అయితే తనకు మాత్రం ఇవి ఓ భావోద్వేగమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'తమిళనాడులో ఈసారి జరిగే ఎన్నికలు ఇతరులకు సాధారణమేనని.. కానీ నాతో పాటు నన్ను ప్రేమించే ప్రజలకు భావోద్వేగం. ఈ సారి ఎన్నికల్లో ఢిల్లీ టీమ్ (బిజెపి)తో సహా అన్ని జట్లను టివికె ఓడిస్తుంది. క్రికెట్‌లో తమిళనాడు సిఎస్కేకు విజిల్ వేస్తే.. ఈ ఎన్నికల్లో టివికె 'విజిల్' (టివికె పార్టీ గుర్తు) మారుమోగనుంది. ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఎవరూ విడగొట్టలేరు' అని విజయ్ అన్నారు. అలాగే పలు హామీలు ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే, రెండు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతు బిడ్డల ఉన్నతవిద్యకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అయితే ఆ కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదన్నారు. ఉన్నత విద్యకోసం భారీగా ఖర్చు చేయలేని పేద కుటుంబాలకు సహకరించడమే తమ ఉద్దేశమన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు రక్షణ కల్పిస్తామన్నారు. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది పొంగల్‌కు విడుదల కావాల్సిన విజయ్ చిత్రం 'జననాయగన్' న్యాయపరమైన చిక్కులతో ఆగిపోయింది. ఈ సభలో దానిగురించి ప్రస్తావించారు. 'ఈ విషయంలో చాలామంది మద్దతుగా తమ గళాన్ని వినిపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా వారిలో ఉన్నారు. ఆయనకు కృతజ్ఞతలు. అయితే ఆయన మద్దతు ఇచ్చినా.. పరిస్థితిలో మార్పు కనిపించలేదు' అని వ్యాఖ్యానించారు.

# రాజ్యసభకు ఎన్నికలు... శరద్ పవార్‌కు కాంగ్రెస్ మద్దతు



**ముంబయి :** మహారాష్ట్ర నుండి రాజ్యసభ ఎన్నికలకు మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) అభ్యర్థిగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎస్‌పి) అధినేత శరద్ పవార్‌కు కాంగ్రెస్ బుధవారం మద్దతు ప్రకటించింది. ముంబయిలో ప్రతిపక్ష కూటమి ఖాళీగా ఉన్న ఏడు స్థానాల్లో ఒకదాన్ని గెలుచుకునే స్థితిలో ఉంది. 16న మహారాష్ట్ర నుండి పార్లమెంటు ఎగువ సభకు జరిగే ఎన్నికల్లో సిట్టింగ్ రాజ్యసభ ఎంపి పవార్‌కు మద్దతు ఇవ్వాలనే నిర్ణయం గురించి కాంగ్రెస్ నాయకత్వం తనకు తెలియజేసిందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రమేష్ చెన్నితల పిటిఐకి తెలిపారు. ద్వైవార్షిక ఎన్నికలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి చివరి తేదీ (మార్చి 5) కంటే ఒక రోజు ముందు మాజీ కేంద్ర మంత్రికి కొత్త రాజ్యసభ పదవికి మద్దతు ఇవ్వాలనే కాంగ్రెస్ నిర్ణయం వచ్చింది. అంతకుముందు, అసెంబ్లీలో తమ బలాన్ని బట్టి ప్రతిపక్ష కూటమి రాష్ట్రం నుండి గెలుచుకోగల ఏకైక స్థానానికి మూడు ఎంవిఎ మిత్రపక్షాలు కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి) కోరాయి. ఏప్రిల్‌లో ఖాళీ కానున్న మహారాష్ట్ర నుండి ఏడు రాజ్యసభ సీట్లలో ఉమ్మడి ప్రతిపక్షం ఒకదాన్ని మాత్రమే పొందగలదు. 288 మంది సభ్యులున్న శాసనసభలో సంఖ్య 286కి తగ్గినందున, ఎన్నికయ్యే అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓట్ల కోటా 36. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణం కారణంగా రెండు (అహల్యానగర్ జిల్లాలోని రాహురి నుండి ఎన్నికైన శివాజీరావ్ కార్డిలే (బిజెపి), పుణె జిల్లాలోని బారామతికి ప్రాతినిధ్యం వహించిన అజిత్ పవార్ (ఎన్‌సిపి) ఖాళీలు ఉన్నాయి. శివసేన (యుబిటి)కి 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ 16, ఎన్‌సిపిఎస్‌పి 10 ఉన్నారు. రాజ్యసభ ఎన్నికలకు శాసనసభ సభ్యులు ఎలక్టోరల్ కాలేజీని ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే అధికార బిజెపి ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను ప్రకటించింది.

# భారత్‌లో ఫిన్లాండ్ ప్రెసిడెంట్ స్టబ్ '4 రోజుల పర్యటన' షురూ

### స్వాగతం పలికిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ
### స్టబ్ పర్యటన భారతదేశాన్ని 'కొత్త శిఖరాలకు తీసుకెళుతుంది' అని మోదీ ఆశాభావం



**న్యూఢిల్లీ :** వాణిజ్యం, పెట్టుబడి, కీలకమైన సాంకేతికతతో సహా విస్తృతమైన రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడానికి భారతదేశానికి విచ్చేసిన ఫిన్నిష్ ప్రెసిడెంట్ అలెగ్జాండర్ స్టబ్ బుధవారం తన నాలుగు రోజుల పర్యటనను ప్రారంభించారు. ఇండియా చేరుకున్న అలెగ్జాండర్ స్టబ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాగతం పలికారు. స్టబ్ పర్యటన భారతదేశం–ఫిన్‌లాండ్ సంబంధాలను 'కొత్త శిఖరాలకు తీసుకెళుతుంది' అన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తం చేశారు. గురువారం అలెగ్జాండర్ స్టబ్ ప్రధానమంత్రి మోదీతో చర్చలు జరుపనున్నారు. చర్చల అనంతరం ఇరుదేశాల నేతలు వివిధ రంగాలలో సహకారాన్ని పెంపొందించడానికి అనేక అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంటారని భావిస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి వీరిరువురూ సమావేశంలో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. 'ఈ పర్యటన వాణిజ్యరంగం సహా భారతదేశం, భారతదేశం మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని స్టబ్ న్యూఢిల్లీకి బయల్దేరేముందు సోషల్ మీడియాకు వెల్లడించారు. గురువారం సాయంత్రం జరిగే 'రైసినా డైలాగ్ ప్రారంభ సెషన్'కు ఫిన్నిష్ ప్రెసిడెంట్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ప్రెసిడెంట్ అలెగ్జాండర్ స్టబ్ భారతదేశానికి స్వాగతం. నేను మీతో పూర్తిగా ఏకీభవిస్తాను. మీ పర్యటన భారతదేశంఫిన్‌లాండ్ సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చగలదు. గురవారం జరుగనున్న సమావేశం, 'రైసినా డైలాగ్ 2026' కోసం నేను అమితాసక్తితో ఎదురుచూస్తునని స్టబ్ వ్యాఖ్యలకు స్పందనగా ప్రధానమంత్రి తన 'ఎక్స్' పోస్ట్‌లో ప్రతిస్పందించారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌కు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. భారతదేశం, ఫిన్లాండ్ ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలతో కూడిన స్నేహ పూర్వక, స్నేహపూర్వక సబంధాన్ని పంచుకుంటాయి. ప్రెసిడెంట్ స్టబ్ పర్యటన భారతదేశం–ఫిన్లాండ్ సంబంధాలకు మరింత శక్తిని ఇస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ సోషల్ మీడియాకు చెప్పారు. ప్రెసిడెంట్ స్టబ్‌తో పాటు మంత్రులు, సీనియర్ అధికారులు, వ్యాపార లీడర్లతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఉంది. ఫిన్లాండ్ ప్రధానమంత్రి పెట్టోరి ఓర్పో న్యూఢిల్లీకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) శిఖరాగ్ర సదస్సుకు వెళ్లిన కొన్ని వారాల తర్వాత ఫిన్లాండ్ ప్రెసిడెంట్ భారతదేశ పర్యటన సాగింది. ఫిన్నిష్ ప్రెసిడెంట్ రాష్ట్రపతి ద్రౌపది ము ర్ము, ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌లతో కూడా సమావేశం కానున్నారు. ఇదిలాఉంటే స్టబ్ శుక్రవారం ముంబయికి వెళ్లనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌లో భాగంగా పలువురు వ్యాపార నాయకులను కలువనున్నారు. అలెగ్జాండర్ స్టబ్ భారత్‌లో పర్యటన శనివారంతో ముగియనున్నది.

# ఓటరు తుది జాబితా తరువాత మానసిక ఒత్తిడితో ఇద్దరు ఆత్మహత్య

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో 'సర్' సంబంధిత ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. తాజాగా జల్పైగురి, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకుని మరణించారని అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తర్వాత తుది జాబితా ప్రచురించచగా, మానసిక ఒత్తిడి కారణంగా వారు బలవన్మరణానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. రఫీక్ అలీ గాజీ (44) బుధవారం ఉదయం దక్షిణ 24 పరగణాలలోని ఘోల్పారా ప్రాంతంలో తన గదిలో ఉరివేసుకుని కనిపించారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గాజీ పేరు ఓటరు జాబితాలో 'అండర్ అబ్జక్టివేషన్' కేటగిరీలో ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఆ కేటగిరీలో అతని పేరు కనిపించిన తర్వాత అతను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడని ఆయన కుటుంబం పేర్కొంది. మరో సంఘటనలో జల్పైగురి పట్టణంలో మోమో విక్రేత అయిన గౌరంగ దే (62) మంగళవారం ఉదయం తన నివాసంలోని వాష్‌రూమ్‌లో ఉరివేసుకుని కనిపించాడని పోలీసులు తెలిపారు. ఫిబ్రవరి 28న ప్రచురించబడిన తుది జాబితాలో తొలగించబడిన కేటగిరీలో తన పేరు కనిపించడంతో గౌరంగ చాలా ఆందోళన చెందాడని ఆయన భార్య పేర్కొన్నారు. '2002 ఓటరు జాబితాలో ఆయన పేరు లేదు, కానీ ఆయన సర్ ప్రక్రియలో అవసరమైన అన్ని పత్రాలను సమర్పించారు. విచారణకు (సవరించిన ఓటరు జాబితాలో తన పేరును చేర్చడానికి) హాజరయ్యారు' అని ఆమె విలేకరులతో అన్నారు. తుది జాబితాలో గౌరంగ మరణాన్ని తన పేరు లేకపోవడంతో అనుసంధానిస్తూ, అధికార తృణమూల్ కాంగ్రెస్ బుధవారం ఎక్స్ పోస్ట్‌లో ఇలా పేర్కొంది... 'హృదయ విదారక విషాదం బెంగాల్‌ను మరోసారి తాకింది. జల్పైగురిలో వినయపూర్వకమైన మోమో విక్రేత గౌరంగ దే, దాదాపు నాలుగు దశాబ్దాలుగా విశ్వాసపాత్రంగా ఓటింగ్ చేసినప్పటికీ కనికరం లేకుండా తన పేరును ఓటర్ల జాబితా నుండి తొలగించిన తర్వాత తన ప్రాణాలను తీసుకున్నాడు ఎన్నికల కమిషన్ బిజెపితో కుట్రపన్నిందని ఆరోపిస్తూ, టిఎంసి ఈ దుష్ట బిజెపి–ఇసిఐ అనుబంధం పేదలు, అణగారిన వర్గాలుష బెంగాల్ హక్కుదారుల ఓటర్లను అపూర్వమైన స్థాయిలో తొలగించడానికి క్రమపద్ధతిలో కుట్రను అమలు చేస్తోంది' అని పేర్కొంది. మా మా–మతి–మనుష్ ప్రభుత్వం బెంగాల్ ప్రజలకు అండగా నిలుస్తుందని, ఈ అన్యాయంపై తాము అన్ని విధాలుగా పోరాడుతామని, ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడుతామని తెలిపింది. ఫిబ్రవరి 28 నుండి పశ్చిమ బెంగాల్‌లో సర్ సంబంధిత భయాందోళనల కారణంగా ఇద్దరు వ్యక్తులు మరణించారని టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ అన్నారు. నవంబర్ నుండి రాష్ట్రంలో సర్ ఒత్తిడి కారణంగా 110 కంటే ఎక్కువ మరణాలు సంభవించాయని పార్టీ గతంలో పేర్కొంది.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS02FD 6656 | Vijender Gandikota | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2014 |
| 2 | TS27T 1623 | Harish Sai Reddy | JOHN DEERE 5310 | 2017 |
| 3 | TS03UD 5778 | Shaga Sambraju | SWARAJ MAZDA EXECUTIVE LX AC BS6 FBV-P | 2023 |
| 4 | TS30T 1678 | Nrmala Badavath | MAHINDRA JEETO 11HP | 2017 |
| 5 | TS27T 8316 | Shiva polu | MARUTHI DZIRE TOUR DIESEL-P | 2015 |
| 6 | AP16TS 0391 | Raghu Chirra | AL 2523N FBT-T | 2018 |
| 7 | AP10Y 0441 | Bosu Krishna | SWARAJ 735FE | 2010 |
| 8 | TS07GD 7881 | Vinay Kola | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2012 |
| 9 | TG03T 0274 | Maloth Ravi Kumar | TATA INTRA V50 BS6 | 2024 |
| 10 | AP09CS 1176 | Srikanth Boda | VENTO 1.5L MT HIGHLINE DIESEL 5 SEATER | 2013 |
| 11 | TS03UC 3883 | Sudhakar Adduri | SWARAJ MAZDA SAMRAT GS CNG-P | 2018 |
| 12 | TS05UF 1175 | Devika Pallapu | MARUHTI ERTIGA BS6 CNG-P | 2022 |
| 13 | TS07FU 2455 | Syed Raheem | VITARA BREZZA 1.2L VDI (O) MT DIESEL 5 SEATER | 2017 |
| 14 | TS08UL 5474 | Rajesh Pittala | RENAULT LODGY-P | 2015 |
| 15 | TS07UC 2365 | Mohan Reddy Gopu | TOYOTA ETIOS DIESEL-P | 2016 |

**AUCTION DATE : 07-03-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
D.No : 24-7-29,1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet
Cell : 9959090723 & 9000444965

# గల్ఫ్ యుద్ధం విస్తరిస్తుందా?

ఎటువంటి కవ్వింపు లేకుండా, దుష్టబుద్ధితో ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై క్షిపణిదాడులతో కలుగజేస్తున్న విధ్వంసం, గల్ఫ్‌లోని ఏడెనిమిది అరబ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు ఐదురోజులుగా కొనసాగుతున్నాయి. ఈ యుద్ధ ప్రభావం గల్ఫ్ ప్రాంతంపైనేగాక దాదాపు 150 దేశాలపై ఏదోకరూపంలో ఉన్నట్లు అంచనా. ఇరాన్ 'ఎన్నటికీ అణుబాంబు తయారు చేయబోదన్న' హామీతో అమెరికాతో అణు ఒప్పందానికి సంసిద్ధత తెలియజేసిన మరునాడే అమెరికా, దాని తొత్తు ఇజ్రాయెల్ ఇరాన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి పాల్పడటంలో దురుద్దేశం స్పష్టం. భీకరయుద్ధంలో భారీగా ఆస్తినష్టాలు, ప్రజలకు కంటిమీద కునుకులేని కడగండ్లు కలుగుతున్నప్పటికీ, వైరిపక్షాలను సంప్రదింపుల బల్లవద్దకు తెచ్చే ప్రయత్నాలు కనిపించకపోవటం అతిపెద్ద విషాదం. ఇంతపెద్ద వినాశకరమైన యుద్ధం జరుగుతుంటే భద్రతా మండలి ఎందుకు సమావేశం కాలేకపోతున్నది? రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఎన్నో ప్రాంతీయ యుద్ధాలు జరిగినా ఇటువంటి దుస్థితి ఏనాడూ లేదు. అంటే ప్రపంచ వ్యవస్థ గాడి తప్పింది.

ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీని, అనేకమంది ముఖ్యమైన ప్రభుత్వ నాయకులను బాంబుదాడులతో శత్రురాజ్యాలు హత్యచేసినా, వారి 'ప్రభుత్వం మార్పు' దురాకాంక్ష నెరవేరలేదు. ఇరాన్‌కున్న నావికా, క్షిపణి వ్యవస్థలను నిర్వీర్యం చేసి లొంగదీసుకునేందుకు దాడులు కొనసాగుతున్నాయి. తమ అధినాయకుడు హతుడైనా బెంబేలెత్తిపోని ఇరాన్ నాయకులు వెంటనే ధైర్యం కూడదీసుకుని ఎదురుదెబ్బకు దిగటం వారి ధీరోదాత్తతకు, దేశంపట్ల నిబద్ధతకు నిదర్శనం. గల్ఫ్‌లోని అరబ్ రాచరిక ప్రభుత్వాలన్నీ అమెరికా, ఇజ్రాయెల్ దుర్మార్గాన్ని ఖండించాల్సిందిపోయి పిరికితనం ప్రదర్శిస్తున్నాయి. అమెరికా దీర్ఘకాలంగా ఆ రాజులను బుజ్జగించింది, తన సైనిక స్థావరాలను నెలకొల్పుకుంది. అమెరికాకు గుణపాఠం నేర్పేందుకై ఇరాన్ ఆ సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేస్తుంటే, అది తమ సార్వభౌమత్వంపై దాడిగా ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేయటం విడ్డూరంగా ఉంది. తమ భూభాగాలపై దాడిచేసిందన్న నెపంతో వారు ఇరాన్‌పై యుద్ధానికి దిగుతారన్నమాట. ఇరాన్ కోరుకునేదీ అదే. గల్ఫ్ దేశాల మధ్య సంఘర్షణ మొదలైతే అది దీర్ఘకాల యుద్ధమై ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కకావికలు చేస్తుంది. అప్పుడైనా ప్రపంచదేశాలు అమెరికాపై ఒత్తిడి చేయకపోవు.

అమెరికాతో చర్చల పునరుద్ధరణకు ఇరాన్ తాజాగా సుముఖత తెలియజేసినప్పటికీ, ట్రంప్ నిరాకరించటంలో దురుద్దేశం స్పష్టం. మరోవైపున, బ్రిటన్, యూరప్ దేశాలు తనను సమర్థిస్తూ యుద్ధంలో ప్రవేశించకపోవటం ట్రంప్‌కు ఆందోళన కలిగించే విషయం. గతంలో అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌పై అమెరికా దండయాత్రల సమయంలో నాటో దేశాలు లాంఛనంగా పాల్గొన్నాయి. ఈ పర్యాయం ఆ పరిస్థితి లేదు. ట్రంప్ అధికారంలో ఉన్న గత సంవత్సరకాలంలో నాటో బడ్జెట్‌కు యూరప్ దేశాల భాగస్వామ్యం పెంపుకోసం బెదిరింపులకు ఒడిగట్టటం, ఏకపక్షంగా సుంకాల పెంపు వంటి చర్యల ద్వారా యూరప్ ఆత్మగౌరవంతో ఆడుకున్నాడు. వెనిజులా, తాజాగా ఇరాన్‌పై ట్రంప్ ఒంటెత్తు పోకడతో విభేదిస్తున్న యూరప్ రాజ్యాలు మితవాదుల పాలనలో ఉన్నప్పటికీ, ట్రంప్ యుద్ధోన్మాదంతో ఏకీభవించటం లేదు. భద్రతామండలిలో శాశ్వత సభ్యులైన రష్యా, చైనాలు ఇరాన్ సార్వభౌమత్వాన్ని ట్రంప్ ఉల్లంఘించిన తీరును ఖండించాయి. ఖమేనీ హత్యను నిరసించాయి. యుద్ధం విరమించి ఇప్పటికైనా చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని విజ్ఞప్తి చేశాయి. భారత్ ప్రభు త్వం ఇంత పెద్ద పరిణామంపట్ల నోరు మెదపకుండా తన ప్రతిష్ట దిగజార్చుకుంది. గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశం రప్పించటం, భారతీయ కార్మికులకు భద్రత కల్పించాలని గల్ఫ్ దేశాల అధినేతలతో ప్రధాని నరేంద్రమోదీ సంభాషించటం మానవతా దృక్పథం అవుతుంది. కాని రాజనీతిజ్ఞత మృగ్యం. ఇదిలావుండగా, యుద్ధం విస్తరిస్తున్నది, తీవ్రమవుతున్నది. దాంతోపాటు గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో సంధానించే కీలకమైన చిన్న జలమార్గం హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంతో ఆయిలు, ఇతర కీలకమైన సరుకు రవాణా ఓడలు సముద్ర జలాల్లో నిలిచిపోవటంతో గల్ఫ్ సంక్షోభం ప్రపంచ సంక్షోభంగా మారే ప్రమాదం తలెత్తింది. ఈ జలసంధి వర్ధమాన దేశాలకే అత్యంత ప్రధానం అయినందున గల్ఫ్ యుద్ధ భారం ఆ దేశాల నెత్తికి బదిలీకానుంది. క్రూడ్ ఆయిలు ధర పెరుగుతోంది. దాంతో ఆయా దేశాల్లో ద్రవ్యోల్బణం పెరుగుతుంది, ధరలు పెరుగుతాయి, ముడిపదార్థాల కొరతతో ఉత్పత్తి సంక్షోభం తలెత్తవచ్చు. మరోవైపున మారకద్రవ్య విలువ తరుగుతూ మన ఎగుమతి సరుకుల విలువ పతనమవుతున్నది. అంతేగాక గల్ఫ్ దేశాల్లో కనీసం కోటిమంది భారతీయులు వలస కార్మికులుగా పనిచేస్తున్నారు. వారు బాంబు ప్రేలుళ్ల శబ్దాల మధ్య అక్కడ బిక్కుబిక్కుమంటూ బతుకుతుంటే ఇక్కడ వారి కుటుంబసభ్యులు భయకంపితులై రోజులు వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితి ఎక్కువరోజులు కొనసాగితే అక్కడివారు పంపే డబ్బు అందక ఇక్కడ కుటుంబాలు కటకటపడవచ్చు. మరోవైపున, ఆసియానుంచి అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు ట్రాన్సిట్ పాయింటుగా గల్ఫ్ ఉన్నందున విమాన, పర్యాటక రంగాలు సంక్షోభంలో పడ్డాయి. అందువల్ల ఈ యుద్ధం ఎంత త్వరగా ముగిస్తే ప్రపంచదేశాలకు అంతమేలు. అయితే తాడోపేడో తేల్చుకోవాలని ప్రత్యర్థులు కోరుకోవటం, వారిని నిరోధించే నైతిక శక్తిగల అంతర్జాతీయ వ్యక్తులు, సంస్థలు నిర్వీర్యం కావటం నేటి దుస్థితి. ●



## మా పార్టీ యుద్ధానికి అనుకూలం కాదు

**మా పార్టీ యుద్ధానికి అనుకూలం కాదు. ప్రస్తుతం ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతున్నాయి, ఆ యుద్ధాలు ఆగకుండా కొనసాగుతున్నాయి. ఈ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశం ఒకటి మరో దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లింది. ఎవరికి కూడా ఇలాంటి పరిస్థితి రాకూడదు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం భారత ప్రజలపై కూడా ప్రభావం చూపుతుంది. సమాజ్‌వాది పార్టీ ఎన్నడూ యుద్ధాలకు అనుకూలం కాదు.**

- సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్



## ప్రపంచ చమురు సరఫరాకు 'గొంతు' హార్మోజ్

హార్ముజ్ సముద్ర సందు ప్రపంచంలో అతి ముఖ్యమైన జలమార్గాల్లో ఒకటి. ఇరాన్ ఉత్తర భాగంలో, ఒమన్ దక్షిణ భాగంలో ఉంది. పర్షియా గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలిపే ఇరుకైన మార్గం. అత్యంత ఇరుకైన చోట కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంది. ఇది ఒక చిన్న సందు కావడం వల్లే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 'గొంతు' లాంటిది. ఏ చిన్న అడ్డంకి వచ్చినా ప్రపంచ చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇప్పుడు జరుగుతున్న అమెరికా, ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ మార్చి 2న ఈ సందును మూసివేస్తున్నామని ప్రకటించింది. ఏ ఓడా ఈ సందు నుండి వెళ్లినా దాడి చేస్తామని హెచ్చరించింది. ఫలితం? వాణిజ్య ఓడలు ఆగిపోయాయి. పెద్ద షిప్పింగ్ కంపెనీలు రవాణా ఆపేశాయి. ట్యాంకర్లు దాదాపు జీరోకి తగ్గాయి. కొన్ని ట్యాంకర్లపై దాడులు జరిగి 5కి పైగా ఓడలు దెబ్బతిన్నాయి. 150కి పైగా ఓడలు ఆగిపోయాయి. సందు వాస్తవంగా మూసివేయబడింది. ప్రతి రోజూ సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు, ఇతర ఇంధనాలు ఈ సందు గుండా ప్రపంచానికి వెళ్తాయి. ఇది ప్రపంచ మొత్తం నూనె వినియోగంలో సుమారు 20 శాతానికి సమానం. సముద్ర మార్గంలో వచ్చే చమురులో 25–30 శాతం ఇక్కడి నుంచే వస్తుంది. ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో కూడా సుమారు 20 శాతం ఈ మార్గం గుండా వెళ్తుంది. గల్ఫ్ దేశాలు – సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్, ఇరాన్ – వీటి నూనె ఎగుమతులు దాదాపు అన్నీ ఇక్కడి గుండానే వెళ్తాయి. ఆసియా దేశాలు ఎక్కువగా ఆధారపడతాయి. చైనా అత్యధికం, ఆ తర్వాత భారత్, జపాన్, దక్షిణ కొరియా. ఈ సందు ద్వారా వెళ్లే నూనెలో 84 శాతం ఆసియాకు వెళ్తుంది. ఇరాన్ ఉత్తరభాగాన్ని నియంత్రిస్తుంది కాబట్టి దాడిచేసి లేదా హెచ్చరించి సందును నియంత్రించగలదు. ఇది ఇరాన్‌కు పెద్ద వ్యూహాత్మక ఆయుధం. గతంలో కూడా ఇరాన్ ఇలాంటి హెచ్చరికలు చేసింది. కానీ ఈసారి వాస్తవంగా అమలు చేసింది. దీనివల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కు తీవ్రమైన దెబ్బ తగులుతోంది. చమురు ధరలు ఇప్పటికే 7 నుంచి 13 శాతం పెరిగాయి. $100కి చేరే అవకాశం ఉంది.

**భారత్‌కు ఎంత ప్రమాదం?**

మన దేశం 85–90 శాతం నూనె విదేశాల నుంచి తీసుకుంటుంది. అందులో సగం కంటే ఎక్కువ (సుమారు 50 శాతం) ఈ సందు గుండా వస్తుంది – రోజుకు 1.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెల్స్. ఇరాక్, సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్ నుంచి వచ్చే నూనె దాదాపు అన్నీ ఇక్కడి గుండానే. దీంతోపాటు వంట గ్యాస్ (ఎల్పిజి)లో 85 శాతం, ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో 55 శాతం ఈ మార్గం గుండా వస్తాయి. సందు మూసివేత కొనసాగితే మన నూనె స్టాక్ కేవలం 40 – 45 రోజులకు సరిపోతుంది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు భారంగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల జీవన ఖర్చు ఎక్కువవుతుంది. రూపాయి విలువ తగ్గుతుంది. వాణిజ్యలోటు పెరుగుతుంది. ఇది కేవలం నూనె సమస్య కాదు. ఎగుమతులు ఆలస్యమవుతాయి. షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. గల్ఫ్‌లో పనిచేసే 90 లక్షల మంది మనవాళ్ల భద్రత, సంపాదన ప్రమాదంలో పడతాయి. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై భారీ ఒత్తిడి పడుతుంది.

ఇరాన్‌కు ఇది ఏకైక ఆయుధం. అణు శక్తి, సైనిక బలం తక్కువైనా ఈ సందుతో ప్రపంచాన్ని బెదిరించగలదు. అమెరికా నావల్ ఫోర్సెస్ ట్యాంకర్లను రక్షించడానికి సిద్ధమవుతున్నాయి కానీ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఇలాంటి చోక్‌పాయింట్లు (ఇరుకైన మార్గాలు) ఎంత బలహీనమైన దేశానికైనా పెద్ద శక్తిని ఇస్తాయని ఇది నిరూపిస్తోంది.

**భారత్ ఏం చేయాలి? :** తక్షణం రష్యా నుంచి చమురు ఎక్కువ తీసుకోవడం ఒక ప్రత్యామ్నాయం. మన వ్యూహాత్మక చమురు నిల్వలను (SPR) ఉపయోగించాలి. దీర్ఘకాలంలో నూనె దిగుమతులను వైవిధ్యపరచాలి. సౌర శక్తి, గాలి శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ఇరాన్ యుద్ధం మనకు ఒక పెద్ద హెచ్చరిక – ఎనర్జీ భద్రతను స్వయం సమృద్ధిగా మార్చుకోవాలి. హార్ముజ్ సముద్ర సందు మూసివేత ప్రపంచానికి పెద్ద సంక్షోభం తెచ్చింది. భారత్ వంటి దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. ఇరాన్ యుద్ధం విస్తరిస్తే మూడో ప్రపంచ యుద్ధం అంచుకు వచ్చే ప్రమాదం ఉంది. ఐక్యరాజ్యసమితి ద్వారా తక్షణం సంభాషణలు జరిపి యుద్ధాన్ని ఆపాలి. సందు తెరవాలి. యుద్ధం కొనసాగితే ఎవరికీ లాభం లేదు – ప్రపంచమంతా నష్టపోతుంది. శాంతి, సంభాషణలు, దౌత్యం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించాలి. భారత్ ఈ విషయంలో నాయకత్వం వహించాలి!

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, 9010128884

## ఏకధ్రువ పశ్చిమాసియా నిర్మాణం కోసం

# ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం

**స్టాన్‌లీ జానీ**

అమెరికా, ఇరాన్ మధ్య చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్ విదేశాంగమంత్రి బదర్ బిన్ హమద్ అల్ బుసైదీ, ఒప్పందం చేరువలోకి వచ్చిందని నవంబర్ 27న ఒక అమెరికన్ ఛానల్‌కు చెప్పారు. ఇరాన్ తాము "ఎన్నటికీ" అణుబాంబు తయారు చేయబోమని, అణుశక్తి పదార్థాలను నిల్వచేయబోమని హామీ ఇచ్చిందని ఆయన చెప్పారు. ఆ మరునాడే అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై బాంబుదాడులకు ఒడిగట్టాయి; ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ, డజన్ల మంది ఇరానియన్ సీనియర్ అధికారులు హతులైనారు. ఇరాన్ నుంచి "తమ అస్థిత్వానికి ఉన్న ప్రమాదాన్ని తొలగించుకునేందుకు" ఈ ముందస్తు బాంబుదాడులు ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. కాగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ "మీ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోండి" అని ఇరానియన్‌లకు పిలుపు ఇచ్చారు. ఇది బహుశా "అనేక తరాల్లో మీకు లభిస్తున్న అవకాశం" అని కూడా ఆయన అన్నారు. నాయకులను హతమార్చిన తొలి దాడుల నుంచి, ట్రంప్, నెతన్యాహు వ్యాఖ్యల నుంచి స్పష్టమయ్యేది ఒక్కటే – దండయాత్ర కూటమి ప్రభుత్వం మార్పును కోరుకుంటోంది.

ఇరానియన్ ప్రభుత్వం ఆరంభ దెబ్బనుంచి పునః సంఘటితమైంది, ఎదురుదాడి చేస్తున్నది. ట్రంప్, నెతన్యాహు చర్యలవల్ల పశ్చిమాసియా రెండవ ప్రపంచ యుద్ధానంతరం తొలిసారి అత్యంత వినాశకరమైన క్షణాలను చవిచూస్తున్నది–ఈ యుద్ధం ఫలితం రానున్న అనేక దశాబ్దాలకు ఈ ప్రాంతం భవిష్యత్‌ను నిర్వచిస్తుం ది.

2025 జూన్‌లో 12రోజుల యుద్ధం తర్వాత, ఇరాన్ అణు కార్యక్రమాన్ని తాము "నాశనం చేసినట్లు" అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. "చరిత్రాత్మక విజయం" సాధించినట్లు నెతన్యాహు ప్రకటించాడు. అలాంటప్పుడు, వారు ఎనిమిది మాసాల తర్వాత మరో యుద్ధం ఎందుకు ప్రారంభించినట్లు? ఇరాన్‌లో ప్రభు త్వం మార్పును ఇజ్రాయెల్ ఎల్లప్పుడూ కోరుకుంటోంది. టెల్ అవీవ్ దృష్టిలో, పశ్చిమాసియాలో తమ ఆధిపత్యాన్ని సవాలు చేసే ఏకైక రివిజనిస్టు దేశం ఇరాన్ మాత్రమే. అరబ్ దేశాల్లో అనేకం అమెరికా మిలటరీ స్థావరాల ఏర్పాటును అనుమతించాయి లేదా అమెరికా సహాయంపై ఆధారపడి ఉన్నాయి; ఇజ్రాయెల్‌తో ప్రత్యక్ష సంబం ధం ఏర్పరుచుకున్నాయి లేదా ఇజ్రాయెల్ మిలటరీయిజం తో, పాలస్తీనా, సిరియా, లెబనాన్ భూభాగాలను అది ఆక్రమించుకోవటాన్ని ఆమోదించి జీవిస్తున్నాయి. అయితే 9కోట్ల జనాభా, అపారమైన ఆర్థిక సంపత్తి, అధునాతన మిస్సిలీ కార్యక్రమం కలిగివున్న ఇరాన్‌ను తన అస్థిత్వానికి ప్రమాదకారిగా ఇజ్రాయెల్ చూస్తున్నది.

2015లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇరాన్‌తో అణు ఒప్పందం సంతకం చేసినపుడు ఆయన దృష్టి ప్రధానంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అదుపు చేయటంపై ఉంది. అణ్వస్త్రరహిత ఇరాన్ పశ్చిమాసియాకు శుభవార్త అవుతుందని ఆయన భావించాడు. ఇజ్రాయెల్ దాని ప్రత్యర్థులమధ్య "ప్రచ్ఛన్న శాంతి"ని అభిలషించాడు. అయితే ఇజ్రాయెల్ అవగాహన వేరుగా ఉంది. ఇరాన్ అణు కార్యక్రమమే దాని సమస్యకాదు, దాని సాంప్రదాయక సైనిక శక్తి దానికి ఆందోళన కలిగిస్తోంది. అందువల్లనే నెతన్యాహు 2015 అణు ఒప్పందాన్ని శాయశక్తులా వ్యతిరేకించాడు.

**ఇరాన్ భౌగోళిక రాజకీయాలు**

ఇటీవలకాలంలో, అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరిగినపుడు, ఇరాన్ మిస్సిలీ కార్యక్రమాన్ని, ఈ ప్రాంతంలో అధికారయేతర మిలీషియాలకు దాని మద్దతును ఒప్పందంలో చేర్చాలని ఇజ్రాయెల్ పదేపదే కోరింది. ఇరాన్ పూర్తిగా నిరాయుధం కావాలని నెతన్యాహు కోరుకున్నాడు – ఈ డిమాండ్‌ను ఇరానియన్ నాయకుడెవ్వరూ – టెహరాన్‌లో నెతన్యాహు ప్రతిష్టించే తొత్తు తప్ప – అంగీకరించబోరు. టెహరాన్ కేంద్రంగా పనిచేసే భద్రతా విషయాల విశ్లేషకుడొకరు ఫిబ్రవరి 24న 'ది హిందూ'తో మాట్లాడుతూ విస్పష్టంగా ఒక విషయం చెప్పారు – ఇరాన్ తన అణు కార్యక్రమంపై అమెరికా తో ఒప్పందంపై సంతకం చేయబోదు. "అమెరికాతో యుద్ధం నివారించేందుకు ఇరాన్ ఇవాళ తన బాలిస్టిక్ మిస్సిలీలను సరెండర్ చేసేందుకు అంగీకరిస్తే, ఇజ్రాయెల్ కొద్దినెలల్లో మాపై బాంబులు వేస్తుంది" అని ఆయన చెప్పారు. అందువల్ల, తమకున్న చివరి ఆత్మ రక్షణ ఆయుధాన్ని ఎందుకు విడనాడాలని ఇరానియన్‌లు తమను తాము ప్రశ్నించుకుంటున్నారు.

ఇజ్రాయెల్ తన ధ్యేయాలన్నిటినీ నెరవేర్చుకోవాలంటే దాని ముందున్న ఏకైక మార్గం ఇరాన్‌లో ప్రభుత్వం మార్చివేయటమే. ప్రభుత్వం మార్పుచేయటం భౌగోళిక రాజకీయాలకు కూడా లాభం చేకూర్చుతుంది. సద్దాం హుస్సేన్ ఇరాక్ అదృశ్యమైంది. గఢాఫీ లిబియా వెళ్లిపోయింది. సిరియా అధినేత బషర్–అల్–అస్సాద్ మాస్కోలో ఆశ్రయం పొందగా, మాజీ జిహాదీవాది దమాస్కస్ నడు



పుతున్నాడు. హిజ్‌బొల్లా బలహీనపడింది. హమస్ గాజా శిథిలాలలోకి నెట్టివేయబడింది. అరబ్ రాజ్యాలు ఖండన ప్రకటనలు చేయటం తప్ప మరేమీ చేయవు. ఎదురు నిలబడుతున్న చివరి రివిజనిస్టు ప్రభుత్వం ఇరాన్ ఒక్కటే. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూల్చివేసినట్లయితే ఆ ప్రాంతంలో బలాబలాల సమతూకం మారుతుంది. ఏకధ్రువ పశ్చిమాసియాకోసం రంగం సిద్ధమవుతుంది. ఇజ్రాయెల్ అమెరికా సంపూర్ణ మద్దతుతో దానికి కేంద్రంగా ఉంటుంది. ఇది ప్రధానంగా భౌగోళిక రాజకీయాలకు, ఇజ్రాయెల్ స్వప్రయోజనాలకు సంబంధించింది తప్ప ఇరానియన్‌లకు స్వేచ్ఛ ఇవ్వటానికి సంబంధించింది కానేకాదు.

**తలలు నరికే వ్యూహం**

అయితే ఒక సమస్య ఉంది. ఇరాన్ చుట్టూ ఎత్తైన పర్వతాల వలయం ఉంది. అది భౌగోళికంగా పెట్టని కోట. ఇరాన్ ఇజ్రాయెల్ కన్నా 70 రెట్లు పెద్ద దేశం. ఇజ్రాయెల్ ఒంటరిగా ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చలేదు. సాధారణంగా, భూతల దురాక్రమణ ద్వారా ప్రభుత్వాల మార్పు సాధిస్తుంటారు – అయినా అదేమీ గ్యారంటీ కాదు. ఇజ్రాయెల్ – మధ్యధరా సముద్రం మధ్య నున్న చిన్న భూ ఖండం గాజాను ఇజ్రాయెల్ 24 మాసాలుగా పిండిచేస్తున్నది, కనీసం 70 వేల మందిని చంపింది. అయినా ఇప్పటివరకూ హమస్ అధికారాన్ని కూల్చివేయలేకపోయింది. ఇరాన్‌కు కాల్బలాన్ని పంపాలని అమెరికా సహా ఏ దేశమూ కోరుకోదు. ఇరాకీ తరహా భూతల దండయాత్ర సాధ్యపడకపోతే, లిబియా లేదా సిరియా మార్గాలు ఇతర ప్రత్యామ్నాయాలు. అయితే లిబియా, సిరియాల్లో అక్కడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సాయుధ ప్రతిపక్షం ఉంది. అది భూమి మీద పోరాటం జరిపింది. లిబియాలో గఢాఫీ ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి నాటో కూటమి అనేక నెలలపాటు బాంబులు వేసింది. సిరియాలో 2012లో వినాశకరమైన అంతర్యుద్ధం ప్రారం భం కాగా, అస్సాద్ ప్రభుత్వం పడిపోవటానికి 12సంవత్సరాలు అవసరమైంది. ఇరాన్‌లో సంఘటిత సాయుధ ప్రతిపక్షం లేదు. అందువల్ల ఇజ్రాయెల్ 2025 జూన్‌లో, 2026 ఫిబ్రవరిలో ఇరాన్‌లో ప్రయత్నించింది ఏమిటంటే తలలు నరికే దాడులు – ప్రభుత్వం తట్టుకుని నిలబడి ఎదురుదాడులు చేయలేనంత భారీగా బాంబు దాడులు చేయటం.

2025 జూన్‌లో ఇరానియన్‌లు ప్రారంభ దిగ్భ్రాంతి నుంచి శీఘ్రంగా కోలుకుని, ఎదురుదాడి ప్రారంభించారు. నెతన్యాహు ఇలా అన్నారు – ప్రభుత్వం మార్పు యుద్ధం నుంచి ఆశించదగిన ఫలితం. కాని ఆయన అమెరికన్ సహాయం అర్థించాడు, 12రోజుల తర్వాత యుద్ధ విరమణ అంగీకరించారు. 2026 ఫిబ్రవరిలో, మరింత సుముఖంగా ఉన్న అమెరికా అండతో, ఇజ్రాయెల్ మరింత విస్తృతమైన, మరింత బరితెగించిన దాడులకు పాల్పడింది – ఖమేనీని చంపింది. ట్రంప్, నెతన్యాహు సత్వరం, నిర్ణయాత్మక విజయం కాంక్షించారు. అయితే "విప్లవం నాయకుణ్ణి హత్య చేస్తే జనాలు గుంపులుగా వీధుల్లోకి వస్తారు. ప్రభుత్వాన్ని కూల్చివేస్తూ సంస్థలను స్వాధీనం చేసుకుంటారని" వారు భావించి ఉంటే అది సంభవం కాలేదు. ఇప్పటికి కూడా ఇరాన్ ఈ స్థితికి సిద్ధంగా ఉన్నట్లుంది. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికన్ సైనిక స్థావరాలపైన, ఇజ్రాయెల్‌పైన ఎదురుదాడి చేస్తున్నది, యుద్ధం విస్తృతమవుతున్నది.

**ప్రాంతీయ యుద్ధం**

2025 జూన్‌లో ఇరాన్ ప్రతిస్పందన ప్రధానంగా ఇజ్రాయెల్‌పై కేంద్రీకరించింది. తన అణువసతులపై అమెరికన్ దాడి దరిమిలా కటార్‌లోని అమెరికా సైనికస్థావరంపై లాంఛనంగా దాడిచేసింది. ఆ తర్వాత పోరాట విరమణ అంగీకరించింది. అయితే ఈసారి ఇరాన్ పర్షియన్ జలసంధి రాచరిక రాజ్యాలలోని అమెరికన్ సైనిక స్థావరాలపైన, ఇజ్రాయెల్‌పైన దాడిని ఎక్కుపెట్టింది. ఇరానియన్ మిస్సిలీలు సైప్రస్‌లోని ఒక యుకె సైనిక స్థావరంపైన, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఫ్రెంచి స్థావరంపైన దాడిచేశాయి. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే ఇరుకు జలమార్గం హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ప్రపంచంలో ఆయిలు రవాణాలో మూడవ వంతు ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఇది చాలా ఇబ్బందికరమైన జూదం. ఇరాన్ రెండు రోజుల్లో యుద్ధాన్ని ప్రాంతీయం చేసింది. ఇది సంపూర్ణ యుద్ధం. ట్రంప్ ఇరాన్ విధాన విమర్శకులందరూ దీనిగూర్చి ముందే హెచ్చరించారు. వాషింగ్టన్‌లోని యుద్ధ సమర్థకులు ఇరాన్ బుకాయిస్తున్నదని అంటున్నారు. అయితే అది నిజం కాదు.గల్ఫ్ రాచరిక రాజ్యాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ఇరాన్ దాడులు (కొన్ని మరీ తీవ్రంగా ఉన్నా యి) కొనసాగిస్తే ఈ దేశాలు యుద్ధంలో చేరాల్సివస్తుంది. అవి ఆ పనిచేస్తే, క్రాస్ గల్ఫ్ సంఘర్షణతో ఇంధన వాణిజ్యానికి వినాశకర పర్యవసానాలుంటాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థ తీవ్రమైన ఇబ్బందు ల్లో పడుతుంది. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే ఈ సైనిక స్థావరాలను, ఆ ప్రాంతంలోని ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులను ప్రస్తుతం కాపాడుతున్న మిస్సిలీ రక్షణ కవచాలు నిర్వీర్యమవుతాయి. అంటే ఇరుపక్షాలనూ సమయం తరుముతున్నది. ఇరాన్ రాజ్యం తమ దాడులు తట్టుకుని నిలువగలిగే స్థితికి ట్రంప్ సిద్ధంగా ఉన్నారు. ఇరాన్ సైనిక శక్తిని దెబ్బతీయటానికై దాని బాలిస్టిక్ మిస్సిలీల నిల్వలను, దాని లాంచర్స్‌ను ధ్వంసం చేయటానికి అమెరికా, ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నాయి. అయితే ఇరాన్ గనుక తన బాంబుదాడుల సామర్థ్యాన్ని నిలుపుకుని, యుద్ధాన్ని విస్తరించటం కొనసాగిస్తే ట్రంప్‌పై ఒత్తిడి తీవ్రమవుతుంది. అమెరికా, ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ సాంప్రదాయ సిద్ధ సైనికశక్తి మధ్య కచ్చితంగా పెద్ద వ్యత్యాసం ఉంది. అయితే విజయం స్పష్టంగా నిర్వచించిన, సాధించసాధ్యమైన ధ్యేయాలపై ఆధారపడి ఉంటుంది గాని, సాంప్రదాయ సిద్ధ సైనిక ఆధిక్యత విజయానికి గ్యారంటీ కాదు. ట్రంప్ శీఘ్రంగా, నిర్ణయాత్మకమైన విజయాన్ని కోరుకుంటున్నట్లే, కచ్చితంగా దాన్ని నిరాకరించేవిధంగా ఇరాన్ సైనిక సిద్ధాంతం నిర్మితమైంది. ట్రంప్ గొరిల్లాను చంపాలనుకుంటున్నాడు, ఒకవేళ గొరిల్లా గెలిచినా, హెన్రీ కీసింగర్ అంగీకరించినట్లు, తాను ఓడిపోకూడదు. *('ది హిందూ' సౌజన్యంతో)*

## 3వ ప్రపంచ యుద్ధం తప్పదా!

### అపహాస్యమవుతున్న అంతర్జాతీయ నిరాయుధీకరణ

ఐరాస ప్రేక్షకపాత్రను వహిస్తోంది. ఇరాన్‌పై రెండు దేశాల దాడి విషయంలో అమెరికన్ ట్రంప్, ఇజ్రాయెల్, నేతన్యాహూ ద్వయాన్ని ఒప్పించగల మధ్యవర్తిత్వం చేసే దేశాలు కరువైనాయి. నిరాయుధీకరణ నిత్య మంత్రం కావాలని ఐరాస బోధించడం మినహా చేసేది ఏమీ కనిపించడం లేదు. ఆయుధాలు, యుద్ధ వ్యాప్తి నిరోధక చర్యలు సాకారం కావాలని ఆకాంక్షిస్తున్న ఐరాస నేటి ఇజ్రాయిల్, అమెరికా సైనిక దాడులను ఆపమని ఒక్క మాట కూడా అనలేని నిస్సహాయ దుస్థితిలో ఉన్నది. ప్రపంచ శాంతి నెలకొనాలనే సదుద్దేశంతో 2022 నుంచి ఐరాస ప్రతి ఏట అంతర్జాతీయ నిరాయుధీకరణ, వ్యాప్తి నిరోధక అవగాహన దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ డిస్‌ఆర్మమెంట్ అండ్ నాన్‌ప్రొలిఫరేషన్ అవేర్‌నెస్) పాటించడం జరుగుతుంది. అణ్వాయుధాలు, రసాయన, జీవాయుధాల వల్ల కలిగే అపార నష్టాలను అవగాహన పరుస్తూ నిరాయుధీకరణ సూత్రాలను వ్యాప్తి చేస్తున్నది. సామూహిక వినాశన ఆయుధాల వ్యాప్తిని కట్టడి చేయడం ద్వారా అంతర్జాతీయ భద్రత, మానవాళి రక్షణ, శాంతి నెలకొంటాయని ప్రచా రం నిర్వహిస్తున్నారు.

**మధ్య ప్రాచ్యంలో మంటలు :** 24 ఫిబ్రవరి 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్ రష్యా యుద్ధం గత నాలుగేళ్లుగా కొనసాగుతోంది. అదే విధంగా 07 అక్టోబర్ 2023 నుంచి పాలస్తీనాకు చెందిన గాజాపై ఇజ్రాయిల్ దాడికి అంతం కనిపించడం లేదు. నేడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరి కా మరో యుద్ధం కొనసాగిస్తూ మెసైల్స్ వర్షంతో మధ్య ప్రాచ్యం మంటల్లో భగ్గుమంటోంది. గల్ఫ్ దేశాల ఆకాశం బాంబు పేలుళ్లతో నల్లటి కారుమబ్బులతో నిండి ఉన్నది. నగరాలు, సైనిక స్థావరాలు, చమురు శుద్ధి కేంద్రాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా భీకర బాంబుల దాడితో ప్రపంచ శాంతి గాల్లో దీపమైంది. 3వ ప్రపంచ యుద్ధం రానుందా అనే వాదనలు బలపడుతున్నాయి. పిల్లిని గదిలో బంధించి కొడితే గత్యంతరం లేక తెగబడి ఎదురు తిరుగుతుందనే విషయం మనకు తెలుసు. నేడు ఇరాన్ పరిస్థితి కూడా అలాగే ఉన్నది.

ఇరాన్ అణు కార్యక్రమం మింగుడుపడని ఇజ్రాయిల్, అమెరికాలు సంయుక్తంగా భీకర సైనిక దాడులు చేసి ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని మట్టుపెట్టడం తోపాటు ఖమేనీ సమీప బంధువులు/కుటుంబ సభ్యులు, అగ్ర నేతలు, ఉన్నత సైనిక అధికారులు, సహాయకులను కలుపుకొని ఇప్పటికి 800లకు పైగా నిండు ప్రాణాలను కోల్పోయారు. 1989నుంచి నిన్నటి వరకు ఇరాన్ సుప్రీమ్ నాయకుడిగా మూడున్నర దశాబ్దాలకు పైగా తిరుగులేని నాయకుడిగా శాసించడం చూసాం. ఇరాన్‌లో పార్లమెంట్, న్యాయవ్యవస్థ, పోలీస్ విభాగం, మీడి యా, మతపరమైన వర్గాలను తన అదుపులో ఉంచుకొని ప్రత్యర్థులను అక్రమంగా అరెస్టులు చేయడం, మానవ హక్కులను హననం చేయడం, మహిళా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం, వ్యతిరేక ఉద్యమాలను అణచివేయడం తీవ్ర స్థాయిలో జరిగి పోయిం ది.

**భారత్‌పై యుద్ధ ప్రభావం:** భారతదేశ చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతుల మీదనే ఆధారపడి ఉన్నది. హార్మోజ్ జల సంధి మూసి వేయడంతో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లకు చేరిందని, రానున్న రోజుల్లో మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

దీనితో పాటు గ్యాస్, ఖనిజా లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, బంగారం, వెండి, వ్యవసాయ పరికరాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, సబ్బు లు, తలనూనె, ఎరువులు, బిస్కెట్లు, షాంపులు లాంటి అనేక నిత్యావసర సరుకుల దిగుమతులు భారమై, రవాణా దూరమై ధరలు పెరగనున్నాయి. ఈ జలసంధిని మూసివేయడంతో 13 దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు భారమై పోతున్నాయి. భారత్ రోజుకు వినియోగించే 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురులో దాదాపు 2 మిలియన్ బ్యారెళ్లు ఈ జలసంధి నుంచి మాత్రమే సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉండగా, మరో 25 రోజులకు సరిపడా చమురు రవాణా మార్గంలో ఉన్నట్లు భారత ప్రభుత్వం వెల్లడిస్తున్నది.

మధుసూదన రెడ్డి

## హోలీ వేడుకల్లో మాజీ మంత్రులు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్/చార్మినార్/కంటోన్మెంట్:** గ్రహణం కారణంగా బుధవారం కూడా గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో హోలీ ఉత్సాహంగా జరుపుకున్నారు. యూత్, కాలేజీ స్టూడెంట్స్, గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున కలర్ సెలబ్రేషన్స్ చేశారు. ఈ క్రమంలోనే చార్మినార్, గుల్జార్‌హౌజ్, పురానాపూల్, లాల్‌దర్వాజా, ఖైరతాబాద్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ తదితర ప్రాంతాల్లో యువత రంగులు చల్లి, డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఇక గేటెడ్ కమ్యూనిటీల్లో డీజేల హోరులో హోలీ పార్టీలు జరిగాయి. పలు ఫామ్ హౌసులు, రిసార్టుల్లో స్పెషల్ హోలీ ఈవెంట్స్ నిర్వహించారు.

## అపోలో డయాగ్నోస్టిక్స్ టాక్స్ సేవర్

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను ఫైలింగ్ సందడి సమీపిస్తున్న తరుణంలో అపోలో డయాగ్నోస్టిక్స్ అద్భుతమైన అవకాశాన్ని ముందుకు తెచ్చింది. ఆర్థిక ప్రణాళికను ఆరోగ్య రక్షణతో ముడిపెడుతూ ప్రత్యేకంగా 'టాక్స్ సేవర్' హెల్త్ ప్యాకేజీని ప్రారంభించింది. ఈ సందర్భంగా అపోలో డయాగ్నోస్టిక్స్ నేషనల్ టెక్నికల్ హెడ్, చీఫ్ పాథాలజిస్ట్ డాక్టర్ రాజేష్ బెంద్రే మాట్లాడుతూ రూ.4,250 విలువైన 75 రకాల పరీక్షలను కేవలం రూ.2,500 అందించడమే కాకుండా, ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80డీ కింద రూ.5,000 వరకు పన్ను మినహాయింపు పొందే వెసులుబాటును ఈ ప్యాకేజీ కల్పిస్తోందన్నారు.

## జలమండలి ఉద్యోగుల పదవీ విరమణ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** జలమండలిలో 13 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడం జరిగింది.ఈ మేరకు బుధవారం ఖైరతాబాద్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది వారికి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సీజీఎం(పీ అండ్ ఏ) సురేష్, జీఎం సరస్వతి, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సినీ డైరెక్టర్ కుమారుడు అరెస్ట్

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ట్రాఫిక్ హోంగార్డు మనంపై దాడి చేసిన ఘటనలో సిటీ డైరెక్టర్ మణిశంకర్ కుమారుడు ప్రేమ శంకర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. కారును రోడ్డుపై ప్రేమ శంకర్ ఆపడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో అక్కడకు వచ్చిన హోంగార్డుపై ప్రేమశంకర్ ఆగ్రహంతో దాడి చేయడం జరిగింది. ఈ క్రమంలో ప్రేమ శంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎస్ఐపై సస్పెన్షన్ వేటు



**ప్రజాపక్షం/ఐఎస్ సదన్:** విధుల్లో నిర్లక్ష్యంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఎస్ సదన్ పో లీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే ఎస్ఐ జీ.వెంకటేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సిపి స జ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐ వెంకటేష్ పై... గణేష్ బందోబస్తు సమావేశానికి డుమ్మాకొట్టడం, ఓ రౌడీ షీటర్ వ్యవహారంలో తప్పుడు నివేదిక ఇవ్వడం, సీఎం రూ ట్ బందోబస్తుకు హాజరుకాకపోవడం, లోక్‌అదాలత్, ఎన్నికల డ్యూటీలకు డుమ్మా కొట్టడం... తదితర ఆరోపణలున్నాయి. టిజిసిఎస్ నియమావళి ప్రకారం సస్పెన్షన్ వేటు వేయడం జరిగింది.

## ముగిసిన వార్షిక పరేడ్



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** నగర సాయుధ బలగమైన స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌పోలీస్ వార్షిక పరేడ్ బుధవారం సీపీఎల్‌లో ముగిసింది. రెండు వారాలుగా జరిగిన వార్షిక సమీకరణ పరేడ్ ముగింపు కార్యక్రమంలో డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కమాండెంట్ వి.త్రిలోక్‌నాథ్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షకు 80682 మంది హాజరు

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్ రెండవ సంవత్సరం గణితం పరీక్షకు 80682 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 217 'పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 85034 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా జనరల్ గణితం పరీక్షకు 77479 మంది, వొకేషనవొకేషనల్ పరీక్షకు 3203 మంది హాజరయ్యారు. జనరల్‌లో 3677 మంది, వొకేషనల్‌లో 675 మంది విద్యార్థులు గైర్హాజరు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న తెలిపారు.

## ఆహార భద్రత పాటించాలి

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** శుచి, శుభ్రత పాటించకుండా నిలువ చేసిన హానికరమైన ఆహార పదార్థాలు విక్రయించే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి హోటళ్లు, స్వీట్ హౌస్ నిర్వాహకులను హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం మధ్యాహ్నం అధికారులతో కలసి సంతోష్‌నగర్ పరిధిలోని హోటళ్లు, స్వీట్ హౌస్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్సులు, కిచెన్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై నిర్వాహలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్క వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఏడాది ట్రేడ్ లైసెన్సు రెన్యూవల్ చేయించుకుంటూ ఆస్తి పన్ను చెల్లించాలన్నారు. హోటల్స్, స్వీట్‌హౌస్ నిర్వాహకులు కిచెన్ శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు. తనిఖీల్లో సంతోష్‌నగర్ డీసీ మంగతాయారు, సూపరింటెండెంట్ నరహరి, గెజిటెడ్ ఫుట్ ఇన్‌స్పెక్టర్ సూర్య, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ రాకేష్ కుమార్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.

# 'ఎల్ఐసిలో కేటుగాళ్లు'




- బతికున్నోళ్లను చంపుతున్న ఘనులు
- అడ్డదారిలో కోట్లు కొల్లగొడుతున్న వైనం
- గత ఏడాదిగా వెలుగులోకి..
- అనేక అమానుష ఘటనలు
- తీగలాగితే మరికొంత డొంక కదిలే అవకాశం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రముఖ జీవిత బీమా సంస్థ ఎల్ఐసిలో కేటుగాళ్లు పెరిగిపోతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు బతికుండగానే చంపేసి వారి పేర్ల మీద బీమా సొమ్ములు కాజేస్తూ కోట్లు గడిస్తూ సంస్థకు నష్టాన్ని తెచ్చి పెడుతున్నారు. గత కొంత కాలంగా బీమా సొమ్మును తప్పుడు మార్గంలో కాజేసేందుకు ప్రయత్నించిన పలు కేసులు వెలుగులోకి వచ్చాయి. అశ్వాపురం మండలానికి చెందిన అలవాల వెంకటేశ్వర్లు, సరస్వతి భార్యభార్తలు ఎల్ఐసి ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. అయితే వీరికి వచ్చిన వక్రబుద్ధికి పదును పెందుతూ అదే మండలంలో 39 మంది పేరిట పాలసీలు కట్టించారు. ఆ సొమ్ములను కూడా కొంత కాలంగా వీరే చెల్లిస్తూ పాలసీని రన్ చేస్తున్నారు. అయితే వారిలో కొందరు బతికుండగా, మరి కొందరు చనిపోయినట్లు తెలుస్తోంది. బతికున్నవారు చనిపోయినట్లుగా, చనిపోయిన వారికి కొత్తగా డెత్ సర్టిఫికెట్లు తీసుకుని క్లెయిమ్ చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాగా ఆ ఇద్దరు ఏజెంట్ల నుండి ఎక్కువ డెత్ క్లెయిమ్‌లు వస్తుండంతో అనుమానం వచ్చిన సంస్థ ఓ కన్నేయడంతో అసలు విషయం బట్టబయలైంది. అప్పటికే వారు రూ.1.52 కోట్లను డెత్‌క్లెయిమ్‌ల రూపంలో తీసుకున్నారు. కాగా ఈ క్లెయిమ్‌ల వ్యవహారంలో బాధితులు ఎవరూ తాము మోసం పోయాం అని గానీ, తమకు తెలియకుండా బ్రతికున్న మమ్మలను చంపేసి బీమా సొమ్ము తీసుకున్నారు అని గానీ, మా వాళ్లు చనిపోతే తప్పుడుపద్ధతుల్లో వెంకటేశ్వర్లు, సరస్వతి అనే ఎల్ఐసి ఏజెంట్ దంపతులు పాలసీలు చేసి, వారే డబ్బులు చెల్లించి చివరకు తప్పుడు ధృవీకరణ పత్రాలు పుట్టించి బీమా సొమ్ము కొట్టేశారని గానీ అటు అశ్వాపురం, ఇటు భద్రాచలం పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం విశేషం.

**ఆరు నెలలుగా సాగుతున్న తంతు :** తప్పుడు క్లెయిమ్‌లు చేసి సొమ్ములు కాజేసిన వ్యవహారం సుమారు ఆరు మాసాల క్రితమే బయటకు వచ్చింది. తప్పుగా చేసిన క్లెయిమ్‌లు తిరిగి సంస్థకు చెల్లించాలంటూ ఏజెంట్లను బ్రాంచ్ మేనేజర్ పదేపదే ఒత్తిడి తెస్తున్నాడు. అయినప్పటికీ వారి వైపు నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో చేసేది లేక ఎట్టకేలకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసు పెట్టగా, పోలీసులు క్రైమ్ 57/2026 నెంబర్ ప్రకారం కేసు కట్టారు.

**పరారీలో దంపతులు :** తప్పుడు పద్ధతుల్లో డెత్ క్లెయిమ్‌లు చేసిన ఎల్ఐసి ఏజెంట్లు దంపతులు వెంకటేశ్వర్లు, సరస్వతి గత కొంతకాలంగా పరారీలో ఉన్నారు. నూటికి నూరు శాతం తప్పుడు పద్ధతుల్లో క్లెయిమ్‌లు చేశారని తేలిపోవడంతో ఎస్ఐసి అధికారులు వారిని పదే పదే డబ్బులు కోసం నిలదీస్తుండటంతో పరారైనట్లు తెలుస్తోంది. గత ఏడాది సైతం ఇలాంటి తప్పుడుక్లెయిమ్‌ల సంఘటన సారపాకలో చోటు చేసుకుంది. అది కూడా బయటకు పొక్కడంతో ఆఖరికి వారికి తిప్పలు తప్పలేదు. ఇదిలా ఉండగా ఇలాంటి సంఘటనలు సంస్థలో మరి కొన్ని ఉండే ఉంటాయని, వాటిపై కూడా ఎల్ఐసి అధికారులు దృష్టి సారించి తీగలాగితే డొంక కదిలే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇలాంటి కుట్ర పూరిత మనస్తత్వం ఉన్న కొందరు ఏజెంట్ల వల్ల నిజాయితీగా పనిచేసే వారికి తీరని మచ్చ వస్తోందని, సంస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే అవకాశం ఉందని పలువురు ఏజెంట్లు వాపోతున్నారు.

**డబ్బుల కక్కుర్తిలో :** కాసుల కక్కుర్తి కోసం అడ్డదార్లు తొక్కుతున్న కేసులు జిల్లాలో అనేకం బయటపడుతున్నాయి. అశ్వాపురం మండలంలో 39 మంది విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా గత ఏడాది సారపాక భాస్కర్ నగర్‌లో బీమా తీసుకున్న వ్యక్తి తన పాలసీకి భార్యనే నామినిగా పెట్టగా, కట్టుకున్న భార్య బతికుండగానే చనిపోయినట్లు తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి రూ.10 లక్షలు స్వాహా చేశాడు. బీమా సొమ్ము వాటాలు వేసుకునే క్రమంలో తేడాలు రాగా విషయం బయటకు పొక్కింది. దీనిపై ఆరా తీసిన ఎల్ఐసి అధికారులు కేసు పెట్టి సంబంధికులను జైలుకు పంపించారు. ఇదిలా ఉండగా తాజాగా స్నేహితులే ఒక యువకున్ని హత్య చేసి అతడి పేరున ఉన్న ఎల్ఐసి పాలసీపై డెత్ క్లెమ్ చేసి రూ.2 కోట్లు కాజేద్దామని ప్రయత్నించారు. సదరు యువకునికి ఎవరూ లేరని విషయాన్ని తెలుకున్న స్నేహితులు అతనిపై వారే బీమా చేసి నామినాగా కూడా ఒక వ్యక్తి వ్యవహరించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం గత నెల 13న చంపేందుకు కుట్ర చేసి తీవ్రంగా గాయపరిచి రోడ్డుపై పడిసే రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. కాగా రోడ్డుపై పడి ఉన్న అతనిని కొందరు చూసి ఆస్పత్రికి తరలించారు. ఇప్పుడు అతను చావుబ్రతుకుల మధ్య ఉన్నాడు. ,తనతో నమ్మకంగా మెలిగిన స్నేహితులే బీమా సొమ్ము రూ.2 కోట్ల కోసం ఇంతటి ఘాతుకానికి పాల్పడినట్లు తేలడంతో వారు కటకటాలు లెక్కిస్తున్నారు.

**మాయమైపోతున్న విలువలు :** ఒకప్పుడు విలువలకు ప్రాధాన్యత ఇచ్చే మనుషులు ఇప్పుడు డబ్బులకు మాత్రమే ఇస్తున్నారు. అక్రమ మార్గంలో సంపాదనే ధ్యేయంగా తల్లిదండ్రులను, తో బుట్టువులను, కట్టుకున్న భార్యని, పదవుల కోసం కన్నవారిని అర్ధాంతరంగా చంపేస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఎంతటి ఘాతుకాలకైనా పాల్పడుతున్నా రు.

# మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెడితేనే సమాజం బాగు

### గైనకాలజిస్టు డాక్టర్ సురేఖ రెడ్డి



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** మహిళలు ముఖ్యంగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని , అప్పుడే కుటుంబం తర్వాత సమాజం బాగుపడుతుందని సూర్యోదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, గైనకాలజిస్టు డాక్టర్ సురేఖ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నారాయణగూడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆర్‌టిఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సురేఖ మాట్లాడుతూ మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకొంటారని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాయి ప్రసాద్ రావు మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ డి. మౌనిక మాట్లాడుతూ కుటుంబంలో మహిళ చదువు ఆ ఇంటికి వెలుగు అని చెప్పారు. ప్రతి ఆడ బిడ్డ చదువుకోవాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు శాలువాతో సన్మానించి, మెమోంటోలు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సౌతిండియా చీఫ్ అడ్వైజర్ అజయ్ కుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.పోచయ్య, మహిళా విభాగ ప్రెసిడెంట్ రోజా రాణి, డాక్టర్స్ ప్రెసిడెంట్ శరత్ కుమార్, జనరల్ సెక్రటరీ వెంకట నరసింహారెడ్డి, కో ఆర్డినేటర్ ఎ.సాయి వెంకట్రావు, నేషనల్ ప్రెసిడెంట్ కామేశ్ గాడి, సౌతిండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

**ప్రజాపక్షం/కార్వాన్:** టాస్క్‌ఫోర్ పోలీసులు కల్తీ నెయ్యి తయారు చేస్తున్న డెన్‌పై దాడి చేసి.. 510 కేజీల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్(గోల్కొండ బృందం), మాసబ్ ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో బంజారాహిల్స్ పరిధిలోని రోడ్ నెం 12, భోలానగర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న ఫ్రైడ్ డెయిరీ కల్తీ నెయ్యి తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి సుమారు రూ.18 లక్షల విలువైన 460 కేజీల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమ నెయ్యితో పాటు భారీ స్థాయిలో కల్తీకి ఉపయోగించే 2,090 కేజీల ఆవు మీగడ, 1,170 కేజీల గేదె మీగడ ఉన్నాయి. అదనపు డీసీపీ(టాస్క్‌ఫోర్స్) అందె శ్రీనివాసరావు పర్యవేక్షణలో, గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్.వెంకటేష్, మాసబ్‌ట్యాంక్ సీఐ ఎ.ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు విజయానంద్, చందన, ఇతర సిబ్బంది కల్తీ నెయ్యి డెన్ గుట్టు రట్టు చేయడం జరిగింది.

## 99 రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

### చార్మినార్ జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** పాతబస్తీలో చేపట్టనున్న 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చార్మినార్ జెడ్ సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహించనున్న ప్రజా పాలనపట్టణ ప్రణాళిక కార్యక్రమంపై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంపై ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, మలేరియా, యూసిడి, ఫుడ్ సేఫ్టీ, ఆస్తిపన్ను విభాగాలకు చెందిన అధికారులు బాధ్యతయుతంగా నిర్వహించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలలో పర్యటిస్తూ సమస్యలు రాకుండా చూడాలన్నారు. రోడ్లపై ఎక్కడ చెత్త పేరుకుపోకుండా వాహనలతో తరలించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. సమావేశంలో చార్మినార్, సంతోష్‌నగర్, ముసారంబాగ్ సర్కిళ్ల డిసిలు సరిత, మంగతాయారు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండా వ్యాఖ్యలతో వేడెక్కిన రాజకీయాలు

- మురళి ప్రకటనతో వరంగల్‌లో దుమారం
- వారసురాలిగా సుస్మిత పటేల్ ప్రకటన



**ప్రజాపక్షం/హనుమకొండ :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ మరోమారు సంచలన రాజకీయాలకు తెరలేపారు. తన కూతురు కొండా సుస్మిత పొలిటికల్ ఎంట్రీపై స్పందించారు. మంగళవారం కొమ్మల జాతరలో చేసిన ప్రకటనతో వరంగల్ జిల్లా రాజకీయం వేడెక్కింది. ఆయన మాటలతో మరోసారి సంచలనం చోటు చేసుకున్నది. పరకాల నియోజకవర్గం కొండా ఫ్యామిలీ అడ్డా. రాబోయే రోజుల్లో తన వారసురాలిగా కొండా సుస్మిత నియోజకవర్గ కార్యకర్తల బాగోగులు చూసుకుంటుంది అంటూ మురళి ప్రకటించారు. పరకాల నియోజకవర్గం నుంచి కొండా కుటుంబం పోటీలో ఉంటుందని స్పష్టం చేశారు. చిట్టెక్క (సుస్మిత) కొండా మురళీ కంటే ధైర్యవంతురాలని ఆమె తిట్టాలంటే ఎవ్వడిని పడితే వాడిని తిడుతది. వీడు వాడని లెక్కలేదు. కార్యకర్తల కోసం ఏదైనా చేస్తది అంటూ కొండా మురళీ ఆవేశంగా ప్రసంగించారు. గీసుగొండ తమ కుటుంబానికి అన్నం పెట్టిన ప్రాంతమని.. కొమ్మాల లక్ష్మీ నరసింహస్వామి, ఇక్కడి జనం దయవల్లే తాను చావు నుంచి బయటపడినట్లు చెప్పిన మురళీ సంచలనం రేపారు.

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి సుస్మిత !**

కొండా దంపతుల ఏకైక కూతురు సుస్మిత పటేల్ రాజకీయ అరంగేట్రం దాదాపుగా ఖరారైనట్టేనా అని పలువురు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలతో కొండా దంపతుల ఏకైక కూతురు సుస్మిత పటేల్ రాజకీయ అరంగేట్రం దాదాపుగా ఖరారైనట్లేననే ప్రచారం జోరందుకుంది. కొంతకాలంగా ఆమె రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో ఉన్న కొండా దంపతులు తన కూతురిని ఎమ్మెల్యేగా బరిలో నిలపాలని ఆలోచన చేశారు. పార్టీ తరపున వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖకు, పరకాల నుంచి కూతురు సుస్మితకు టికెట్ కేటాయించాలని కొండా మురళీ అధిష్ఠానాన్ని కోరారు. ఇందుకు పార్టీ అంగీకరించని కారణంగా బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు కేటీఆర్‌పై పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కొండా సురేఖ ఓటమిపాలయ్యారు. గత ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఫలితంగా కాంగ్రెస్ అధిష్ఠానం ఆమెకు మంత్రి పదవిని కట్టబెట్టింది.

**పరకాలపై ఎప్పటినుంచో కన్ను**

కాగా ఈ క్రమంలో పరకాల నియోజకవర్గంపై కొండా ఫ్యామిలీ ఎప్పటి నుంచో గురి పెట్టింది. నియోజకవర్గంలో సుస్మితను బరిలోకి దించి సత్తా చాటాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే మంత్రి కొండా సురేఖ స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై పలుమార్లు విరుచుకుపడ్డారు. ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకున్నారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో కొండా సురేఖ ఓఎస్డీ పలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని విధుల నుంచి తప్పించారు. ఆ సందర్భంలో ఓఎస్డీని అరెస్ట్ చేసేందుకు మంత్రి ఇంటికి పోలీసులు వెళ్లడంతో అక్కడే ఉన్న సుస్మిత వారిని అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ఈఘటన అప్పట్లో సంచలనం కలిగించింది. ఆ తర్వాత కొండా దంపతులు సీఎంను కలవడంతో వివాదం సమసింది. మళ్లీ ఇన్నాళ్లకు కొండా మురళీ తన కూతురు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించడం కలకలం రేపుతోంది.

## బాల్కసుమన్‌పై కేసుల వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చెన్నూరు, శేరిలింగంపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు అందజేయాలని పోలీసులకు హ:కోర్టు ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికలు సమయంలో కోడ్ ఉల్లంఘించి ధర్నా చేశారని చెన్నూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. రాయదుర్గం వద్ద ప్రభుత్వానికి ఎక్సైజ్ పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళన చేశారని శేరిలింగపల్లి పీఎస్‌లో మరో కేసు నమోదైంది. వీటిని కొట్టేయాలని సుమన్ వేసిన రెండు పిటిషన్లను జస్టిస్ కె.సుజన విచారించి పోలీసులకు, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు. విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.

## పరిహారంపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిమిత్తం సేకరించిన భూమికి పరిహార జీవో వెలువడినప్పటికీ తమకు పరిహారం చెల్లించలేదంటూ నందయ్య ఇతర రైతులు హైకోర్టును ఆశ్రయించారు. శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు పథకం కింద ప్రభుత్వం రూ.58 కోట్లు విడుదల చేసినప్పటికీ పరిహారం ఎందుకు చెల్లించలేదో తెలియజేయాలని ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఇరిగేషన్‌శాఖ ముఖ్యకార్యదర్శి, ఈఎన్‌సీ, శ్రీపాదసాగర్ ప్రాజెక్టు డైరెక్టర్, జగిత్యాల జిల్లా కలెక్టర్‌లకు నోటీసులిచ్చింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

## బాల్య వివాహాల నియంత్రణకు కృషి

- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్యారా లీగల్ వాలంటరీ ఎ.రూపిక

**ప్రజాపక్షం/దామరగిద్ద :** బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్యారా లీగల్ వాలంటరీ రూపిక అన్నారు. నారాయణ పేట్ జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర నారాయణపేట జిల్లా బుధవారం న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బాల్య వివాహాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహానికి చట్టబద్ధమైన వయసు అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. ఈ వయసు రాకముందే పెళ్లి చేసుకోవడం చట్ట విరుద్ధం, సురక్షితం కాదని, ఇది అనేక సమస్యలైన మానసిక, శారీరక ఆరోగ్యం కలలను సాకారం చేసుకోలేకపోవడం, నిరక్షరాస్యత నిరుద్యోగం పెరిగిపోవడం, కేరీర్ అంశాలు తగ్గి పోవడం లాంటి సమస్యలకు దారి తీయవచ్చునని న్యాయ విజ్ఞాన సదస్సులో అన్నారు. మీ గ్రామంలోని పిల్లలు ఎవరైనా చట్టబద్ధ వయసు రాకముందు పెళ్లికి ప్రయత్నిస్తున్నారని మీకు తెలిస్తే దయచేసి గళం విప్పండి మీరు సమాచారం తెలియజేయాలని అనుకుంటే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు ఫోన్ చేయాలన్నారు. మన మందరం కలిసి నారాయణపేటను బాల్య వివాహరహిత జిల్లాగా మార్చగలమన్నారు. అబ్బాయి, అమ్మాయిలు బాగా చదువుకొని పెద్ద కలలు కనే సంతోషంగా, ఆత్మ విశ్వాసంతో జీవించే జిల్లాగా నారాయణపేటను మారుద్దాం అని వారితో చెప్పడం జరిగింది.

## జడ్చర్లలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/జడ్చర్ల :** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఓ కాలనీలో ఇటీవల ఓ కిరాణా సాపు యజమాని మహిళ మెడలోంచి మూడున్నర తులాల బంగారు గొలుసు చోరీ చేసిన అంతరాష్ట్ర దొంగల ముఠాను జడ్చర్ల పోలీస్ అరెస్ట్ చేసినట్టు మహబూబ్ నగర్ డిఎస్పీ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నాడు జడ్చర్ల పోలీసులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలో అంతరాష్ట్ర దొంగల ముఠా ప్రవేశించి దోపిడీలకు పాల్పడుతుందని ఇటీవల జరిగిన మహిళ చోరీ చేసిన బంగారు గొలుసు మేడలో బంగారు గొలుసు రికవరీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మహిళలు జాగ్రత్తగా ఉండాలని మునుముందు ఇలాంటి సంఘటన దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐ కమలాకర్, ఎస్సై మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సమగ్రాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట** : గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సర్పంచులు పంచాయితీరాజ్ చట్టం, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామ పంచాయితీ పనుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందువల్ల ప్రతి ఒక్క సర్పంచ్ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, సాంకేతిక అంశాలపట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, సర్పంచులు పాల్గొన్నారు.

## మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా చర్యలు

### ప్రభుత్వ జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పేర్కొన్నారు. బుధవారం యాదగిరిగుట్టలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును, గదుల్లో కల్పించిన సౌకర్యాలను ఆయన నిశితంగా పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రంలోని సీసీ కెమెరాల పనితీరును, విద్యార్థుల హాజరు శాతాన్ని రికార్డుల ద్వారా తనిఖీ చేశారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కాపీయింగ్‌జరగకుండా ఇన్విజిలేటర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష పూర్తయిన తర్వాత జవాబు పత్రాల రవాణా విషయంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు పట్టివేత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లను బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మద్యాహ్నం ఆలగడప టోల్‌గేట్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు నేరేడుచర్ల వైపు నుంచి మిర్యాలగూడ వైపు అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు వచ్చాయి. అనుమతి పత్రాలు అడిగినప్పుడు వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్ వాహనాల యజమానులు, డ్రైవర్ల మీద కేసులు నమోద చేసి టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా కాల్వపల్లి నుంచి మిర్యాలగూడ వైపు అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లపై, ఓనర్లపై కేసులు నమోదు చేశారు. మిర్యాలగూడ మండల పరిధిలో అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

## రాజేష్ మృతిపై విచారణలో జాప్యం

### బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఉద్యమం ఉధృతం చేస్తాం: మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/నల్లగొండ:** పోలీస్ లాకప్ డెత్‌లో మరణించిన కర్ల రాజేష్ మృతిపై కొనసాగుతున్న విచారణలో అనవసర జాప్యం జరుగుతోందని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి రెండు నెలలు గడిచినా విచారణలో ఎలాంటి స్పష్టమైన పురోగతి కనిపించ డం లేదని ఆయన ఆక్షేపించారు.ఈ నేపథ్యంలో బుధవారం ఆయన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,విచారణాధికారి,డిఎస్పి జి.రవిని కలిసి కేసు పురోగతిపై వివరణ కోరారు.జాతీయ ఎస్సి,ఎస్‌టి కమిషన్ ఒత్తిడి కారణంగానే రీపోస్ట్‌మార్టం నిర్వహించారని,అయితే ఆనివేదిక ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు వెంటనే విచారణను వేగవంతం చేయాలి. ఆలస్యం చేస్తే వదిలేస్తామని అనుకోవడం పొరపాటు అని హెచ్చరించారు. వచ్చే ఆదివారం లోపు పూర్తి స్థాయి విచారణ పూర్తి చేస్తామని ఎస్పి పవార్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పిజిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర నాయకులు మేడి శంకర్,ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునిల్,జిల్లా ప్రధాన కార్యదర్శి తరి ఏడుకొండలు, ఎరసాని గోపాల్, కూరపాటి కమలమ్మ పాల్గొన్నారు.

## ఉచిత డేటా ఎంట్రీ కోర్సుకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మం డలం జలాల్పురం గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో గ్రామీణ యువతీ యువకులకు ఉచిత భోజనం వసతితో డాటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఇంటర్ అర్హతతో అభ్యర్థులు తమ ఒరిజినల్ జిరాక్స్ సర్టిఫికెట్స్ ఆధార్ కుల ధృవీకరణ పత్రం ఫోటోలతో నేరుగా ఈనెల 16వ తేదీన సంస్థలో హాజరుకావాలని సంస్థ డైరెక్టర్ చైర్మన్ కిషోర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908 111, 9133908222, 9948466111 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చు.

# లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### మార్చి 14న మోడల్ హౌసింగ్ కాలనీ సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈనెల 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌజింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఆదర్శ, గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించినట్లు చెప్పారు. అవసరమైతే అదనపు సమయం పనిచేసి అయినా వచ్చే ఒక వారంలో అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను అదేశించారు. హుజూర్‌నగర్ సమీపంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ నిర్మించబడింది. ఇందులో 2160 కుటుంబాలకు సింగిల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టును ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 2014లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. 2023లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టు పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ భూమిని ఎండోమెంట్స్ శాఖ నుంచి పూర్తి మార్కెట్ విలువ చెల్లించి, చట్టబద్ధమైన అన్ని అనుమతులతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని ప్రజలు, సమీప గ్రామాల నివాసితుల కోసం నిర్మించినట్లు, లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలన్నారు. స్థానిక రెవి న్యూ, డివిజనల్ ఆఫీసర్ స్థాయిలో అధికారుల బృందానికి ఈ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. అర్హతలేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని తెలిపారు. మొదటి దశలో కేవలం 1000 మంది లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తున్నామని, అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి సూక్ష్మ ంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవానికి సన్నహాలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను, లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగించేందుకు ప్రత్యేక సభా వేదికను సిద్ధం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ ఎస్‌పి కె.నర్సింహా, హౌజింగ్ పిడి సిద్దార్ధ, అర్టికల్చర్ పిడి నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, జిల్లా డిసిసి అధ్యక్షులు నరసయ్య, తహసిల్దార్ కవిత పాల్గొన్నారు.

## 24 గంటలలోపే సమస్య పరిష్కారం

### హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామంలో ఉదయ సముద్రం ప్రాజెక్టు సంబంధించి డి39 కాలువలో కాంట్రాక్టర్ పూడిక తీసి కాలువ ఎడమ వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లే దారి కి అడ్డంగా చెత్తాచెదారం వేయడంతో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లలేక అవస్థలు పడుతున్న సందర్భంలో 'ప్రజాపక్షం' దినపత్రికలో మంగళవారం 'మా పొలాలకు దారేది' అనే కథనానికి కాంట్రాక్టర్ వెంటనే స్పందించి రైతులు తమ పొలాలకు వెళ్లే దారిలో అడ్డంగా వేసిన జమ్మి చెత్తా చెదారాన్ని బుధవారం 24 గంటలు గడవక ముందే తొలగించి ఆ దారిని క్లియర్ చేయడం జరిగింది రైతులు పేర్కొన్నారు.దీంతో వారి సమస్య తక్షణమే పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.డి 39 కాలువలో పూడికతీత పేరుతో కాంట్రాక్టర్ కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని తీసి తమ పొలాలకు వెళ్లే దారిలో అడ్డంగా వేయడంతో తాము తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈతరుణంలో రైతులందరం కలిసి ప్రజాపక్షం దృష్టికి తీసుకురావడం జరిగిందని దీంతో వారు రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రజా పక్షం దినపత్రికలో ప్రచురించడం జరిగిందని వారు పేర్కొన్నారు.కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెత్తాచెదారాన్ని తీసివేసి రోడ్డు మళ్ళీ యధావిధిగా ఉండే విధంగా చర్యలు చేపట్టినందుకు రైతులు బండ చిన్న పిచ్చిరెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు 'ప్రజాపక్షం' దినపత్రికకు ధన్యవాదాలు తెలియజేశారు.

## రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఆసుపత్రిలోని ఎన్ని విభాగాలు ఉన్నాయని, ఎంత మంది డాక్టర్‌లు ఉన్నారని, ఎంత మంది సిబ్బంది ఉన్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంతమంది ఇన్ పేషెంట్‌గా అడ్మిట్ అవుతున్నారని తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న వార్డులను కలియ తిరిగారు, ఇన్ పేషెంట్‌తో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారా, మంచి ఆహారం పెడుతున్నారా అని ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. గడువు ముగిసిన మందులను చెక్ చేయాలన్నారు. పేషెంట్లకు మందులు ఇచ్చే ముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేయాలి అన్నారు. పేషంట్లకి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు వివిధ రకాల టెస్టులను ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయాలన్నారు. గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు హెల్త్ ప్రొఫైల్ చెక్ చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీజీహెచ్‌లో నిర్మాణంలో అదనపు గదుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. అవసరమైన ఫర్నిచర్ కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ పాండు నాయక్, డాక్టర్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పర్వత్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

### 29వ వర్ధంతి సందర్భంగా పల్లా పర్వత్‌రెడ్డికి సిపిఐ ఘన నివాళి

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ తాలుకా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, మాజీ ఎంఎల్‌ఏ కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి పార్టీ నిర్మాణానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయం లో పర్వత్‌రెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లా దేవరకొండ ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటానికి,కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు ఆకర్షితులై 1951లో కమ్యూనిస్టు పార్టీలో చేరి, చివరి వరకు కొనసాగిన మహనీయులు కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి అని అన్నారు. భూస్వాములు, దొరలు గ్రామాలలో వెట్టి చేయించుకుంటూ భూమి లేని పేదలు, కూలీనాలిలను నానా కష్టాలకు గురి చేయడాన్ని కౌలు శిస్తుల వసూలు పేరుతో అధిక గల్లా వసూలు చేయడంతో ప్రజలను ఐక్యం చేసి ఉద్యమించారు. దేవరకొండ ప్రాంతంలో ఉద్యమాన్ని ఆయన సహచరులైన ఉజ్జిని నారాయణరావు, బొడ్డుపల్లి రామశర్మ, పగిడిమర్రి మల్లప్ప తదితరులతో కలిసి ఉద్యమాన్ని విస్తరింపజేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, మైనోద్దీన్, పట్టణ సహాయ కార్యదర్శులు జ్యోతిబసు, నగేష్, నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, రాజమల్లయ్య, శ్రీను, మల్లాచారి, వెంకటయ్య,



## 6న ఉమ్మడి నల్లగొండ జిల్లా సన్నాహక సమావేశం : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై ఉమ్మడి నల్లగొండ జిల్లా సన్నాహక సమావేశం ఈనెల6న నల్లగొండలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా మంత్రులు,ప్రజాప్రతినిధులు,అధికారులు హాజరుకానున్నారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశం ఆదేశాల మేరకు,జిల్లాలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత,ఫైల్ క్లియరెన్స్,ఆరోగ్యం (హెచ్‌పీవీ వ్యాక్సినేషన్),విద్య, వ్యవసాయం,మహిళాయువజన సంక్షేమం, పర్యావరణం,డ్రగ్స్ నివారణ,రహదారి భద్రత తదితర అంశాలపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులతో చర్చించి ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఆర్‌డిఓ లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బుద్ధవనంలో బోధి వృక్షం



**ప్రజాపక్షం/నందికొండ:** బుద్ధవనం ఆవరణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది ఇక్కడ మూడు రోజులుగా కొనసాగిన ధమ్మ పాదయాత్ర ఉత్సవాలు బుధవారం ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిసింది. ఈ సందర్భంగా థాయిలాండ్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు బోధి మొక్కను నాటి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.థాయిలాండ్ ముఖ్య బౌద్ధ భిక్షువు సంఘ సక్ కోవిడో అజాన్ తున్ ఆధ్వర్యంలో బుద్ధవనంలోని స్తూపవనంలో ఉన్న థాయిలాండ్ స్థూపం సమీపంలో ఈ వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించబడింది. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచనల మేరకు కార్యక్రమం సంప్రదాయబద్ధంగా సాగింది.మరో మూడు రోజుల పాటు బుద్ధవనంలోనే ధ్యానం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, సీనియర్ అసిస్టెంట్ రాంకుమార్, బుద్ధవనం ప్రాజెక్ట్ సిబ్బంది,నరసింహారావు, ప్రజ్ఞానంద్ థాయిలాండ్ భిక్షువులు, అలాగే గగన్ మాలిక్ ఫౌండేషన్ మేనేజర్ వికాస్ టైడే పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం: డిఎస్‌పి

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా బ్రిడ్జి వద్ద మంగళవారం సాయంత్రం ఇద్దరు యువకులు ఎడమ కాలువలో గల్లంతైన ప్రాంతాన్ని మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు పరిశీలించారు. బుధవారం సాయంత్రం డిఎస్‌పి రాజశేఖర్ రాజు హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్‌లు పరిశీలించారు. ఎడమ కాలువ బ్రిడ్జి ప్రాంతంలో కాలువలోకి ఎవరు దిగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు హాలియా పోలీసులు తెలిపారు. ఇక్కడ దిగడం వలన ప్రమాదాలు జరుగుతాయని పోలీసులు ఆధ్వర్యంలో బ్యానర్లు కూడా ఏర్పాటు చేశారు. దీంతోపాటు ప్రమాదవశాత్తు కాలువలో ఎవరైనా జారి పడితే తక్షణ సాయం కోసం కాలువలోకి పెద్ద తాళ్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు చెప్పారు. తరచూ ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్‌పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ యువకులు ఈత రాకుండా ఈ ప్రాంతంలోకి రాకూడదని నీటి ఉధృతి ఎక్కువగా ఉండటం వలన ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ప్రమాదాల నియంత్రణ వ్యక్తిగతంగానే ప్రారంభం కావాలని ఈ సందర్భంగా సూచించారు.



## అదుపుతప్పి కారు బోల్తా : ఇద్దరు మృతి

### మరో ఇద్దరికి తీవ్రగాయాలు

### అతివేగమే ప్రమాదానికి కారణం

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పి







**ప్రజాపక్షం/మునగాల:** స్వగ్రామంలో తమ బంధువు అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వస్తుండగా మార్గమధ్యంలో కారు అదుపుతప్పి పల్టికొట్టిన సంఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అనంతగిరి మండలం మొగలాయికోట గ్రామానికి చెందిన కిన్నెర పుల్లయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందగా, హైద్రాబాద్‌లో ఉంటున్న పుల్లయ్య బంధువులు నలుగురు కారులో బయలుదేరి మొగలాయికోటకు వస్తుండగా మార్గమద్యలో జాతీయ రహదారిపై ఆకుపాముల శివారులో భగత్ కళాశాల ఎదురుగా అతివేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కిలో మీటర్ రాయిని ఢీకొని రహదారి పక్కన పల్టికొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కిన్నెర దావిద్ (26)అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ పక్క సీట్లో ఉన్న కొండ్రు వంశీ (28) తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ప్రమాదంలో వెనుక సీట్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లాకు జగ్గయ్యపేట నియోజకవర్గం బుదవాడ గ్రామానికి చెందిన మార్కుబుడి రాజ్‌కుమార్, మొగలాయికోట గ్రామానికి చెందిన పెద్దపండు వెంకటి తీవ్రగాయాలయ్యాయి. కాగా కారులో ఉన్న నలుగురిని వెలికితీసేందుకు పోలీసులు స్థానికుల సాయంతో రెండు గంటల పాటు శ్రమించారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో తొలుత కోదాడకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన సంఘటనను బుధవారం రాత్రి జిల్లా ఎస్పి కె.నర్సింహా సందర్శించి ప్రమాదం జరగిన సంఘటన వివరాలను స్థానిక ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. వాహనదారుల అతివేగం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

# చరిత్రాత్మక విజయంతో ఫైనల్‌కు న్యూజిలాండ్!

శ్రీగ్ ఆసాంతం అదరగొట్టి.. ఆఖర్లో తడబడిన దక్షిణాఫ్రికా భారీ మూల్యం చెల్లించుకుంది. సూపర్–8లో భారత్, వెస్టిండీస్, జింబాబ్వేపై భారీ తేడాతో గెలిచిన.. సఫారీలను న్యూజిలాండ్ చిత్తుచిత్తుగా ఓడించింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (100 నాటౌట్) బౌండరీల సునామీలో ప్రొటీస్ జట్టు కొట్టుకుపోయింది. 170 పరుగుల లక్ష్య ఛేదనలో అలెన్ చిరస్మరణీయ సెంచరీతో చెలరేగగా.. పొట్టి ప్రపంచకప్‌లో తొలిసారి దక్షిణాఫ్రికాపై విజయంతో చరిత్ర లిఖించింది కివీస్. విన్నింగ్ షాట్‌తో అలెన్ శతకం పూర్తి చేసుకోగా 9 వికెట్ల విజయంతో దర్జాగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది బ్లాక్‌క్యాప్స్. టి–20 ప్రపంచకప్ ముద్దాడాలనుకున్న దక్షిణాఫ్రికా కల చెదిరింది. లీగ్ దశ నుంచి అజేయంగా సెమీస్‌లో అడుగుపెట్టిన సఫారీ జట్టును అనామక జట్టులా ఓడించింది న్యూజిలాండ్. పొట్టి కప్‌లో గతంలో ఐదుకు ఐదు సార్లు ఓడిన కివీస్.. సంచలన ఆటతో ప్రొటీస్ జట్టుకు నాకౌట్ పంచ్ ఇచ్చింది. ఈడెన్ గార్డెన్స్లో సంజూ శాంసన్ అజేయ అర్ధశతకం(97 నాటౌట్)తో భారత్‌ను గెలిపించిన చోట.. ఫిన్ అలెన్(100 నాటౌట్) విధ్వంసక సెంచరీతో బ్లాక్ క్యాప్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. సూపర్–8లో ఇంగ్లండ్



చేతిలో ఓడిన కివీస్.. అనూహ్యంగా పుంజుకొని టైటిల్‌పోరుకు దూసుకెళ్లడం విశేషం. ఈడెన్ గార్డెన్స్‌లో భారీ ఛేదనలో న్యూజిలాండ్‌కు ఓపెనర్లు ఫిన్ అలెన్(100 నాటౌట్), టిమ్ సీఫర్ట్(41 నాటౌట్)లు బెరుకు లేకుండా ఆడారు. తొలి ఓవర్లోనే సీఫర్ట్ రెండు ఫోర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. కానీ..రబడ బౌలింగ్‌లో బంతిని గాల్లోకి లేపిన అతడికి క్వింటన్ డికాక్ లైఫ్ ఇచ్చాడు. బ్రెవిస్ను కాదని క్యాచ్ అందుకునేందుకు పరుగెత్తిన డికాక్.. చివరకు అడుగు దూరంలో ఆగిపోయాడు. అంతే.. అక్కడి నుంచి ప్రత్యర్థి బౌలర్లకు.. ఫీల్డర్లకు ఏమాత్రం అవకాశమివ్వలేదీ జోడీ. మూడో ఓవర్ నుంచి కివీస్ ఓపెనర్ల విధ్వంసం తారా స్థాయికి చేరింది. కార్బిన్ బాష్ వేసిన పవర్ ప్లే చివరి ఓవర్లో అలెన్ బౌండరీల మోతమోగించాడు. తొలి బంతి నేసిక్సర్‌గా మలిచిన అలెన్.. ఆ తర్వాతి నాలుగు బంతులను బౌండరీలకు తరలించి స్కోర్ 80 దాటించాడు. అర్ధ శతకాలతో తొలి వికెట్‌కు 117 పరుగులు రాబట్టిన ఈ ద్వయాన్ని విడదీసిన రబడ సఫారీలను ఊపిరి తీసుకోనిచ్చాడు. కానీ, రచిన్ రవీంద్ర జత గా అలెన్ అదేదూకుడు కొనసాగించాడు. యాన్సెన్ను టార్గెట్ చేసిన అతడు.. 13వ ఓవర్లో 4, 4, 6, 6, 4తో జోరుతో మ్యాచ్‌ను ముగించాడు. అజేయంగా సెమీస్‌కు దూసుకొచ్చిన దక్షిణాఫ్రికా సెమీఫైనల్లో తడబడినా.. మార్కో యాన్సెన్(55 నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసింది. కొలేమెక్కాన్సీ(29) విజృంభణతో టాపార్డర్.. మిడిలార్డర్ కుప్పకూలిన చోట.. ఈ బక్కపలచని ఆల్‌రౌండర్ దంచేశాడు. డెవాల్ బ్రెవిస్(34) ఔటయ్యాక ట్రిస్టన్ స్టబ్స్(29) జతగా అటాకింగ్ గేమ్తో న్యూజిలాండ్ బౌలర్ల లయను దెబ్బతీసి హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. సఫారీలను పోటీలోకి తీసుకొచ్చిన యాన్సెన్.. ఆఖరి ఓవర్లో మరింత చెలరేగాలనుకున్నా మ్యాట్ హెన్రీ(2–34) ఆ అవకాశమివ్వలేదు. అతడు వరుసగా రెండు వికెట్లు తీయడంతో ప్రొటీస్ జట్టు 169 పరుగులకే పరిమితమైంది.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో సంజూ దూకుడు..

ఒక్కటంటే ఒక్క ఇన్నింగ్స్ చాలు.. క్రికెటర్ల జీవితమే మారిపోతుంది. జట్టును గెలిపించే చిరస్మరణీయ ఆటతో చరిత్రకెక్కిన ఆటగాళ్లు చాలామందే. ఇప్పుడు వారి జాబితాలో సంజూ శాంసన్ కూడా చేరిపోయాడు. టి–20 ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్లాంటి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై శివాలెత్తిపోయిన శాంసన్ భారత జట్టుకు సెమీఫైనల్ బెర్తును కట్టబెట్టాడు. టీమిండియాను సెమీస్ చేర్చిన ఈ డాషింగ్ వ్యక్తిగతంగానూ మైలురాయి సాధించాడు. మొన్నటివరకూ ఐసిసి ర్యాంకింగ్‌లలో ఎక్కడో 60లో ఉన్న అతడు.. ఏకంగా 25 స్థానాలు ఎగబాకాడు. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై చిరస్మరణీయ అర్ధ శతంతో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ ఐసిసి టి–20 బ్యాటర్ల ర్యాంకిగ్స్‌లో ముందంజ వేశాడు. ఏకంగా.. 25 స్థానాలు మెరుగుపరచుకొని ప్రస్తుతం 40వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. విండీస్‌పై 97 నాటౌట్.. ఆ ఒక్క ఇన్నింగ్స్ అతడిని టాప్40లోకి తీసుకొ



చ్చింది. అయితే నంబర్ 1 బ్యాటర్‌గా వరల్డ్‌కప్‌లో చెలరేగి ఆడాల్సిన అభిషేక్ శర్మ ఫామ్ లేమితో పెద్ద ముప్పును ఎదుర్కొంటున్నాడు. పాకిస్థాన్ ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్ అభికి ర్యాంక్‌కు పోటీగా మారాడు. పొట్టి కప్‌లో రెండు శతకాలతో పాక్ విజయాల్లో భాగమైన ఈ ఓపెనర్.. 848 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అభిషేక్‌కు అతడికి 26 పాయింట్లే తేడా. ఇంగ్లండ్ హిట్టర్ ఫిల్ సాల్ట్ మూడో ర్యాంకులో ఉన్నాడు.

## అగ్రస్థానానికి మంధాన



**దుబాయ్ :** భారత ఓపెనర్ స్మృతి మంధాన ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లలో మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆస్ట్రేలియాలో ఇటీవలే ముగిసిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో నిలకడగా రాణించిన స్మృతి.. 790 రేటింగ్ పాయింట్లతో దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్ట్ (782)ను అధిగమించి మొదటి స్థానానికి దూసుకెళ్లింది. టాప్–10లో భారత్ నుంచి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 9వ స్థానంలో నిలిచింది.




# కశ్మీర్‌లో పురాతన బౌద్ధ స్థూపం..



ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా జేహన్‌పొర ప్రాంతంలో ఇటీవల జరిగిన పురావస్తు తవ్వకాలు, కాశ్మీర్ బౌద్ధ చరిత్రపై కొత్త వెలుగు ప్రసరించాయి. ఈ తవ్వకాలలో సుమారు రెండు వేల సంవత్సరాలకు పైగా పురాతనమైన, కుషాణ కాలానికి చెందిన ఒక భారీ బౌద్ధ స్తూపం వెలుగులోకి వచ్చింది. ఇది క్రీస్తు శకం 1వ శతాబ్దం నుంచి 3వ శతాబ్దం మధ్య కాలానికి చెందినదిగా భావిస్తున్నారు. ఈ ఆవిష్కరణ కాశ్మీర్‌లో బౌద్ధ మత విస్తరణ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలపై ఉన్న అవగాహనను మరింత లోతుగా చేస్తోంది. పురావస్తు పరంగా ఈ స్థలం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. జేహన్‌పొరలో వెలుగులోకి వచ్చిన ఈ స్తూపం ప్రస్తుతం కాశ్మీర్‌లో గుర్తించబడిన అతి పెద్ద బౌద్ధ స్థలంగా అంచనా వేస్తున్నారు. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో సాగిన ఈ తవ్వక ప్రాంతంలో, చెక్కతో నిర్మించిన పై నిర్మాణ అవశేషాలు, ఎటువంటి అంతరాయం కలగని మట్టిగుట్టలు కనిపించడం విశేషం. ఇవి ప్రాచీన నిర్మాణ పద్ధతులు, ఆచారాలు, ఆ కాలపు సామాజిక–మత జీవన విధానాన్ని అర్థం చేసుకునేందుకు విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. సాధారణంగా రాయి లేదా ఇటుకలతో కూడిన నిర్మాణాలే ఎక్కువగా కనిపించే భారతీయ బౌద్ధ స్థలాలలో, చెక్క ఆధారిత నిర్మాణ అవశేషాలు లభించడం ఈ స్థలాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఈ ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో కూడా చారిత్రక గుర్తింపు ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చిన ఆధారాలు సూచిస్తున్నాయి. ఫ్రాన్స్‌లోని ఒక మ్యూజియం ఆర్కైవ్‌లో లభించిన పాత ఫొటోలో, జేహన్‌పొర ప్రాంతంలో మూడు బుద్ధ స్తూపాలు కనిపిస్తున్నాయి. ఈ ఫొటోను 19వ శతాబ్దం చివర్లో లేదా 20వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటిష్ ప్రయాణికులు తీసి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. దీని ద్వారా, ఈ స్థలం వలస పాలన కాలంలోనే పాశ్చాత్య పర్యాటకులు, పరిశోధకుల దృష్టిని ఆకర్షించిందని తెలుస్తోంది. అయితే ఆ కాలంలో సరైన శాస్త్రీయ తవ్వకాలు జరగకపోవడంతో, ఈ ప్రదేశం ప్రాముఖ్యత పూర్తిగా వెలుగులోకి రాలేదు. కాశ్మీర్‌లో బౌద్ధ మత ప్రవేశం, వికాసం ఎంతో పురాతనమైనది. చారిత్రకంగా, మౌర్య సామ్రాజ్యానికి చెందిన అశోకుని కాలంలోనే బౌద్ధ మతం కాశ్మీర్‌కు పరిచయమైందని భావిస్తారు. శ్రీలంకకు చెందిన బౌద్ధ గ్రంథం మహావంసం ప్రకారం, క్రీస్తుపూర్వం సుమారు 250లో పాటలీపుత్రంలో అశోకుడు నిర్వహించిన మూడవ బౌద్ధ సంగీతికి కాశ్మీర్‌కు చెందిన బౌద్ధ పండితులను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. అంటే, అప్పటికే కాశ్మీర్‌లో బౌద్ధ మేధావుల ఉనికిని ఈ స్థూపం సూచిస్తుంది.

## వ్యవసాయం.. మానవ జీవనాధారం


ప్రాచీన నాగరికతల ఎదుగుదలలో అత్యంత కీలకమైన మలుపు నయోలిథిక్ విప్లవం. వేట, సేకరణపై ఆధారపడిన జీవన విధానాన్ని విడిచి, మనిషి భూమిని సాగు చేయడం ప్రారంభించిన క్షణమే నాగరికతకు బీజం పడింది. ఈ మార్పుకు కేంద్ర బిందువుగా నిలిచింది సాధారణ రైతు. వారి చేతుల్లోనే సమాజం మొత్తం జీవనాధారం ఉండేది. పంటలను సాగు చేయడం ద్వారా రైతులు కేవలం తమ కుటుంబాల అవసరాలకే కాదు, సమాజం మొత్తం అవసరాలను తీర్చగలిగారు. ముఖ్యంగా, వారు ఉత్పత్తి చేసిన ఆహారం అవసరాలకన్నా ఎక్కువగా ఉన్నప్పుడు ఏర్పడినదే అధిక ఉత్పత్తి. ఇదే అధిక ఉత్పత్తి నాగరికతల అసలైన ఆధారం. ఈ అధిక ఉత్పత్తి వల్లనే నగరాలు పుట్టాయి. ప్రతి వ్యక్తి ఆహారం కోసం భూమిపై పనిచేయాల్సిన అవసరం లేకుండా పోయింది. దాంతో సమాజంలో వృత్తి విభజన ప్రారంభమైంది. వీరందరి జీవనం రైతుల పొలాల్లో పండిన ధాన్యంపైనే ఆధారపడింది. మెసపొటేమియా, ఈజిప్టు, సింధు లోయ, చైనా వంటి ప్రాచీన నాగరికతలు అన్నీ నదీ లోయలలోనే ఎదిగాయి. సారవంతమైన నేల, నీటిపారుదల సౌకర్యాలు, నిరంతర వ్యవసాయ ఉత్పత్తి వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణం. రైతులు కాలువలు తవ్వారు, ఆనకట్టలు నిర్మించారు, వరదలను నియంత్రించారు. అంటే ఇది కేవలం వ్యవసాయానికి మాత్రమే పరిమితం కాలేదు... ఒక సామూహిక శ్రమ వ్యవస్థగా ఎదిగింది.



అధిక ఉత్పత్తి లేకుండా రాజ్యాలు నిలబడవు, సైన్యాలు నడవవు, దేవాలయాలు కట్టబడవు. ఒక సైనికుడు యుద్ధం చేయగలిగాడు అంటే, అతని వెనుక ఒక రైతు ఉన్నాడు. ఒక శిల్పి విగ్రహం చెక్కగలిగాడు అంటే, అతని ఆహార భద్రత రైతు వల్లే సాధ్యమైంది. ఈ విధంగా, వ్యవసాయం కేవలం జీవనోపాధి కాదు.. నాగరికతను పోషించే మూల శక్తి.

## ప్లింప్టన్ గణితం..

ప్రాచీన మెసోపోటేమియా ప్రాంతంలో బాబిలోనియన్ పండితులు రూపొందించిన ప్లింప్టన్ 322 అనే మట్టిపట్టిక, నేటి గణిత శాస్త్రవేత్తలను కూడా ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సుమారు క్రీ.పూ. 1800 కాలానికి చెందిన ఈ అరుదైన వస్తువు, అక్కడియన్ లిపిలో ఉంది. ఇది సాధారణ సంఖ్యల జాబితా మాత్రమే కాకుండా, ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన మరియు సాంకేతికంగా అభివృద్ధి చెందిన ట్రిగోనొమెట్రిక్ పట్టికలలో ఒకటిగా పేర్కొంటున్నారు. ఈ పట్టికలో మొత్తం 15 వరుసలు, 4 కాలమ్స్ ఉన్నాయి. ప్రతి వరుసలోని సంఖ్యలు ఒక నిలువు కోణ త్రిభుజానికి సంబంధించిన గణిత సంబంధాన్ని సూచిస్తాయి. ముఖ్యంగా, ఇవి పీథగొరస్ ట్రిపుల్స్‌గా పిలవబడే సంఖ్యల సమూహాలు. అంటే, ఒక త్రిభుజంలో భుజాలైన 'ఎ', 'బి' ల చదరాల మొత్తం, హైపోటెన్యూస్ అయిన 'సి' చదరానికి సమానమయ్యే విధంగా ఈ సంఖ్యలను అమర్చారు. ఈ గణిత భావన గ్రీకు గణిత శాస్త్రం పుట్టుకకు 1300–1500 సంవత్సరాల ముందే బాబిలోనియన్ సంస్కృతిలో ఉపయోగంలో ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. దీని ద్వారా ట్రిగోనొమెట్రి యొక్క మూల సూత్రాలు ప్రాచీన గ్రీకు తత్త్వజ్ఞానానికి ముందే బలంగా అభివృద్ధి చెందినట్లు స్పష్టమవుతోంది.



## మార్క్‌ఫెడ్ సంస్థతో మొక్కజొన్న కొనుగోళ్లు : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కురవి మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మిర్చి నలి పురుగు, పత్తి ఇలాంటి పంటలు రకరకాల కారణాలతో నష్టపోగా, రైతాంగం ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 3.38 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట, కొంత లాభసాటిగా ఉంటుందని రైతులు సాగు చేశారన్నారు. మొక్క పంట చేతి కొచ్చినా కేంద్ర ప్రభుత్వ సంస్థ, 2400 మద్దతు ధరతో కొనుగోలు ప్రారంభించక పోవడంతో, ప్రైవేటు వ్యాపారుల బారిన పడి కేవలం 1750 నుండి 1850 రూపాయలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. దీనితో రైతు ఎకరాకు దాదాపు 18 వేల రూపాయల నష్టం పోవాల్సి ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మార్క్ ఫెడ్‌ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రబీ సీజన్ ప్రారంభమై నెల దాటినా, యాసంగి రైతు భరోసా సాయం అందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వెంటనే రైతాంగానికి భరోసా నిధులు విడుదల చేయాలని సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కలగూర నాగరాజు, బొల్లం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌తో ఇబ్బందులు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రైతుబంధు డబ్బులు పడక జిల్లాలో రైతాంగం ఇబ్బంది పడుతున్నారని వెంటనే ప్రభుత్వం రైతుబంధు డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుజపల్లి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని సిపిఐ రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇవ్వవలసిన రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. యాసంగి సాగుకు రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టవలసిన పరిస్థితి దాపురించిందని, రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారులను సంప్రదించవలసిన దుస్థితి నెలకొన్నదన్నారు. రైతులకు యూరియా సరఫరాలో యూరియా యాప్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతులందరికీ ఈ యాప్ మీద అవగాహన ఉండదని, ఈయూరియా సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలు ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు సకాలంలో యూరియా అందించాలని కోరారు. ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ రూ.500 ఇస్తానని హామీ ఇవ్వడం జరిగిందని వెంటనే సన్న వడ్ల బోనస్ రైతు ఖాతాలో జమ చేయాలని ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు మాతాంగి రామచందర్, కరిముల్లా, దోర్నాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం/లక్సెట్టిపేట :** అధికారం శాశ్వతం కాదని, ప్రజా తీర్పును అపహాస్యం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ హెచ్చరించారు. బుధవారం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ఆదిలాబాద్ జైలు నుండి 14 రోజుల రిమాండ్ అనంతరం బెయిల్‌పై విడుదలైన బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా హననం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. చెన్నూరు ఎంఎల్‌ఎ, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. 22 వార్డులు ఉన్న క్యాతనపల్లి మున్సిపాలిటీలో సిపిఐ, బిఆర్‌ఎస్ కూటమి 14 స్థానాల్లో స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, ప్రజల తీర్పును అంగీకరించకుండా కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. ప్రజల ఓట్లతో గెలిచిన అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేయడం, లొంగకపోతే బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని పేర్కొన్నారు. మున్సిపల్ పీఠాన్ని అక్రమ మార్గాల్లో దక్కించుకోవాలనే ఉద్దేశంతోనే సిపిఐ, బిఆర్‌ఎస్ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి



జైలుకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అధికార యంత్రాంగాన్ని వినియోగించడం విలువలకే విరుద్ధమని తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు, అక్రమ కేసులు ఎదురైనా ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని కలవేణ శంకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, నాయకులు చంద్రశేఖర్, బిఆర్‌ఎస్, సిపిఐ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ప్రశ్నాపత్రాల భద్రతలో అధికారుల నిర్లక్ష్యం

ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ జిల్లాలో జరగబోయే 10వ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఇటీవల జిల్లా కలెక్టరేట్ కారిడార్‌లో సీల్ చేసి బాధ్యతరహిత్యంగా వ్యవహరించి నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ అత్యంత పకడ్బందీగా, భద్రత మధ్య ఇతర వ్యక్తుల రాకపోకలకు అవకాశం లేకుండ ఏదైనా భవనంలో నాలుగు గోడల మధ్య నిర్వహించాల్సిన సీలింగ్ ప్రక్రియను ఫిబ్రవరి 28న కలెక్టరేట్ కారిడార్‌లో నిర్వహించడం అంటే అధికారుల నిరక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయినీ విష్ణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో యుద్ధం ఆపాలి




సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి విశ్వనాథం

జగిత్యాలలో వామపక్షాల నిరసన

**ప్రజాపక్షం/జగిత్యాల :** పశ్చిమాసియాలో యుద్ధం ఆపి పౌరుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఇజ్రాయిల్, అమెరికా దేశాలదేనని సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం డిమాండ్ చేశారు. బరితెగించిన ఆమెరికా సామ్రాజ్యవాదం నశించి పశ్చిమాసియాలో యుద్ధం ఆపాలని కోరుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం వామ పక్షాల నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వామ పక్షాల నాయకులు ఆర్డీవో కార్యాలయం నుండి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అమెరికా, ఇజ్రాయిల్ జన సంహార దాడులను, భారత ప్రధాని మోదీ మౌనాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సీపీఐఎం రాష్ట్ర కమిటి సభ్యుడు లెల్లల బాలకృష్ణ, సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు చింత భూమేశ్వర్, సీపీఐఎంల్ లిబరేషన్ జిల్లా నాయకుడు ఖాజ మోయినోద్దీన్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకురాలు నామని లక్ష్మి, భారత్ బచావో జిల్లా కోఆరిడనేటర్ పిట్టల నారాయణలు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులు కలిసి ఇరాన్‌పై యుద్ధ దాడులు చేయించడం అమానుష యుద్ధ నేరాలని మండిపడ్డారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తక్షణమే ఇరాన్‌పై దాడులను ఆపి సీజ్ ఫైర్ ప్రకటించాలన్నారు. ఇరాన్‌లో జరిగిన ప్రతి మరణంతో పాటు సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని హత్యపై అంతర్జాతీయ కోర్టులో దర్యాప్తు జరపాలన్నారు. యుద్ధ బాధితులకు ఆస్తి నష్టాలతో పాటు పరిహారం అందించాలని కోరారు. భారత దేశ ప్రధాన మంత్రి మోదీ తక్షణమే జన సంహార దాడులను ఖండించడంతో పాటు ఇరాన్ సార్వభౌమత్వానికి అండగా నిలబడాలన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాన్ని ఆపడానికి తగిన చర్యలు తీసుకుని శాంతి కోరుకునే ప్రజల గొంతుకకు బలం చేకూర్చాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బొడ్డు సుధారాణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెన్న మహేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మునుగూరి హన్మంతు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని శారద, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శులు వెన్న సురేష్, ఎర్ధండి భూమన్న, సీపీఐ జగిత్యాల టౌన్ సెక్రటరీ మాడిశెట్టి కిరణ్, రైతు సంఘం జిల్లా నాయకుడు ఎదులపురం గంగరాజం, బీడి కార్మిక విభాగం నాయకుడు అందె వంశీ కృష్ణ తదితరులు ఉన్నారు.

## సీతారామయ్యకు ప్రజలగుండెల్లో సుస్థిరస్థానం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** గడల సీతారామయ్య నేటికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాటాయోధుడు గడల సీతారామయ్య 49వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాగం హేమంతరావు మాట్లాడారు. తెలంగాణను నిజాం పరిపాలననుంచి, వెట్టిచాకిరీనుంచి విముక్తి చేయడానికి సీతారామయ్యలాంటి నాలుగున్నర వేల మంది తమ ప్రాణాలను అర్పించారన్నారు. వారందరి చరిత్రను మనం భావితరాలకు అందించాలన్నారు. సీతారామయ్యలాంటి అమరవీరులు చేసిన త్యాగాలు, కృషి, పోరాటాలతోనే మనం ఈరోజు నిలబడగలిగామన్నారు. కమ్యూనిస్టులను బతికించుకోవాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని, సమస్యల పరిష్కారానికి ప్రజలు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం మేయర్ పదవిని చేపట్టగలిగామంటే కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తనికెళ్ల గ్రామ సర్పంచ్ గడల కళావతి, సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు, తాటి వెంకటేశ్వర్లు, పివిరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వెంపటి పరశురాములు, మండల పార్టీ కార్యదర్శి గడల భాస్కర్‌రావు, మనిగె కోటేశ్వరరావు, తనికెళ్ల మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, పిన్నం పుల్లయ్య, గడల శ్రీనివాసరావు, చల్లా కృష్ణ, గడల సూర్యనారాయణ, గాజుల వెంకటేశ్వరరావు, యాసా సత్యనారాయణ, తనికెళ్ల గ్రామ ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, మాజీ ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, పాపిట్ల ఏసు, పెదమళ్ల రత్తమయ్య, బాసా వెంకటేశ్వర్లు, లేడిబోయిన సైదులు, బాణోత్ రామయ్య, బెజవాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ గాగిల్లాపూర్ మల్లంపేట్ బౌరంపేట్ బహదూర్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులను బికెఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి తమ ట్రస్ట్ ద్వారా బహుమతులు, ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తామని తెలియజేశారు. అదే విధంగా మధ్యతరగతి పేద విద్యార్థులకు అండగా ఉండి వారి చదువుకు అన్ని విధాల బికెఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని తెలియజేశారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, మల్లేష్ యాదవ్, ఎఆర్ సాధు యాదవ్, బెంబిడి మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేస్తాను

### గంజాయి రేణుక రాములు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గ్రామ అభివృద్ధిలో మంచి మార్పును చూపడానికి అన్ని వర్గాలతో మమేకమై గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అర్కతల గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు, మండల పరిధిలోని ఆర్కతల గ్రామంలో శరవేగంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని, తరువాత గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించ డం జరుగుతుందని పేర్కొన్నారు.



ఎన్ఆర్ఈఇఎస్ నిధులతో 20 లక్షల నిధులతో రెండంతస్తుల గ్రామ పంచాయతీ భవనాన్ని అదే విధంగా స్కూల్ కాంపౌండ్ వాల్‌కు 10 లక్షలు డ్వాక్రా మహిళ భవన నిర్మాణానికి 10 లక్షలు గుడ్ స్టోరేజ్ షెడ్డును నిర్మించడానికి తగిన కృషి చేస్తున్నామని, గ్రామ సర్పంచ్ రేణుక రాముడు పేర్కొన్నారు. గ్రామంలోని ఎలాంటి సమస్యలు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివలీల భాగయ్య, వార్డు మెంబర్లు, శ్రీశైలం, వెంకటయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు తరచు అకడమిక్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు తెలిపారు. బుధవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రసాయన బంధం అన్న అంశంపై విస్తృతోపన్యా స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. లావణ్య మాట్లాడుతూ రసాయన బంధాల స్వభావం, అయానిక్, కోవెలంట్ బంధా ల మధ్య తేడాలు, వాటి లక్షణాలు, అణువుల నిర్మాణంలో బంధాల ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. రసాయన బంధాల అవగాహన వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను విద్యార్థులకు స్పష్టం చేసారు. శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అడవి రాజు, రసాయన శాస్త్ర అధ్యాపకులు జి.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.





## శారీరక సంబంధమే హత్యకు కారణం


### వివరాలు వెల్లడించిన మోమిన్ పేట్ సిఐ జి. వెంకట్
### పోలీస్‌లను అభినందించిన ఎస్‌పి స్నేహ మెహ్రా

**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబ్ పేట్ మండలం ఎత్ రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మినేపల్లి బాలమణి అనే మహిళ హత్య కేసును నవాబ్ పేట్ పోలీసులు ఛేదించారు. ఈ కేసుకి సంబంధించిన వివరాలను మీడియాకు మోమిన్ పేట్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ వెంకట్ వెల్లడించారు. నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామం పులికుంట గుట్ట సమీపంలోని ఓ వెంచర్ లో ఈనెల (మార్చి) 2వ తేదీన మీనేపల్లి బాలమణి అనే మహిళ హత్య జరిగింది. భర్తకు దూరంగా శంకర్‌పల్లిలో కుటుంబంతో కలిసి మృతురాలు నివాసం ఉంటుంది.

ఈ నెల 1వ తేదీన ఎల్లకొండ గ్రామంలో జరుగుతున్న శ్రీ పార్వతీ పరమేశ్వరుల జాతర కోసం తన అక్క, చెల్లెలుతో కలిసి వచ్చింది. ఎల్లకొండ గ్రామానికి చెందిన నిందితుడు నాయకుడి శ్రీనివాస్ కు మృతురాలు మినేపల్లి బాలమణికి గతంలో నుండే పరిచయం. ఇరువురి మధ్య గల సంబంధం బయట పడుతుందన్న భయంతో, వ్యక్తిగత విభేదాలతో నిందితుడు పక్కపన్నాగంతో 2వ తేదీన ఆదివారం అర్ధరాత్రి నిందితుడు మృతురాలు బాలమణిని ఎలాగైనా చంపి వదిలించుకోవాలని తన స్కూటీపై ఎక్కించుకొని ఎల్లకొండ గ్రామ శివారు పులికుంట గుట్ట సమీపంలోకి తీసుకెళ్లి తన దగ్గర ఉన్నటువంటి ఆయుధంతో గొంతుకోసి హత్య చేసి మృత్యురాలు దగ్గర ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్‌తో అక్కడ నుండి పరారయ్యాడు. అదే రోజు కుమారుడు తన తల్లి కనిపించడం లేదని గ్రామస్తులకు, తెలిసిన వారికి సమాచారం అందించాడు. ఎల్లకొండ గ్రామ శివారులో ఓ మహిళ మృతదేహం లభ్యం కావడంతో సమాచారం అందుకొని ఘటన స్థలానికి మృతురాలు కుమారుడు శేఖర్ చేరుకుని ఆ మృతదేహం తన తల్లిదేనని ధ్రువీకరణ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై పుండ్లిక్ కేసు నమోదు చేశారు. మోమి న్ సిఐ వెంకట్ తదుపరి విచారణ నిమిత్తం నివేదిక ఇవ్వడం జరిగిందని చెప్పారు. దర్యాప్తులో భాగంగా శాస్త్రీయ, సాంకేతిక సమాచారంతో నింది తుడు నాయకుడి శ్రీనివాస్ ఎల్లకొండ గ్రామస్తుడు అని గుర్తించి అరెస్ట్ చేసి వికారాబాద్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలించామన్నారు. అదే విధంగా నిందితుడు మృతురాలి నుండి అపహరించిన బంగారం, వెండి, ఫోన్ ని రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు.







## రేపు సిఎం చేతుల మీదుగా
# మరో రెండు చెరువులు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మరో రెండు చెరువులు హైదరాబాద్ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. పాతబస్తీలోని బమ్రుకున్ ఉద్ దౌలా, కూకట్ పల్లిలోని నల్ల చెరువు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఈ నెల 6వ తేదీన బమ్రుకున్ ఉద్ దౌలా చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. మరో రెండు, మూడు రోజులలో కూకట్‌పల్లి నల్ల చెరువును కూడా నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. హైడ్రా మొదట విడత చేపట్టిన 6 చెరువుల్లో ఇప్పటికే అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట గతేడాది సెప్టెంబరు 28న ప్రారంభమైన విషయం విదితమే.

మరో మూడు చెరువులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి తోడు రెండో విడత మరో 14 చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడానికి కసరత్తు చేస్తోంది. ఇలా నగరంలో మురికి కూపాలుగా మారిన చెరువుల రూపురేఖలు మార్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది.

**పాతబస్తీకి మణిహారంగా బమ్రుకున్ - ఉద్- దౌలా చెరువు...**

నిజాంకాలం నాటి చారిత్రక బమ్రుకున్ ఉద్ దౌలా చెరువుకు హైడ్రా ప్రాణం పోసింది. కబ్జాలను తొలగించి ఊపిరిలూదింది. ఆక్రమణలతో ఆనవాళ్లే కోల్పోయిన ఈ చెరువును బతికించింది. చరిత్రను తవ్వితీసిన మాదిరి చెరువును రూపొందించి చారిత్రక వైభవాన్ని హైడ్రా చాటింది. కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న చరిత్రకు హైడ్రా ప్రాణం పోసింది. నాటి కట్టను మరింత పటిష్టం చేసి, వాకింగ్ ట్రాక్‌ను నిర్మించింది. కట్టపై ఓపెన్ జిమ్‌ను పెట్టి అన్ని వయసులవారి ఆరోగ్యానికి బాటలు వేసింది. చెరువు లోపలి వైపు ఫెన్సింగ్ పనులను పూర్తి చేసింది. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ప్లే ఏరియాలను అభివృద్ధి చేసింది. వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ గజబోలు నలువైపులా నిర్మించారు. చెరువుకు మూడు వైపులా ప్రవేశ మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. నిజాంల కాలంలో ఈ చెరువుకు ఎంతో చరిత్ర ఉందని, దీనిని పునరావృతం చేసేలా చుట్టూ ఔషధగుణాలున్న మొక్కలతో పాటు చల్లటి నీడనిచ్చే మొక్కలను పెంచింది.

**చరిత్రను చాటేలా..**

1970లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్ను ఉద్ దౌలా ఈ చెరువును నిర్మించారని.. అందుకే బమ్రుకున్ ఉద్ దౌలా చెరువు పేరు వచ్చిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. తాగు నీటి అవసరాలను తీర్చే విధంగా 104 ఎకరాల మేర ఈ చెరువు విస్తరించి ఉంది. కాలక్రమంలో చెరువు విస్తీర్ణం తగ్గుతూ హెచ్ ఎండిఏ ఈ చెరువును 17.05 ఎకరాలుగా నిర్ధారించింది. చివరికి 4.12 ఎకరాలుగా మిగిలిపోయింది. హైడ్రా 2024 ఆగస్టులో ఆక్రమణలను తొలగించింది.

**అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతంలో నల్లచెరువు...**

ఎటు చూసినా నివాసాలు.. వరద నీరు ఎటు వెళ్లాలో తెలియని నిర్మాణాలు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన ప్రాంతంలో కూకట్‌పల్లి నల్లచెరువు ఆక్రమణలకు గురై బిక్కుబిక్కుమంటున్న తరుణంలో హైడ్రా దృష్టి ఆ చెరువుపై పడింది. మురుగు నీటితో దుర్గంధభరితంగా మారిన ఈ చెరువును అభివృద్ధి చేయాలని హైడ్రా నిర్ణయించింది. ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మించిన 16 వ్యాపార షెడ్డులను హైడ్రా తొలగించింది. చెరువులో పోసిన నిర్మాణ వ్యర్థాలతో పాటు దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించచడంతో పాటు 3 మీటర్లకు పైగా మట్టిని కూడా తొలగించింది.

## కామ్రేడ్ తిరుపతయ్య అకాల మరణం తీరని లోటు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సిపిఐ సీనియర్ నేత, ఏఐటియుసి అనుబంధ ఈసిఐఎల్ సంస్థ మాజీ ఉద్యోగి కామ్రెడ్ తిరుపతయ్య అకాల మరణం కార్మిక వర్గానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో నిర్వహించిన తిరుపతి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ ఈసిఐఎల్ ప్రాంతంలో జరిగిన పలు కార్మిక పోరాటాల్లో ఆయన క్రియాశీలకంగా పాల్గొన్నారు. దీంతో పాటు పార్టీ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పుడు అగ్రభాగాన నిలబడి పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఈసిఐఎల్ మాజీ ఉద్యోగులు బలరాం, మోహనరావు, ఎంఆర్‌కె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహిళలను జనసేన పార్టీలోకి ఆహ్వానం



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేజ్ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు పవన్ నాయుడు ఆధ్వర్యంలో సైబరాబాద్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ సమక్షంలో బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ గాయత్రి నగర్ డివిజన్ నుండి 31మంది మహిళలు ఉద్యమి క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకొని జనసేన పార్టీలోకి అధికారికంగా చేరారు. వారికి ప్రేమకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు, సమాజసేవ పట్ల యనకున్న అంకితభావం అనేక మందిని ఆకర్షిస్తున్నాయని తెలిపా రు. ముఖ్యంగా మహిళలు సమాజ నిర్మానంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి భాగస్వామ్యం పార్టీ బలాన్ని మరింత పెంచుతుందని అన్నారు. జనసేన పార్టీ సామాన్య ప్రజల హక్కుల కోసం, పారదర్శక పాలన కోసం, యువత, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. పార్టీలో చేరిన మహిళలు సమాజ సేవలో చురుకుగా పాల్గొని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కూకట్‌పల్లి జోన్ కో ఆర్డినేటర్లు మండలి దయాకర్, కొల్లా శంకర్, మండలి అనిల్, అడక్ కమిటీ సభ్యులు అనిత గాలి, వేముల మహేష్, పోలేబోయిన శ్రీనివాస్, రణదీప్, యోగేష్, జాల రవి, తుంగల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక-99' సమర్థవంతంగా అమలు

### అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, సుధీర్‌లతో కలిసి జిల్లా అధికారులకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6నుండి జూన్ 12వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. మార్చి 6నుండి 15వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత,పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కార రికార్డుల సక్రమ నిర్వహణ .ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు మున్సిపాలిటిలలో తడి, పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 6 నుండి 11వ రకు ఆరోగ్యం ఆరోగ్యకరమైన ప్రారంభాలు , ఆశాజనకమైన భవిష్యత్తు లు, కుటుంబ సంక్షేమ, మహిళ, శిశుసంక్షేమ, ఆరోగ్య శిబిరాలు, గర్భిణిలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, 13 నుండి 18వరకు సురక్షితంగా చేరుకోండి. హోం, రవాణాశాఖల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై హెల్మెట్ తదితర అంశాలపై 20నుండి 25వరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమం, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని నిర్వహిస్తారు. 27నుండి మే2వరకు పిల్లల భద్రత, డ్రగ్స్‌పై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమం, 11నుండి 16వరక విద్యపై, 18నుండి 23వరకు క్రీడల . 25నుండి 30వరకు మహిళల స్వయం సహాయక ఉపాధి హామీ, జూన్ 1నుండి 12వరకు పర్యావరణంపై ప్లాస్టిక్ నియంత్రణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ 99రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదిక రూపంలో అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్షచౌదిరి, డిఆర్ఓ మంగిలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, డిఆర్‌డిఎశ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీచేసిన కలెక్టర్:** వికారాబాద్ ఎన్నెపల్లిలోఒకటి, రెండవ అంగన్వాడి కేంద్రంను తనిఖీ చేసి పోషకాహారం ప్రీస్కూల్ విద్య, హాజరు నమోదు, పుస్తకాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఇంగ్లీష్ స్టోరీలను చదివించారు. ఈ కార్యక్రమంలో శిశుసంక్షేమ అధికారి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య హోలీ సంబురాలు




**ప్రజాపక్షం/నిజాంపేట్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో హోలీ పండుగ సంబురాలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి, ప్రగతినగర్, గాజులరామారం, చింతల్, జీడిమెట్ల, కొంపల్లి సర్కిల్లలో చిన్నా పెద్ద తేడా లేకుండా హోలీ పండుగను జరుపుకున్నారు. కామున్ని దహనం చేసిన అనంతరం రంగులను చల్లుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. బాచుపల్లిలో మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ శానిటేషన్ సిబ్బందితో హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా హోలీ పండుగను జరుపుకున్నారు.

**కూకట్‌పల్లిలో :** రంగుల పండుగ హోలి సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో బుధవారం హోలి సంబురాలు అంబరాన్ని అంటాయి. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన రాజేశ్వరరావు కుటుంబ సభ్యులతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య హోలి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలి పండుగ అనేది చెడు మీద మంచి సాధించి విజయానికి ప్రతీక అని, సమాజంలో సోదరభావం, ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ఈ పండుగను జరుపు కోవాలని ఆకాంక్షించారు. రంగుల్లాంటి వైవిధ్యాలు ఉన్నా మనమంతా ఒక్కటే అన్న భావనతో సమాజ అభివృద్ధికోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ సంతోషంగా వేడుకలను నిర్వహించారు.



**నవాబుపేట్‌లో:** నవాబుపేట్ మండల పరిధిలోని గంగ్యాడ,పూలపల్లి,ఎల్లకొండ గ్రామాల్లో హోలీ పండుగను మండల ప్రజలు బుదవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే యువత,ఆడపడుచులు, చిన్నారులు రంగులతో ఒకరిపై ఒకరు చల్లి హర్షోల్లాసాలతో సందడి చేశారు. గ్రామ వీధులన్నీ రంగుల మయం కాగా, పండుగ సందడి నెలకొంది. కామదహనం కార్యక్రమాన్ని రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని చెడు పై మంచి గెలుపుకు సంకేతంగా కామ దహనం చేశారు. మండలంలో హోలీ సంబరాలు శాంతియుత వాతావరణంలో, ఉత్సాహంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో గంగ్యాడ సర్పంచ్ దోసాడ మల్లేష్, పూలపల్లి సర్పంచ్ భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి, ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్, నాయకులు బానూరి ఉపేందర్ రెడ్డి, రవీందర్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





## కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల అందజేత

**ప్రజాపక్షం /వికారాబాద్ :** మండలానికి చెందిన 72 కళ్యాణలక్ష్మి , 9షాదిముబారక్ చెక్కలను ,30 సిఎంఆర్ చెక్కులను వికారాబాద్ ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో అబ్దిదారులకు తెలంగాణ రాష్ట స్పీకర్ ప్రసాద్‌కుమార్ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఆరు గ్యారంటీలలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్, రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ జరిగిందన్నారు. గత ప్రభుత్వం అప్పులపాలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమర్థుడు రాష్ట ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతుంది. ఇంకో ఆరు నెలల తరువాత ఇచ్చిన మాట ప్రకారం కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ లబ్దిదారులకు తులం బంగారం , స్కూటీ, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కళ్యాణలక్ష్మి , షాధీముబారక్ విషయంలో మీరు మధ్యవర్తునుల దగ్గరకు వెళ్లల్సిన అవసరం లేదు, దరఖాస్తు చేసుకుంటే నేరుగా మీ పేరు మీద చెక్కు వస్తుంది. అన్నారు. ఈ కార్యక్రమంలోఆర్‌టిఏ మెంబర్ జాఫర్, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

### సిపిఐ శామీర్‌పేట కార్యదర్శి నరేంద్రప్రసాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్‌లోని పెద్దమ్మ కాలనీలో ప్రజలు, కాలనీ వాసులు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను తీర్చడంలో అధికారులు విఫలమయ్యారని శామీర్‌పేట సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ అన్నా రు. బుధవారం శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీ సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ కాలనీ నిర్వాసితులకు మౌళిక సదుపాయాలైన మంచినీటి సరఫరా, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజి, సిసి రోడ్లు, బోరు మోటార్, ఇంటి నంబర్ల కేటాయింపు, అంగన్‌వాడి చిన్నారులకు శాశ్వత భవనం, ప్రభుత్వ వైద్యం వంటి వసతులు లేవని కాలనీ ఏర్పడి కొన్ని సంవత్సరాలు గడుస్తున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా కాలనీ పరిస్థితి ఉందని ఆవేదన చెందారు. ఇట్టి సమస్యలపై కీసర డిప్యూటీ కమిషనర్ వసంతరెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతామని చెప్పారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.





## మాజీ జెడ్పీటిసి అనితలాలికి గౌరవ డాక్టరేట్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మాజి జడ్పిటిసి మహంకాళి అనితలాలికి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని హోసునురులో నిర్వహించిన కార్యక్రమంలో ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్శిటి ప్రతినిధులు ఈ అవార్డును అనితకు అందజేశారు. సామాజిక స్పృహతో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి కల్పించడం, రాజకీయ రంగంలో సేవలు అందించడం వంటి విశేష కృషిని గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శామీర్‌పేట మండల మాజీ జడ్పిటిసి మహంకాళి అనితలాలికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం పట్ల సామాజిక కార్యకర్తలు, మేధావులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గౌరవ డాక్టరేట్ పొందిన మాజీ జడ్పిటిసి అనితలాలి మాట్లాడుతూ తాను సామాజికంగా బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేసిన సేవలను గుర్తించిన యూనివర్శిటి ఈ అవార్డు అందజేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వకారణంగా ఉందన్నారు. శామీర్‌పేట మండల ప్రజలకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు, పాత్రికేయులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు చేపడుతానని, మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తానని అన్నారు.

## కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ కీలక నేత మన్నెరాజు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బిఆర్ఎస్ నేత, మత్స్య శాఖ కోపరేటివ్ మాజీ చైర్మన్ మన్నెరాజు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజా రంజకంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి కొలన్ హన్మంతరెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డిల ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పార్టీలో చేరిన మన్నెరాజుకు పార్టీ కండువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి, కెఎం గిరీష్, లక్ష్మారెడ్డి, రషీద్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, కృష్ణ, ఆలేటి శ్రీనివాస్ రావు, ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



ప్రజాపక్షం/షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బుధవారం కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దిలీప్ మాట్లాడుతూ 12వ వార్డులోని కాలనీల్లో వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించి మహిళలకు చీరలను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నందిగామ మల్లేష్, మహేష్, కిరణ్, మణికంత, జయంత్‌లు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకంతోనే నిరుపేదలకు జీవనం




ప్రజాపక్షం/షాబాద్: ఉపాధి హామీ పథకంతోనే నిరు పేదలకు బతుకు జీవనం సాగుతుందని పోతుగల్ సర్పంచ్ పామెన నర్సింలు అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సోషల్ ఆడిట్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పామెన నర్సింలు మాట్లాడుతూ గత సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఉపాధి హామీ అధికారులు ఆడిట్ నిర్వహించిన్నట్లు తెలిపారు. ఉపాధి పనులు నిర్వహించడానికి ప్రణాళిక ఏర్పాటు చేసిన్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకంలో పని చేసి ఉపాధి పొందాలన్నారు. పని చేస్తున్న ఉపాధి కూలీలకు ప్రతి వారం వారం కూలీ డబ్బులు ఖాతలో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, డిప్యూటీ సర్పంచ్ నేరట్ల సావిత్రి, వార్డు సభ్యులు కరుణాకర్ రెడ్డి, చంద్రశేఖర్, గ్రామస్తులు మహేందర్, మునీర్ ఫరీఫ్, ముస్తాఫా, ఫీల్డ్ అసిస్టెంట్ చందయ్య, ప్రకాష్, సతీష్, కుమార్, మధు మహిళ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం




ప్రజాపక్షం/కేశంపేట : పేదోడి సొంతింటి కలను నెరవేర్చాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తొమ్మిదిరేకుల సర్పంచ్ కవితా కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామ పంచాయతీ పరిధిలోని బాల్యతండాలో ఉడ్తవత్ తులసి కిషన్‌నాయక్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ కవితా కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కవితా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉడ్తవత్ రవినాయక్, మాజీ ఎంపిటిసి రంగయ్య, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, వార్డు సభ్యులు లచ్చిరామ్‌నాయక్, గుత్తి శేఖర్, లాలమోని చంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి, గోవింద్, హంజ్యానాయక్, సక్రునాయక్, పంతునాయక్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించాలి

ప్రజాపక్షం/యాచారం : మేడిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడాలని మేడిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం వారు గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్న విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందన్నారు. కొన్ని వార్డులో లోవోల్టేజి సమస్య విపరీతంగా ఉందని తెలిపారు. లోఒలేజీ సమస్యను పరిష్కరించడాలని పలుమార్లు అధికారులకు వివరించిన పట్టి పట్టనట్లుగా వ్యహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు సమస్యలను పరిష్కరించకపోతే అందోళన చేస్తామని హెచ్చరించారు.

## చెరువులో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: గురుకుల పాఠశాల విద్యార్థి ఈత కోసం వెళ్ళి మృత్యువాత పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో చోటు చేసుకుంది. షాద్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ శివారులో ఉన్న మహాత్మజ్యోతిరావు పూలే సంక్షేమ బిసి వెల్ఫేర్ వసతి గృహంలో చదువుకుంటున్న రాజు అనే విద్యార్థి మండల పరిధిలోని రాయికల్ శివారులో ఉన్న చెరువు వద్దకు మంగళవారం హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లారు. చెరువులోకి వెళ్ళిన రాజు ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో స్నేహితులు హుటాహుటిన గురుకుల వసతి గృహం వద్దకు పరుగులు తీసి జగిరిన ఘటనను వివరించారు. దాంతో వెంటనే షాద్‌నగర్ పోలీసులకు సమాచారం అంధించగా హుటాహుటిన చెరువు వద్దకు చేరుకొని పరిశీలించారు. ఎంత వెతికిన ఫలితం లేకపోవడంతో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. దాంతో చెరువులో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బుధవారం విద్యార్థి రాజు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని హామీ ఇచ్చారు.నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆదనపు కలెక్టర్ తెలిపారు. చదువుకుంటున్న రాజు అనే విద్యార్థి చెరువులో గల్లంతు కావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణతోపాటు ఆర్‌డిఓ సరిత, సిఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అప్పుడే రికార్డు బ్రేక్

### మార్చి 3 నాటికి 4,421 మెగావాట్స్ డిమాండ్
### మే నాటికి 5,000 మెగావాట్స్‌గా అంచనా..
### ఈ ఏడాది గ్రేటర్‌లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాపక్షం/సిటీబ్యూరో: ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉండే అవకాశముందని ఐఎండీ అధికారులు పేర్కొన్నారు. మార్చి నుంచి మే మధ్య ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మంగళవారం విద్యుత్ వినియోగం 4,421 మెగావాట్ల రికార్డు స్థాయికి చేరినట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వీ పాటిల్ తెలిపారు. ఈ ఏడాది ఎండ తీవ్రత 42 డిగ్రీలు చేరుకోవచ్చని.. అదే స్థాయిలో విద్యుత్ డిమాండ్ 5 మెగావాట్స్ చేరుకుంటుందని అధికారులు అంచనా వేశారు. ఓ వైపు ఎండలు.. మరో వైపు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది.

గ్రేటర్‌లోని చాలా చోట్ల ఈ వేసవిలో హీట్ వేవ్స్ రోజులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావారణశాఖ అధికారులు తెలిపారు. సాధారణంగా కంటే ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని.. గరిష్టంగా గ్రేటర్‌లో మే నాటికి 42 డిగ్రీల వరకు ఉష్టోగ్రత నమోదవుతుందని అధికారులు అంచనా వేస్తుండగా.. ఒకటి రెండు డిగ్రీలు అటుఇటుగా ఉండే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. అయితే అకాల వర్షాల కారణంగా వాతావరణం చల్లబడితే పరిస్థితి ఆశాజకంగా ఉంటుందంటున్నారు.






**ఐదేండ్లలో ఉష్ణోగ్రతలు...** గడచిన ఐదేండ్లలో వేసవి సమయంలో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చింది. ఐఎండీ రికార్డుల ఆధారంగా ..మే 2021 లో 40.9, మే 2022లో 43.3, మే 2023లో 41.5, మే 2024లో 44.2, మే 2025లో 41.9లో గరిష్టంగా నమోదయ్యాయి. 2024లో అత్యధికంగా 44 డిగ్రీలు దాటింది. అది ఇటీవలి సంవత్సరాల్లో రికార్డుగా చెప్పవచ్చు. సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో వేసవిలో 40 డిగ్రీలకు పైగా ప్రతి ఏడాది నమోదవుతోంది.ఈ ఏడాది కూడా 42 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం

**మార్చి 3 రికార్డు...** జీహెచ్‌ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీతో పాటు ఇబ్రహీంపట్నం, సంగారెడ్డి ప్రాంతాల్లో మార్చి 3న 4,421 మెగావాట్ల గరిష్ట విద్యుత్ రికార్డు నమోదయ్యింది. ఇప్పటివరకు నమోదయిన అత్యధిక డిమాండ్ ఇదే. 2024 మే 6న రికార్డయిన గరిష్ట డిమాండ్ 4,352 మెగావాట్లు.. ఈ ఏడాది మే నాటికి ఏకంగా 5,000 మెగావాట్స్ దాటే అవకాశముందని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా వేసవి తీవ్రత పెరిగే మే నెలలో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుతుంది.

అయితే ఈసారి ఉష్ణోగ్రతలు ముందుగానే పెరగడం, వాణిజ్య, గృహ వినియోగం అధికం కావడం వల్ల మార్చి ప్రారంభంలోనే రికార్డు స్థాయి డిమాండ్ నమోదైంది. ప్రధానంగా ఎయిర్ కండీషనర్లు, కూలర్ల వినియోగం పెరుగుతుండటంతో డిమాండ్ భారీగా నమోదవుతోంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర సరఫరా అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, 33 కేవీ/11 కేవీ ఫీడర్లపై, సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్ ఫార్మర్ల లోడ్‌ను పర్యవేక్షించాలని ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

### గ్రామీణ ప్రాంతాల్లో
## సేవలందించాలి
### జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

ప్రజాపక్షం/సిటీ బ్యూరో : ఆకృతి సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో వినికిడి లోపం ఉన్న పిల్లలకు మరింత సేవలందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి కోరారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె శ్రీనగర్ కాలనీలోని ఆకృతి ఆశ్రయ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సంస్థ అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. పిల్లలకు కల వినికిడి లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించాలన్నారు. ఈదశలో జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకుంటే పిల్లల భాష, వారి ఆత్మ విశ్వాసంపై మార్పును తీసుకువస్తుందన్నారు. ఈ సేవలను వెనుకబడిన ప్రాంతాలకు కూడా విస్తరించాలన్నారు. ప్రధానంగా స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున్న మొబైల్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సేవలు వినికిడి లోపం ఉన్న ప్రతి బిడ్డకు చేరుకునేందుకు తమ సహకారం ఉంటుందన్నారు.దివ్యాంగ పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు, దాతృత్వ సంస్థలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో క్వాల్కామ్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శశిరెడ్డి, సీనియర్ డైరెక్టర్ ఆఫ్ టెక్నాలజీ అండ్ పేటెంట్ కౌన్సిల్ క్వాల్కామ్ నితిన్ శర్మ, దివ్యాంగుల సంక్షేమ అధికారి రాజేందర్, ఇఎన్‌టి నిపుణురాలు డాక్టర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో వంద శాతం
## 'ఇ-వేస్ట్, బయోమెడికల్ వ్యర్థాల సేకరణ'
### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో వంద శాతం ఇ-వేస్ట్, బయోమెడికల్ వ్యర్థాల సేకరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. బయోమెడికల్ వ్యర్థాలను ఎట్టిపరిస్థితుల్లోనూ మున్సిపల్ వ్యర్థాలతో కలుపొద్దని, నిబంధనలను ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యూర్ పరిధిలోని జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసి కార్పొరేషన్‌లలో శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను బలోపేతం చేసే దిశగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇ-వేస్ట్ రీసైక్లర్లు, బయోమెడికల్ వ్యర్థాల శుద్ధి సంస్థలు, సిఎస్‌ఆర్ భాగస్వాములతో జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ బయోమెడికల్ వ్యర్థాల సేకరణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. నిబంధనల ప్రకారం వ్యర్థాలను సేకరించని సంస్థలపై నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రులు, ఆరోగ్య సంస్థలు నిర్దేశిత నియమాలు, యూజర్ ఛార్జీలు పాటించేలా ఎఎంఒహెచ్‌లతో సమన్వయం చేస్తామన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా మార్చేందుకు అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సర్కిల్‌లో ప్రత్యేక సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజలు స్వచ్ఛందంగా ఇవేస్ట్ ఇచ్చేలా ప్రోత్సహిస్తామన్నారు. అదనంగా ప్రతి శనివారం, ఆదివారం క్యూర్ పరిధిలోని 300 వార్డుల్లో వార్డు స్థాయి సేకరణ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్(శానిటేషన్) రవికిరణ్ మాట్లాడుతూ సేకరణ కు అవసరమైన మౌలిక వసతులు జిహెచ్‌ఎంసి అందిస్తుందని, అయితే ధరలు, చెల్లింపులు, ప్రో త్సాహకాలు పూర్తిగా సంస్థల పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. సమావేశంలో పలు సంస్థలు యుపిఐ లేదా నగదు రూపంలో ప్రత్యక్ష చెల్లింపులకు అంగీకరించగా, మరికొన్ని సంస్థలు సిఎస్‌ఆర్ కింద రిడీమబుల్ కూపన్లు అందించేందుకు ముందుకొచ్చాయి. సమావేశంలో జిహెచ్‌ఎంసి హెల్త్ అదనపు కమిషనర్ ప్రియాంక అల, శానిటేషన్ అదనపు కమిషనర్‌లు రవికిరణ్, రఘు ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎస్‌ఇ సృజన శ్రీ, ఇ-వేస్ట్ రీసైకిల్, హ్యాండ్లింగ్ సంస్థలు, బయోమెడికల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మియాపూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

ప్రజాపక్షం/రంగారెడ్డి: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత ఎండిఎంఎ డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు. విశ్వసనీయ వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం విశ్వంభర కాలనీ పార్క్ సమీపంలో ఒక వోక్స్ వ్యాగన్ కారులో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో స్పందించిన మియాపూర్ సివిల్ పోలీస్‌లతోపాటు మాదాపూర్ ఎస్‌ఓటి బృందం అక్కడికి చేరుకుని సదరు వాహనాన్ని తనిఖీ చేశారు. పోలీసులను గమనించి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా, వారిని చేజ్ చేసి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, కార్ డ్యాష్ బోర్డ్‌లోని జిప్‌లాక్ కవర్‌లో తెల్లటి క్రిస్టలైన్ పదార్థం లభ్యమైందన్నారు. డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా అది 12.6 గ్రాముల ఎండిఎంఎగా నిర్ధారణ అయిందని తెలిపారు. నిందితులు బేరి హనుమంత (27), భూమని మహేష్(26),కాసం ఆదర్శ్(28)లను అరెస్ట్ చేసి విచారించగా, వారు బెంగళూరు నుంచి ఈ డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి,హైదరాబాద్‌లో అధిక లాభాలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల నుంచి డ్రగ్స్‌తో పాటు, ఒక వోక్స్ వ్యాగన్ కారు,నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, ఈ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ కుకట్‌పల్లి జోన్ అదనపు డిసిపి ఎం.సుదర్శన్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగం గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



## పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన

ప్రజాపక్షం/యాచారం: గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు రెండవ రోజు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సంధర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ వార్డుమెంబర్ల శిక్షణ కార్యక్రమం మొదటి విడతగా 12 గ్రామాలు. రెండవ విడత 12 గ్రామాల వార్డు మెంబర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి విడుత ఈ నెల 2 నుండి 7 వరకు రెండవ విడత 9 నుండి 14 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వార్డుమెంబర్లు పంచాయతీరాజ్ చట్టం గురించి అవగాహణ పెంపొందించుకొవాలన్నారు. గ్రామాల్లో ఉన్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక చోరవ తీసుకొవాలన్నారు. పారిశుధ్యాని మేరుగు పర్చాలన్నారు. రోజువారి కార్యక్రమాల ప్రకారం అందరు నడుచుకోవాలన్నారు. గ్రామ అభివృద్దిలో అందరు భాగస్మాములై అభివృద్ధికి బాటలు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సూపరిండేంట్ శైలజా,ఇన్‌చార్జి ఎంపిఓ తిరుపతయ్య, వివిధ గ్రామాల పంచాయతీకార్యదర్శులు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

### శెభాష్ నార్సింగి పోలీస్ !
## బాలుడు ఆచూకీ లభ్యం.. క్షేమం




ప్రజాపక్షం/రంగారెడ్డి: గండిపేటలోని గండి మైసమ్మ ఆలయ పరిసరాల్లో తప్పిపోయిన బాలుడిని (03) నార్సింగి పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలతో కాపాడారు. మంగళవారం సాయంత్రం తెల్లాపూర్ గ్రామానికి చెందిన వడ్డే వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ సమీపంలో వెంకటేష్ ముఖం కడుక్కుంటున్న సమయంలో, పక్కనే ఉన్న ఆయన కుమారుడు అభిమన్యు అదృశ్యమయ్యాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన తీవ్రతను గుర్తించిన నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరి కృష్ణారెడ్డి వెంటనే నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆలయ పరిసరాల్లోని పరిశీలిస్తుండగా సమీపంలోని పొదల్లో బాలుడు ఉన్నట్లు గుర్తించారు. వీధికుక్కలు బాలుడిని పొదల్లోకి లాక్కెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ దాడిలో బాలుడికి స్వల్ప గాయాలు కావడంతో వెంటనే కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించి వైద్య సాయం అందించారు. ప్రస్తుతం బాలుడు క్షేమంగా ఉన్నాడని, సకాలంలో స్పందించి తమకుమారుడిని ఆచూకీని గుర్తించి, ప్రాణాపాయం నుంచి తప్పించిన పోలీసు బృందాన్ని బాలుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

# సోదరభావం పెంచేందుకు హోలీ దోహదం

ప్రజాపక్షం/రంగారెడ్డి: సామాజిక సామరస్యాన్ని, సోదరభావాన్ని ప్రోత్సహించడంలో హోలీ ఎంతగానో దోహదపడుతుందని హస్తినాపురం నారాయణ ఒలింపియాడ్ పాఠశాల ప్రిన్సిపాల్ జివిఎల్ శారద తెలిపారు. మంగళవారం హస్తినాపురంలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో హోలీని ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు ప్రసంగాలు, సాంప్రదాయకంగా రంగులు చల్లుకునే రంగురంగుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్ జిఎం గోపాల్‌రెడ్డి, దిల్‌సుక్‌నగర్ డివిజన్ ఎజిఎం హెమెంబర్, ఆర్‌ఐ రవి ప్రసాద్, శివరంజిని, మహేశ్వరి, మీనా, శరత్‌బాబు, గాయత్రి, శిరీష, ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, ఈకిడ్జ్ వైస్ ప్రిన్సిపాల్, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, శిల్ప, హైస్కూల్ ఎడిలు దేవి, ఏఓలు రాజేష్, కరుణాకర్ పాల్గొన్నారు.





**కొత్తూరు:** చెడుపై మంచి విజయం సాధించినందుకు ప్రతీకగా హోలీ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడ గుడెం సుదర్శన్‌గౌడ్ వివరించారు. బుధవారం కొత్తూరు మున్సిపాలిటితోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. హోలీ ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకొకుండా ఉండేందుకు పోలీసులు తగిన బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ జెడ్‌పిటిసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ తోపాటు మండల యూత్ అధ్యక్షుడు కడాల శ్రీశైలం, ఉపసర్పంచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డుల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలనీల్లో డిజెలు, బ్యాండ్లు పెట్టి హోలీ సంబరాలను నిర్వహించారు. రాఘవేంద్ర కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వినోద్‌కుమార్ అధ్యక్షతన కామ దహనం చేయడంతోపాటు హోలీ ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు చెవేళ్ళ శ్రీనివాస్, యాదయ్య, క్యూసెట్ శ్రీనివాస్, నర్సింలు, వర్షిత్, రిత్విక్ రిషి, రోషిత్, అనిరుద్ పాల్గొన్నారు.

**యాచారం :** మండల పరిధిలోని చిన్నతూండ్ల గ్రామంలో హోలీ పండుగ వేడుకలు గ్రామ సర్పంచ్ అంబోజి రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. రంగులు చల్లుకుంటు యువతీ యువకులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొ న్నారు.







రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా నుంచి తాజాగా విడుదల చేసిన రైరై రారా సాంగ్ ట్రెండింగ్‌లో నడుస్తోంది. తెలుగు వెర్షన్ సాంగ్ హిస్టరీ క్రియేట్ చేస్తోంది. గంటల్లో ఇప్పటివరకు 31 మిలియన్స్ వ్యూస్ దాటిన రికార్డు సొంతం చేసుకుంది.

రీల్

# ‘క్రేజీ కల్యాణం’ బాల్ రాజ్‌గా తరుణ్ భాస్కర్

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ‘క్రేజీ కల్యాణం‘. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ‘క్రేజీ కల్యాణం‘ మూవీ నుంచి టాలెంటెడ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ నటించిన బాల్ రాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తరుణ్ భాస్కర్ సూపర్ మ్యాన్ లా మంచి జోష్ లో కనిపిస్తున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్‌మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ‘క్రేజీ కల్యాణం‘ సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ జె.గాయత్రి దేవి, ఆర్ట్ డైరెక్టర్ సాయి కదిర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి యాక్షన్ డ్రాగన్ ప్రకాష్, లిరిక్స్ వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ శ్రాటవణ్, డీవోపీ శ్యామ్ స్క్రీన్ ప్లే శ్రీనివాస రవీంద్ర (ఎంఎస్ ఆర్).






# నిర్మాతగా శివాజీ సక్సెస్ కావాలి

## ప్రీ రిలీజ్ వేడుకలో బ్రహ్మానందం

శివాజీ, లయ జంటగా నటించిన సినిమా ‘సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’మార్చి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, బండ్లగణేష్ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా హాస్య బ్రహ్మ బ్రహ్మానందం మాట్లాడుతూ ’ తమ్ముడు శివాజీ నాకు అత్యంత ఆప్తుడైన వ్యక్తి. యంగ్ బ్యాచ్ అంతా కలిసి ఓ మంచి సినిమాను చేశారు. అలీ అన్న శివాజీ సినిమా ఫంక్షన్కు వెళదాం రా అన్నాడు. వెంటనే ఆలోచించకుడా వచ్చాను. గతంలో శివాజీ నిర్మించిన సినిమాలతో పాటు ఆయనతో కలిసి నటించాను. ఇలాంటి పండగ వాతావరణం ఉన్న ఫంక్షన్లో పాల్గొనడం నాకు ఉత్సాహంగా ఉంది. ఈ సినిమాలో ఎంతో మంది ప్రతిభ ఉన్న కమెడియన్స్ నటించారు. ఇంత మంది టాలెంటెడ్ ఆర్టిస్టులు ఒకే సినిమాలో కనిపించడం చాలా అరుదు. అది ఈసినిమాకు దక్కింది. పండగ వాతావరణంలో ఉన్న ఈ సినిమా అందర్ని నవ్వులతో అలరిస్తుందని నమ్ముతున్నాను. ఈసినిమా తప్పకుండా సక్సెస్ అవుతుందని, నిర్మాతగా శివాజీ విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. బండ్ల గణేష్ మాట్లాడుతూ ఈటీవీవిన్ సంస్థ ఎంతో మంది నూతన ప్రతిభను ప్రోత్సాహిస్తున్నారు.

# 109 సెంటర్లలో ఎంఎస్జి 50 రోజులు పూర్తి

చిరంజీవి మరోసారి తాను మాస్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లలో తిరుగులేని రాజు అని నిరూపించారు. షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల నిర్మించిన ఆయన లేటెస్ట్ బ్లాక్ బస్టర్‌గా మన శంకరవరప్రసాద్ బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడమే కాకుండా 50 రోజుల థియేట్రికల్ రన్ సాధించింది. ఈ చిత్రం రీజినల్ స్థాయిలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. చిరంజీవి, అనిల్ రావిపూడి కెరీర్లో తొలి 400 కోట్ల బ్లాక్ బస్టర్‌గా రికార్డు సృష్టించింది. ఉత్తర అమెరికాలో దాదాపు 3.5 మిలియన్ డాలర్ల వసూళ్లు సాధించి గ్లోబల్ మార్కెట్లో కూడా తన పవర్‌ని చాటింది. అలాగే బుక్‌మైషోలో 3.8 మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడవడం రీజినల్ సినిమాల్లో హయ్యస్ట్ రికార్డ్. కీలక పాత్రలో విక్టరీ వెంకటేష్ నటించడం, నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే.



# అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ‘సరస్వతి’

## నిర్మాత పూజా శరత్ కుమార్

వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం’సరస్వతి’. ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత పూజా శరత్ కుమార్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. సరస్వతి మంచి థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ట్విస్టులు ఉన్న సినిమా. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. రెండు గంటల సినిమాని ఎంత గ్రిప్పింగా చేయాలో అంత అద్భుతంగా సినిమాని తీర్చిదిద్దాం. ప్రియమణి క్యారెక్టర్ గురించి ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. వరలక్ష్మి మంచి విజన్‌తో ఆ క్యారెక్టర్‌ని డిజైన్ చేసింది. ఆ క్యారెక్టర్‌కి ప్రియమణి పర్ఫెక్ట్ యాప్ట్. చాలా మంచి పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఇదొక క్రైమ్ థ్రిల్లర్. చాలా మంచి సోషల్ మెసేజ్ ఉం.ది ఈ ట్రైలర్ లో ప్రతి అమ్మాయి సరస్వతి లాగా ఉండదు సమయం వస్తే కాళీలా మారుతుంది అనే ఒక డైలాగ్ ఉంది. ఈ కథ వెనుక ఉన్న ఆలోచన అదే. ఒక స్ట్రాంగ్ విమెన్ క్యారెక్టర్ ఇందులో చూస్తారు. చాలా బలమైన కథ ఇది. వరలక్ష్మి చాలా పర్సనల్‌గా కనెక్ట్ అయిన కథ. ఈ కథ ఈటీవీ బాపినీడు చెప్పాం, వారికి చాలా నచ్చింది. మేమే చేస్తామని చెప్పారు. ఇందులో కోర్ట్ సీన్స్ చాలా ఇంపార్టెంట్. దాదాపు 7 నిమిషాల సింగిల్ షాట్ ఒకటి ఉంది. అది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. పరిశ్రమలో తన జర్నీ చాలా స్ఫూర్తి దాయకం. జనవరి 6న ఈ సినిమా తెలుగులో రిలీజ్ అవుతుంది.



# 31 మిలియన్ల వ్యూస్ దాటిన ‘పెద్ది’ సాంగ్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా నుంచి తాజాగా విడుదల చేసిన రైరై రారా సాంగ్ ట్రెండింగ్‌లో నడుస్తోంది. తెలుగు వెర్షన్ సాంగ్ హిస్టరీ క్రియేట్ చేస్తోంది. విడుదల అయిన అతి కొద్ది గంటల్లో ఇప్పటివరకు 31 మిలియన్స్ వ్యూస్ దాటిన రికార్డు సొంతం చేసుకుంది. ఈ పాటలో రామ్ చరణ్ వేసిన హుక్ స్టెప్ వరల్డ్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఏ ఆర్ రెహమాన్ అందించిన సంగీతం ఇప్పుడు శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చరణ్ సరసన జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ 30వ తేదీన ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జగపతిబాబు ఈ సినిమాలో కొత్త అవతారంలో కనిపిస్తారు. మైత్రీ మూవీస్, వైద్యుని సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ రత్నవేలు, ఎడిటింగ్ నవీన్ నూలీ.




# మెన్షన్ హౌస్ మల్లేష్

## ఫ్యామిలీ సినిమా హీరో శ్రీనాథ్ మాగంటి

శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘మెన్షన్ హౌస్ మల్లేష్’. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 6న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో శ్రీనాథ్ మాగంటి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మా టైటిల్ మెన్షన్ హౌస్ మల్లేష్.. అయితే ఓవర్ లుక్ లో టైటిల్ ని అలా అనిపిపిస్తోంది. ఇందులో నా క్యారెక్టర్ తప్పుగా ఆ పేరు రాస్తాడు. కానీ జనాలు రైట్ గా చదువుతున్నారు. సినిమాకి క్యాచి టైటిల్ కావాలి. అలా ఈ టైటిల్ తో ఆకట్టుకున్నాం. పాటలు కూడా జనాల్లోకి వెళ్ళాయి. పొగరుబోతు, దారితప్పి లేని పోనీ అలవాట్లుతో వున్న ఓ క్యారెక్టర్ ని అతని తల్లి, భార్య ఎలా దారిలోకి తీసుకొస్తారనేది చాలా సరదాగా చెప్పాం. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనింగ్ కామెడీ జానర్ ఫిల్మ్. ఫ్యామిలీ అంతా కలసి నవ్వుకునే సినిమా. ఈ సినిమాలో నన్ను నేను కొత్తగా చూపించుకోడానికి ఒక అవకాశం దొరికింది. ఈ సినిమా యాక్టర్ కోసం కొన్ని రియల్ లైఫ్ క్యారెక్టర్స్ ని అబ్జర్వ్ చేశాను. అలాగే మా అమ్మ పాత చున్ని ఉంటే దాన్ని చొక్కాగా కుట్టించుకుని వేసుకున్నాను. మల్లేష్ ని చూపించడానికి నేను చాలా మారాల్సి వచ్చింది. ఈ సినిమాతో ఆడియన్స్ నా పేరు గుర్తుపెట్టుకుంటారని నమ్ముతున్నాను. సతీష్‌కి ఇది ఫస్ట్ సినిమా. ఆయన చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ ఇలా అన్ని విషయాల్లోనూ చాలా కేర్ తీసుకున్నారు.అలాగే వంద శాతం. లవ్ అనే వెబ్ సిరీస్ చేశారు.



## విచారణ చెల్లదు

(మొదటి పేజీ తరువాయి)

మనువడైన సి.శ్రీనివాస్‌కు 2018లో గిఫ్ట్ డీడ్ చేశారు. ఆ స్థలంలో శ్రీనివాస్ ఇళ్లను నిర్మించాడు. అయితే, శ్రీనివాస్ తన సంరక్షణ, పోషణ చర్యలు తీసుకోవడం లేదంటూ రాములు గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలని సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం–2007 సెక్షన్ 23 కింద కీసర రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌ను ఆశ్రయించారు. గిఫ్ట్ డీడ్‌లో షరతులు లేనందున, ఇది సివిల్ వివాదమని చెప్పి దానిని ఆర్డీవో కొట్టివేశారు. దీనిపై రాములు మెడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ దాఖలు చేస్తే.. ఆర్డీవో ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించారు. అప్పీల్‌ను 2023 జూలై 6న కలెక్టర్ కొట్టేశారు. దీంతో వృద్ధుడు రాములు కమిషనర్/డైరెక్టర్ (సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ) వద్ద రెండో అప్పీల్ దరఖాస్తు చేశారు. దీనిని కమిషనర్ 2025 మార్చి 18న స్వీకరించి మళ్లీ కలెక్టర్ సమీక్షించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. దీనిఆధారంగా కలెక్టర్ కేసును తిరిగి విచారించి 2025 ఏప్రిల్ 22న గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చర్యలను సవాలు చేస్తూ శ్రీనివాస్ మూడు వేర్వేరు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు అయితే సింగిల్ జడ్జి అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ పూర్తి చేసి.. సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం–2007లోని న్యాయపరమైన వ్యవస్థను వివరించింది. చట్టం ప్రకారం తొలుత ఆర్డీవో విచారణ చేయాలని, ఆర్డీవో నిర్ణయంపై జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్‌కు అవకాశం ఉంటుందని పేర్కొంది. కలెక్టర్ ఇచ్చిన అప్పీల్ తీర్పే తుది నిర్ణయమని చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపింది. కమిషనర్ జోక్యం చేసుకుని కలెక్టర్ రెండోసారి విచారణ చేయాలని ఆదేశించడం చెల్లదని డివిజన్ బెంచ్ తేల్చింది. కలెక్టర్ గిఫ్ట్‌డీడ్ రద్దు చేయడం చెల్లదని పేర్కొంది. కలెక్టర్ నిర్ణయాన్ని సింగిల్ జడ్జి సమర్థిస్తూ ఇచ్చిన తీర్పు కూడా చెల్లదని తేల్చింది. కలెక్టర్ తీర్పుపై కమిషనర్ వద్ద రెండో అప్పీల్ లేదా రివ్యూ విచారణకు చట్టంలో ఎలాంటి నిబంధన లేదని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. చట్టంలో లేని అధికారాన్ని వినియోగించి కమిషనర్ వినియోగించుకోవడం చెల్లదని చెప్పింది. కమిషనర్ ఉత్తర్వులు చెల్లవు కాబట్టి వాటి ఆధారంగా కలెక్టర్ ఇచ్చిన గిఫ్ట్ డీడ్ రద్దు ఆదేశాలు కూడా చెల్లవంది ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కూడా చెల్లుబాటు కాదంది. గిఫ్ట్ డీడ్ చెల్లుబాటు లేదా రద్దు అంశంలోకి తాము వెళ్లడం లేదని, గిఫ్ట్‌డీడ్‌లోని ఆస్తి విషయంపై సివిల్ కోర్టులో రాములు తేల్చుకోవచ్చునని స్పష్టం చేసింది.

## ఎలాంటి రాజీ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక అంశాలతో పాటు నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.ఆనకట్ట భద్రతా చర్యలు సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ (ఎం. బాగా రెడ్డి సింగూర్ ప్రాజెక్టు)పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టిఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ ఏటా హైదరాబాద్‌కు 6–7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం చేసేంత వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.బండ్‌దిగువన నీటిని పూర్తిగా వదలకుండా నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు,అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2–3 రోజుల్లో నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించిన మంత్రి పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని సైతం మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయని మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**దీర్ఘకాలిక భద్రతా చర్యలు :**

2025 ఆగస్టులో డ్యామ్ నీటి సామర్థ్యం మేరకు దిగవకు నీటిని విడుదల చేసిన సమయంలో ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా నీటిమట్టాన్ని తగ్గించి ప్రధాన మరమ్మత్తులు చేపట్టినట్లు ఆయన వివరించారు. సింగూర్ డ్యామ్ భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రధాన్యమైందని మంత్రి పునరుద్ఘాటించారు. ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు .పాలెం వాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5 వేల కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ఆందోళన చెందొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రంగాలకు చెందిన నిపుణులు తమ సేవలను అందిస్తున్నారని, అలాంటి ఉపాధ్యాయులకు సమాజంలో ఎంతో గౌరవం ఉన్నదని అన్నారు. ఉపాధ్యాయ వేతనాల విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, వారి వేతనాలను తగ్గించబోదని, ఈ విషయంలో ఎవ్వరూ గందరగోళం పడాల్సిన అవసరం లేదని కేశవరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విశ్వవిద్యాలయ ఉప కులపతులు, ప్రొఫెసర్లు, మేధావుల స్థాయిలో తాము 11 కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యా కమిషన్ లో పిహెచ్‌డి చేసిన వారు లేరనడం సరైంది కాదని, ఆ కమిటీలో విశ్వవిద్యాలయ విభాగం హెడ్‌గా పనిచేసిన ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు లాంటి వారు కూడా ఉన్నారని వివరించారు. విద్యా కమిషన్ సిఫార్సులను రూపొందించడంలో ఆకునూరి మురళి,ఆ కమిటీ బృందం బాగా పని చేసిందని కేశవరావు అభినందించారు.

# నేడు నేపాల్‌లో ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

కావడం ఈ ఎన్నికల్లో ప్రత్యేక విశేషం. నేపాల్ మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి (సిపిఎన్–యుఎంఎల్) పోటీ చేస్తున్న ఝూపా–5 నియోజకవర్గంలో పోటీ చేస్తున్న 35 ఏళ్ళ యువకుడు, కాఠ్మండు మాజీమేయర్ బలేంద్ర షా ఇప్పుడు ప్రధానమంత్రి పదవికి పెద్ద పోటీదారుడుగా ముందుకు వచ్చారు. ఈ నియోజకవర్గంలో జరుగుతున్న పోటీ దేశంలో అందరినీ ఆకర్షిస్తోంది. ఇక ప్రచండ నాయకత్వాన గల ఎన్‌సిపి, రవి లామింఛ్‌హాన్ నాయకత్వానగల రాష్ట్రీయ స్వతంత్రపార్టీ, గగన్ థాపా నాయకత్వాన గల నేపాలీ కాంగ్రెస్ కూడా పోటీలో ఉన్నాయి. దాదాపు కోటీ 90 లక్షలమంది అర్హులైన ఓటర్లు 165 నియోజకవర్గాలలో ప్రత్యక్షంగా అభ్యర్థులను ఎన్నుకుంటారు. ఈసారి ఓటింగ్ పెరుగుతుందని ఆశిస్తున్నట్లు ఎన్నికల సంఘం తాత్కాలిక కమీషనర్ రామ్ ప్రసాద్ భండారి చెప్పారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుంది. ఈ ఎన్నికల్లో ఎనిమిది లక్షలమంది ఓటర్లు మొదటిసారి పోలింగ్‌లో పాల్గొంటున్నారు. దక్షిణ ఆసియాలో అతిపేద దేశంగా నేపాల్ పేరుపడింది. పది సంవత్సరాలక్రితం దేశం ప్రజాస్వామ్య ప్రక్రియలోకి వచ్చింది. ఐనప్పటికీ కూడా ప్రజలకు ఇంకా ఆర్థిక హక్కులు సమకూరలేదు. దేశం ఇంకా బాలారిష్టాలను ఎదుర్కొంటున్నది. పరిమితంగా వచ్చే ఆదాయ వనరులన్నీ జీతాలు, పెన్షన్లు, పాలనాఖర్చులకే సరిపోతున్నాయి. అభివృద్ధికి తగిన పెట్టుబడులు లేవు. అనేక వేలమంది నేపాలీ యువకులు గల్ఫ్, మలేసియా సహా అనేక దేశాల్లో తక్కువ నైపుణ్యంగల పనులు చేసుకుని బతుకుతున్నారు.నేపాల్ ప్రస్తుత స్థూల జాతీయోత్పత్తి కేవలం 45 బిలియన్ డాలర్ల లోపే ఉంది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com